సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం  వెల: ₹ 7.00  సంపుటి: 12 సంచిక: 326

SUNDAY Special  ఆదివారం 16-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



## కెమ్ ఛో ట్రంప్!

మోతెరా స్టేడియంలో మోదీ, ట్రంప్ పాల్గొనే కార్యక్రమం... భద్రతకు ఎన్ఎస్జీ స్నైపర్లు

- 5లో



## చూపులు కలవని శుభవేళ

మెగాస్టార్ చిరంజీవి, సురేఖ దంపతులతో 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

- ఫ్యామిలీలో

● నేడు అమిత్ షా ఇంటికి

### షహీన్‌బాగ్ ర్యాలీ



పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలంటూ ఢిల్లీలోని షహీన్‌బాగ్ నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇంటి వరకూ ర్యాలీ చేపట్టనున్నట్లు షహీన్‌బాగ్ నిరసనకారులు తెలిపారు. సీఏఏపై అనుమానాలు ఉన్నవారు తన వద్దకు వస్తే వివరిస్తానని అమిత్‌షా చెప్పినందుకే ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

- 5లో

● ట్రంప్ మాట..

### ఫేస్‌బుక్ ఇచ్చిన గౌరవం



సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ తనకు తొలిస్థానం, మోదీకి రెండో స్థానం ప్రకటించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్విట్టర్‌లో ప్రకటించారు. అయితే మోదీ ఫేస్‌బుక్ ఖాతాలో 4.4 కోట్ల మంది ఫాలోవర్లు ఉండగా ట్రంప్‌కు 2.75 కోట్ల మంది ఫాలోవర్లున్నారు.

- 5లో

● మొక్కలు నాటాలన్న కేటీఆర్

### సీఎం బర్త్‌డేకు ఏర్పాట్లు



ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ 66వ జన్మదినం సందర్భంగా ఈ నెల 17న పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాల్సిందిగా కార్యకర్తలకు సూచించారు.

- 3లో

● చైనా కుదేలు..

### కోవిడ్‌తో విలవిల



చైనాలో కోవిడ్–19 మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటివరకూ ఈ వైరస్ బారినపడి 1,523 మంది మరణించగా మొత్తం 66 వేల మంది దీని బారినపడినట్లు నిర్ధారణ అయిందని చైనా ప్రభుత్వం వెల్లడించింది. వారిలో 11,053 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

- 5లో



# జీవ నదులకు 'పచ్చ'లహారం!

## గోదావరి, కృష్ణాకు ఇరువైపులా 5 కి.మీ. మేర అటవీ క్షేత్రాలు, ఉద్యాన తోటలు

- పరీవాహక ప్రాంతాల అభివృద్ధి, నదీ జలాలు కలుషితం కాకుండా కార్యాచరణ
- దేశవ్యాప్తంగా 9 నదుల పునరుజ్జీవానికి కేంద్రం కసరత్తు
- అందులో రాష్ట్రంలో గోదావరి, కృష్ణాల పరిధిలో పర్యావరణ సమతౌల్యతకు చర్యలు
- మార్చి నెలాఖరుకల్లా కేంద్రానికి డీపీఆర్ పంపనున్న రాష్ట్ర ప్రభుత్వం

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర జీవనాడి.. గోదావరి, కృష్ణా నదుల పునరుజ్జీవానికి కేంద్ర ప్రభుత్వం నడుంబిగించింది. గంగా నది తరహాలోనే దేశంలోని 9 జీవనదుల పరీవాహక ప్రాంతాల్లో అటవీ ప్రాంత అభివృద్ధి, పర్యావరణ సమతౌల్యత ద్వారా పునరుజ్జీవం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో గోదావరి, కృష్ణా నదులకు ఇరువైపులా 5 కి.మీ., వాటి ఉప నదులకు ఇరువైపులా 2 కి.మీ.ల మేర ప్రాంతాన్ని అభివృద్ధి చేయనుంది. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆ ప్రాంతంలో అటవీ క్షేత్రాలు, ఉద్యానతోటల పెంపకాన్ని చేపట్టనుంది. ఈ పరిధిలోని ప్రైవేటు భూముల్లోనూ ఇదే తరహా అభివృద్ధి జరగనుంది. వాటర్‌షెడ్‌లు, చెక్ డ్యామ్‌లు నిర్మించడమే కాకుండా నదులు కోతకు గురికాకుండా చర్యలు తీసుకోనుంది. గోదావరి, కృష్ణా నదులు, ఉపనదుల పరీవాహక ప్రాంతాల్లో సుమారు 52 లక్షల ఎకరాల పరిధిలో ఈ రకమైన అభివృద్ధి చేయనున్నట్లు అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు. ఇందుకోసం రెవెన్యూ, అటవీ, వ్యవసాయ, ఉద్యాన, గ్రామీణాభివృద్ధి శాఖలు మార్చి 10కల్లా ప్రతిపాదనలతో కూడిన నివేదికలను ప్రభుత్వానికి సమర్పించనున్నాయి. వాటిని క్రోడీకరించాక రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమగ్ర నివేదికను పంపనుంది. ఈ ప్రక్రియ మార్చి నెలాఖరుకల్లా పూర్తి కానుంది. ఆ తర్వాత కేంద్రం తన పని ప్రారంభించనుందని అధికార వర్గాలు తెలిపాయి.

**ఎందుకు చేస్తున్నారంటే...!**

దేశంలో ఏర్పాటైన మొదటి ఇరిగేషన్ కమిషన్ నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉపరితల ప్రవాహం ఏడాదికి 116.76 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం)గా అంచనా వేసింది. 1949లో ఈ ప్రవాహాన్ని కోస్లా ఫార్ములాలో లెక్కించగా 125.529 బీసీఎంగా తేలింది. సగటు ప్రవాహాన్ని 11.54 బీసీఎంలుగా నిర్ధారించారు. అయితే నదుల్లో ఏటా 0.99 బీసీఎంల నీరు కాలుష్యం బారిన పడుతోందని పలు అధ్యయనాల్లో

మిగతా 2వ పేజీలో ▶



## అభిమానం 'ఆకృతి' ఐతే..

**గజ్వేల్:** ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో రెండ్రోజుల ముందే ఆయన జన్మదిన వేడుకల సందడి నెలకొంది. ఈనెల 17న కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఇక్కడి టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు తమ అభిమాన నేతకు వినూత్న రీతిలో శుభాకాంక్షలు చెప్పారు. శనివారం పట్టణంలోని మైదానంలో 66 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 2,600 మంది తమ అభిమాన నేత కేసీఆర్ ఆకారంలో నిలబడ్డారు. ఈ దృశ్యాన్ని 120 మీటర్ల ఎత్తు నుంచి డ్రోన్ కెమెరాలో బంధించారు. అనంతరం మొక్కలు నాటి హరిత స్ఫూర్తిని చాటారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్మన్ బాలమల్లు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ భూపతిరెడ్డి పాల్గొన్నారు.

## జిల్లాలకు ఐటీ విస్తరణ

- రాష్ట్రంలో మరిన్ని జిల్లాలకు ఐటీని విస్తరించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ మేరకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే వరంగల్, కరీంనగర్ లాంటి జిల్లాల్లో పలు కంపెనీలను ఏర్పాటు చేయగా, మరికొన్ని జిల్లాల్లో ఏర్పాటుకు వివిధ కంపెనీలతో ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

- వివరాలు 4లో



## 19న ఎంసెట్ నోటిఫికేషన్

- 21వ తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఈసారి వికలాంగులకూ ఫీజు తగ్గింపు
- మే 4, 5, 7 తేదీల్లో ఇంజనీరింగ్.. 9, 11 తేదీల్లో అగ్రికల్చర్ పరీక్ష

**సాక్షి, హైదరాబాద్:** ఇంజనీరింగ్, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎంసెట్–2020 నోటిఫికేషన్‌ను ఈనెల 19న జారీ చేయాలని ప్రవేశాల కమిటీ నిర్ణయించింది. ఈ నెల 21 నుంచి మార్చి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఎంసెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పాపిరెడ్డి మాట్లాడుతూ.. 20 జోనల్

మిగతా 2వ పేజీలో ▶

## 'సహకారం' 79.36 శాతం

- ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ
- ఓటు హక్కు వినియోగించుకున్న 9.11 లక్షల మంది
- నేడు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక
- రేపు డీసీసీబీ అధ్యక్షుల నియామక నోటిఫికేషన్
- ఈ నెల 24 నాటికి డీసీసీబీ అధ్యక్షుల ఎన్నిక
- 29న టెస్కాబ్ చైర్మన్ ఎలక్షన్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 747 ప్యాక్స్‌లకు (వాటిల్లోని 6,248 డైరెక్టర్ పదవులు) జరిగిన ఎన్నికల్లో 79.36 శాతం ఓటింగ్ జరిగినట్లు వెల్లడించింది. అత్యధికంగా మేడ్చల్ జిల్లాలో 89.82 శాతం ఓటింగ్ జరిగింది. ఆ తర్వాత జగిత్యాల జిల్లాలో 87.99 శాతం ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అథారిటీ వెల్లడించింది. అత్యంత తక్కువగా నారాయణపేట జిల్లాలో కేవలం 55.78 శాతం మాత్రమే ఓటింగ్ జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11.48 లక్షల మంది ఓటర్లకుగాను, 9.11 లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో 906 ప్యాక్స్‌లకుగాను 904 పరిధిలోని 11,653 డైరెక్టర్ స్థానాలకు (ప్రాయోజిత నియోజకవర్గాలు) సహకార ఎన్నికల అథారిటీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే నామినేషన్ల ఉపసంహరణ తరువాత 157 ప్యాక్స్‌లు... వాటిల్లోని 2,017 డైరెక్టర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే

మిగతా 2వ పేజీలో ▶

## విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** వార్షిక ఆదాయ అవసరాలను (ఏఆర్ఆర్) తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ)కి విద్యుత్ పంపిణీ సంస్థలు సకాలంలో దాఖలు చేయకపోవడంతో విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన ప్రస్తుతానికి వాయిదా పడింది. ఏఆర్ఆర్‌ను దాఖలు చేయడానికి ముందే విద్యుత్ చార్జీలు పెంచాలని విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కమ్‌లు) భావించి, సీఎం ఆమోదం పొందేందుకు ప్రయత్నించాయి. అయితే సీఎం అపాయింట్‌మెంట్ దొరక్కపోవడంతో ఏఆర్ఆర్ సమర్పణకు మరికొంత కాలం గడువు ఇవ్వాలని ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావును కోరగా, అందుకు అనుమతిచ్చినట్లు తెలిసింది. 2019–20, 2020–21 సంవత్సరాలకు గాను ఏఆర్ఆర్‌ను డిస్కమ్‌లు శనివారం ఈఆర్సీకి సమర్పిస్తాయనే ప్రచారం జరిగింది. 2019–20లో రూ.11వేల కోట్లు,

మిగతా 2వ పేజీలో ▶










ఇదండీ సంగతి



# నేడు కేబినెట్ భేటీ

## పల్లె ప్రగతి ప్రధాన ఎజెండాగా మంత్రిమండలి సమావేశం

- సీఏఏ, ఎన్నార్సీపై అనుసరించాల్సిన వైఖరిపై చర్చ?
- నిధుల కేటాయింపులో కేంద్రం చూపుతున్న వివక్షపై ప్రస్తావన
- ఎన్ఆర్ఐ, రెవెన్యూ కొత్త చట్టాలపై భేటీలో చర్చించే అవకాశం
- అదనపు కలెక్టర్ల పోస్టుల నిర్ణయాన్ని ఆమోదించనున్న కేబినెట్?

**సాక్షి, హైదరాబాద్:** పట్టణ ప్రగతితో పాటు సీఏఏ, ఎన్నార్సీ, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో వివక్ష తదితర అంశాలు ప్రధాన ఎజెండాగా సీఎం కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనుంది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సమావేశానికి సంబంధించి ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను ఆదేశించారు. జనవరి మూడో వారంలో మున్సిపల్ ఎన్నికలు ముగియడంతో పల్లె ప్రగతి తరహాలో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని కేసీఆర్ భావిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి మొదటి వారంలో ప్రారంభమవుతాయని భావిస్తున్న నేపథ్యంలో.. ఆలోగా పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ముగించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఫిబ్రవరి 20 నుంచి మార్చి 5 వరకు నిర్వహించాల్సిన పట్టణ ప్రగతికి సంబంధించిన పూర్తి వివరాలపై ఆదివారం కేబినెట్‌లో చర్చ జరిగే అవకాశముంది. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర కార్యక్రమాల జోలికి వెళ్లకుండా పూర్తిగా పట్టణ ప్రగతిపై దృష్టి కేంద్రీకరించేలా ఈ సమావేశంలో మార్గనిర్దేశనం చేసే అవకాశముంది. రాష్ట్రంలో కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటై పాలక మండళ్లు కొలువుదీరిన నేపథ్యంలో పట్టణ సమస్యలకు పల్లె ప్రగతిలో పరిష్కారం చూపాలని సీఎం భావిస్తున్నారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్యం, మొక్కల పెంపకం, విద్యుత్ సమస్యల ఏర్పాటుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై సీఎం స్పష్టత ఇచ్చే అవకాశముంది.

**సీఏఏ, ఎన్నార్సీపై తీర్మానం?**

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ) తదితరాలపై ప్రభుత్వ వైఖరి ప్రకటిస్తామని

మిగతా 2వ పేజీలో ▶






## కేజ్రీ... హ్యాట్రిక్!



**ఢిల్లీ అసెంబ్లీ పీఠంపై సామాన్యుడు మూడోసారి ఇవాళ ప్రమాణ స్వీకారం చేయనున్నాడు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ విద్య, వైద్య రంగంలో చేసిన అభివృద్ధి, ఉచిత సంక్షేమ పథకాలు, ఎన్నికలకు ముందు సంయమనం సాగిస్తూ చేసిన పాజిటివ్ ప్రచారం తిరిగి ఆయను ఢిల్లీ పీఠంపై కూర్చోబెట్టాయి. మన దేశంలో ఇలా హ్యాట్రిక్ కొట్టిన సీఎంలు ఎందరు ? సుదీర్ఘ కాలం సీఎంలుగా పనిచేసిన వారు ఎవరు ? బ్రేక్ లేకుండా అన్ని సంవత్సరాలు ఎలా అధికారంలో కొనసాగారు? ఇదే ఇవాళ్టి సండే స్పెషల్...**

## పవన్ కుమార్ చామ్లింగ్ (ఎస్‌డీఎఫ్)

**రాష్ట్రం:** సిక్కిం
**పదవీ కాలం:** 24 ఏళ్ల 165 రోజులు



సిక్కిం ముఖ్యమంత్రిగా సేవలు అందించిన పవన్‌కుమార్ చామ్లింగ్ ఏకంగా అయిదు సార్లు అప్రతిహతంగా అధికారాన్ని అందుకున్నారు. 1994లో తొలిసారిగా సీఎం పీఠం ఎక్కిన ఆయన గత ఏడాది వరకు అదే పదవిలో కొనసాగారు. తన గురువు, సిక్కింను పరిపాలించిన నార్ బహదూర్ భండారీపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన చామ్లింగ్ 1992లో సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్)పేరుతో కొత్త పార్టీ పెట్టారు. భండారీది అరాచకవాదమని, తాను ప్రజాస్వామ్యం ఎలా ఉంటుందో చూపిస్తానంటూ ఎన్నికల బరిలో దూకి 1995లో సీఎం పదవి చేపట్టారు. అభివృద్ధి, శాంతిభద్రతలపై ఎక్కువ దృష్టి సారించారు. సిక్కిం రాష్ట్రంలో సహజ వనరుల్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని, పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించారు. బడ్జెట్‌లో 70 శాతం నిధుల్ని గ్రామీణ ప్రాంతాల్లోనే వినియోగించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 30శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారత సాధించారు. దేశంలో పూర్తిగా సేంద్రియ పంటలు పండిస్తున్న తొలి రాష్ట్రంగా సిక్కిం 2015లో రికార్డులకెక్కింది. పదో తరగతి వరకు అందరికీ ఉచిత విద్య అందివ్వడం కూడా ప్రజల్లో పవన్‌కుమార్‌పై ఒక క్రేజ్‌ని సృష్టించాయి. చామ్లింగ్ పదవి చేపట్టేనాటికి రాష్ట్రంలో 40శాతానికిపైగా జనాభా దారిద్ర్యరేఖ దిగువన ఉన్నారు. దానిని 8శాతానికి తగ్గించారు. సగటు స్థూల జాతీయోత్పత్తి కంటే ఎప్పుడూ సిక్కింలో అధికంగా ఉత్పత్తి జరుగుతుంది. క్షేత్రస్థాయికి పరిపాలనను తీసుకువెళ్లడం, ప్రజలతో నేరుగా సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం, తాను చేసిన తప్పుల్ని గ్రహించుకొని వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టడం, నిరంతరం పుస్తకాలు చదువుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పాలనలో మార్పులు చేపట్టడం వంటి చామ్లింగ్ చర్యలు ప్రజల్లో చరిష్మాను పెంచాయి. పశ్చిమబెంగాల్‌కు అత్యధిక కాలం సీఎంగా సేవలు అందించిన జ్యోతిబసు రికార్డును బద్దలు కొట్టేలా చేశాయి.

## గాంధీలో 66 మందికి 'కోవిడ్' నిర్ధారణ పరీక్షలు



**గాంధీ ఆస్పత్రి:** నోడల్ కేంద్రమైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో ఇప్పటివరకు చేరిన 66 మంది అనుమానితుల నుంచి రక్తనమూనాలు సేకరించి కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు నోడల్ అధికారి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ముగ్గురు అనుమానితులు ఐసోలేషన్ వార్డులో చేరారని, నమూనాలు సేకరించి నిర్ధారణ పరీక్షలకు గాంధీ మెడికల్ కాలేజీలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన నిర్ధారణ పరీక్షల్లో కోవిడ్ నెగటివ్ వచ్చినట్లు స్పష్టం చేశారు. కోవిడ్ అనుమానితుల కోసం గాంధీ ఆస్పత్రిలో రెండు ఐసోలేషన్ వార్డులు, ఎక్యూట్ మెడికల్ వార్డు, వీఐపీ వార్డుల్లో 37 పడకలు అందుబాటులో ఉంచామన్నారు.

## కేంద్ర సర్వీసుల నుంచి 'సీఎంఓ' కార్యదర్శి పదవీవిరమణ

**సాక్షి, హైదరాబాద్:** సీఎంవోలో ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న రాజశేఖరరెడ్డి కేంద్ర సర్వీసుల నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. భవిష్యనిధి పెన్షన్ విభాగంలో అదనపు కమిషనర్ హోదాలో ఉంటూ డిప్యుటేషన్‌పై సీఎం కార్యాలయంలో ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి మరో నాలుగేళ్ల సమయం ఉన్నా.. అప్పటివరకు రాజశేఖరరెడ్డి డిప్యుటేషన్‌పై కొనసాగేందుకు కేంద్ర నిబంధనలు అంగీకరించవు. ఐదేళ్ల పాటు డిప్యుటేషన్‌పై పనిచేసే వీలుండగా.. ఆ తర్వాత ఏడాది చొప్పున రెండేళ్లు మాత్రమే పొడిగింపు ఉంటుంది. ఆ తర్వాత కొనసాగాలంటే కేంద్రం అనుమతి ఇవ్వాలి. ఇకపై ఆయన సీఎంఓ ప్రత్యేక కార్యదర్శిగానే కొనసాగనున్నట్లు సమాచారం. కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడూ రాజశేఖరరెడ్డి ఓఎస్డీగా పనిచేయటం విశేషం.



## రాజ్‌భవన్ లాన్స్‌లో నెమళ్ల సందడి..

**హైదరాబాద్:** రాజ్‌భవన్ లాన్స్‌లో నెమళ్లు సందడి చేశాయి. తమ లాన్స్‌లోకి అందమైన నెమళ్లు వచ్చాయని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శనివారం పేర్కొన్నారు. 'మా లాన్స్‌లోకి వీవీఐపీ విజిటర్స్ వచ్చాయి. అందమైన రెక్కలు విప్పుకుంటూ లాన్స్‌లో తిరిగాయి. వాటిని చూస్తున్నంత సేపు ఆనందం కలిగింది'అంటూ నెమళ్లను ఉద్దేశించి ట్వీట్ చేశారు. నెమళ్ల ఫొటోలను ట్వీట్‌కు జతచేశారు.

## షూ సాక్సుల్లో బంగారం పేస్ట్ ప్యాకెట్లు

**హైదరాబాద్:** ఎయిర్‌పోర్టులో ఓ ప్రయాణికుడి నుంచి సీఐఎస్‌ఎఫ్ అధికారులు 1,100 గ్రాముల స్వాధీనం చేసుకుని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. శనివారం ఉదయం సింగపూర్ నుంచి టీఆర్ 574 విమానంలో వచ్చిన తమిళనాడుకు చెందిన ప్రయాణికుడి కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో అతడిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అతడి షూ సాక్సుల్లో రెండు బంగారం పేస్టు ప్యాకెట్లు, లోదుస్తుల్లో మరో రెండు బంగారం పేస్ట్ ప్యాకెట్లు బయటపడ్డాయి. మొత్తం 1,100 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న సీఐఎస్‌ఎఫ్ అధికారులు అతడిని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు.



## హైదరాబాద్‌కు చేరుకున్న గల్ఫ్ బాధితులు

**మంత్రి కేటీఆర్ చొరవతో అక్కడి అధికారులు ఏర్పాట్లు**

**శంషాబాద్:** ఉపాధి నిమిత్తం ఇరాక్ వెళ్లి అక్కడ దుర్భర పరిస్థితులు ఎదుర్కొన్న 16 మంది తెలంగాణ వాసులు శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. వివిధ జిల్లాలకు చెందిన వీరు నాలుగేళ్ల కిందట ఇరాక్‌కు వెళ్లారు. అక్కడ ఏజెంట్లు మోసం చేయడం, పాస్‌పోర్టు లాక్కోవడంతో అక్కడ వివిధ పనుల్లో చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం మంత్రి కేటీఆర్ దృష్టికి రావడంతో చర్యలు తీసుకున్నారు. అక్కడి ఎంబసీ అధికారులు తమను స్వరాష్ట్రానికి పంపే ఏర్పాట్లు చేసినట్లు వారు మీడియాకు వివరించారు.

# జీవ నదులకు 'పచ్చ'లహారం!

▶ మొదటి పేజీ తరువాయి

తేలింది. గోదావరిలో ఏటా 4.34 హెకార్ల నేల కోతకు గురవుతుండగా, 23.22 హెకార్ల నేల అవక్షేపాలతో నిండిపోతోంది. దేశవ్యాప్తంగా ఉన్న నదీ పరీవాహక ప్రాంతాల్లో కృష్ణా 23 శాతం, 38 శాతం గోదావరి నది విస్తరించి ఉన్నాయి.

**ఇప్పుడేం జరుగుతోంది..?**

గంగా నదీ పునరుజ్జీవ పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టగా ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదిక తయారీ ప్రక్రియ 2016లో మొదలైంది. ఆ సమయంలో ఈ నివేదిక తయారు చేస్తున్న డెహ్రాడూన్‌లోని అటవీ అధ్యయన సంస్థ (ఎఫ్‌ఆర్‌ఐ) ద్వారా దేశంలోని ప్రధాన జీవ నదులను పునరుద్ధరించేందుకు పూర్తిస్థాయి నివేదికలు తయారు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. అందులో భాగంగానే ఎఫ్‌ఆర్‌ఐ తన ప్రాంతీయ సంస్థల ద్వారా యమున, గోదావరి, కృష్ణా, నర్మద, కావేరి, మహానది, సట్లెజ్, బ్రహ్మపుత్ర, లూనీ నదుల పునరుజ్జీవానికి నివేదికలు తయారు చేస్తోంది. ఈ నేపథ్యంలో గోదావరి, కృష్ణా నదులకు సంబంధించిన కార్యాచరణ రాష్ట్రంలో ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన ప్రభుత్వ అధికారులకు పునరుజ్జీవ ప్రణాళికపై ఇప్పటికే ఓ దఫా శిక్షణ కూడా పూర్తయింది. వారంతా ఎఫ్‌ఆర్‌ఐ నిర్దేశించిన పద్ధతిలో గోదావరి, కృష్ణా నదుల పునరుజ్జీవానికి సంబంధించిన నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

**పునరుజ్జీవం కోసం ఏం చేస్తున్నారంటే**

- సహజ పర్యావరణ వ్యవస్థ (అడవులు, గడ్డి భూములు, చిత్తడి నేలలు)ను పరిరక్షించేందుకు నిర్దేశిత జోన్లలో భూమి, నీటి సంరక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు కలుపు నియంత్రణ, మొక్కల పెంపకం లాంటి చర్యలు చేపడతారు. ఈ క్రమంలో పెంచాల్సిన మొక్కలను డెహ్రాడూన్‌లోని ఎఫ్‌ఆర్‌ఐ ఆయా పరీవాహక ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితుల ఆధారంగా నిర్ణయిస్తుంది. దీనినే నేచురల్ ల్యాండ్‌స్కేప్ అభివృద్ధిగా పరిగణిస్తారు. ఇందుకోసం రైతులు కూడా తమకు అనువైన మొక్క రకాలను ఎంచుకోవచ్చు. రైతు ఎంచుకునే మొక్కలను ప్రభుత్వమే సరఫరా చేయడంతోపాటు సాగుకు అవసరమైన ప్రోత్సాహకాన్ని కూడా నగదు రూపంలో అందజేస్తుంది.
- అటవీ సాగు కోసం పరీవాహక ప్రాంతం పరిధిలోని గ్రామాల్లో పంటల పెంపకాన్ని చేపడతారు. వ్యవసాయ, ఉద్యాన పంటలను పరీవాహక ప్రాంతాల్లోని ప్రైవేటు భూముల్లో రైతుల చేత పండిస్తారు.
- మూడో పద్ధతిలో భాగంగా నది పరీవాహక ప్రాంతాల్లో జీవ పరిహారం, జీవ శుద్ధి కోసం మోడల్ సైట్స్ అభివృద్ధి చేస్తారు.

**గోదావరి, కృష్ణా నదుల స్వరూపం ఇదీ..**

మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్‌లో జన్మించే గోదావరి నది తూర్పు దిశగా 1,465 కి.మీ. ప్రయాణిస్తుంది. తెలంగాణలోని నిజామాబాద్ కందకుర్తిలో మంజీరా, హరిద్రా ఉప నదులతో కలసి త్రివేణి సంగమంగా ప్రవేశించే గోదావరి నది మొత్తం 509.7 కి.మీ. మేర ప్రయాణిస్తుంది. దీనికి ఐదు ఉప నదులు మానేరు (230.3 కి.మీ), మంజీరా (310.2 కి.మీ), పెన్‌గంగా (72.2 కి.మీ), ప్రాణహిత (108.5 కి.మీ), వార్ధా (39.6 కి.మీ) మన రాష్ట్రంలో ప్రవహిస్తాయి. ఇక మహారాష్ట్రలోని మహాబలేశ్వరంలో జన్మించే కృష్ణమ్మ మొత్తం 1,435 కి.మీ. ప్రవహించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసల దీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. తెలంగాణలో 7,420 చదరపు కి.మీ. పరీవాహక ప్రాంతం కలిగి ఉన్న ఈ నది భీమా, డిండి, హాలియా, కృష్ణా, మూసీ, మున్నేరు, పాలేరు, పెద్దవాగు, తుంగభద్ర ఉప నదులను కలిగి ఉంది.

# 'సహకారం' 79.36 శాతం

▶ మొదటి పేజీ తరువాయి

మిగిలిన ప్యాక్స్‌ల్లోని మరికొన్ని స్థానాలు.. అంటే 3,388 డైరెక్టర్ స్థానాలు కూడా ఏకగ్రీవమయ్యాయి. మొత్తంగా 5,405 డైరెక్టర్ స్థానాలు ఏకగ్రీవమైనట్లు సహకార ఎన్నికల అథారిటీ ప్రకటించింది. మిగిలిన 6,248 డైరెక్టర్ స్థానాలకు ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో మొత్తం 14,530 మంది పోటీపడ్డారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఫలితాలు ప్రకటించారు. డైరెక్టర్లు ఎవరో తేలిపోయింది.

**నేడు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక...**

డైరెక్టర్లుగా ఎన్నికైన 11,653 మంది 904 ప్యాక్స్‌లకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఆదివారం ఎన్నుకోనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకల్లా ఈ ప్రక్రియ ముగియనుంది. చైర్మన్, వైస్ చైర్మన్లను చేతులెత్తే పద్ధతి ద్వారా ఎన్నుకుంటారు. అనంతరం జిల్లా కలెక్టర్లు వారి పేర్లను రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీకి పంపిస్తారు. ఆపై వారి పేర్లను అధికారికంగా వెల్లడిస్తారు. ప్యాక్స్ చైర్మన్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అధ్యక్షులను ఎన్నుకుంటారు. ఈ నేపథ్యంలో డీసీసీబీ అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి సోమవారం నోటిఫికేషన్ జారీ చేస్తారు. పాత జిల్లాల ప్రాతిపదికనే డీసీసీబీ అధ్యక్షులను ఎన్నుకుంటారు. ఈ నెల 24 నాటికి డీసీసీబీ అధ్యక్షుల ఎన్నిక పూర్తవుతుంది. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌ను ఎన్నుకునే ప్రక్రియ మొదలవుతుంది. డీసీసీబీ అధ్యక్షులు టెస్కాబ్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. టెస్కాబ్ చైర్మన్ ఎన్నికను ఈ నెల 29 నాటికల్లా పూర్తిచేస్తారు. దీంతో మొత్తం సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియ ముగిసినట్లు అవుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశంతో అత్యంత తక్కువ సమయంలో ఈ ఎన్నికలను సహకారశాఖ సమర్థంగా నిర్వహించిందని అధికారులు పేర్కొంటున్నారు. ప్యాక్స్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ వాట్సాప్‌ను అత్యధికంగా వినియోగించుకుంది. అన్ని జిల్లాల కలెక్టర్లతో ఒక గ్రూపును ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఆదేశాలను వాట్సాప్ ద్వారానే జారీ చేసింది. దీంతో సమయం ఎంతో కలసి వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు.

# 19న ఎంసెట్ నోటిఫికేషన్

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రాల పరిధిలోని 55 ప్రాంతాల్లో ఏర్పాటు చేసే 105 కేంద్రాల్లో ఈ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు పాపిరెడ్డి వెల్లడించారు. ఇందులో రాష్ట్రంలో 16 జోనల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల కోసం కర్నూల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలోనూ జోనల్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్‌కు ఒక్కో దానికి రూ.800 పరీక్ష ఫీజుగా నిర్ణయించామని, ఎస్సీ, ఎస్టీలతోపాటు వికలాంగులకు ఫీజు సగానికి (రూ.400) తగ్గించినట్లు వెల్లడించారు. రెండింటికి దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు రూ.1,600 (ఎస్సీ, ఎస్టీ, వికలాంగులైతే రూ. 800) ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మే 4, 5, 7 తేదీల్లో ఇంజనీరింగ్ ఎంసెట్, 9, 11 తేదీల్లో అగ్రికల్చర్ ఎంసెట్ పరీక్ష ఉంటుందని, ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో సెషన్‌లో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని, ఈ నిబంధనను యథావిధిగా అమలు చేస్తామన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాలు అందుబాటులో ఉండేలా ఈసారి టెస్ట్ సెంటర్లను రీఆర్గనైజ్ చేశామని ఎంసెట్ కన్వీనర్, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోవర్ధన్ వెల్లడించారు.

**ప్రభుత్వం ఆమోదిస్తే ఈడబ్ల్యూఎస్...**

రాష్ట్రంలో ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) కోటా అమలుకు సంబంధించి అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ప్రభుత్వం ఆమోదం తెలిపితే ఈసారి ప్రవేశాల్లో అమలు చేస్తామని పాపిరెడ్డి తెలిపారు. అయితే ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ కాలేదన్నారు. తాము మాత్రం ముందస్తుగా దాని అమలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాకు సంబంధించిన ప్రత్యేక కాలమ్‌ను విద్యార్థులు చేసుకునే దరఖాస్తులో పొందుపరుస్తున్నట్లు కన్వీనర్ వెల్లడించారు.

**ప్రభుత్వం జీవో మార్చితేనే కెమిస్ట్రీ మినహాయింపు అమలు..**

ఇంజనీరింగ్‌లో చేరేందుకు మ్యాథ్స్, ఫిజిక్స్‌తో పాటు కెమిస్ట్రీ మాత్రమే కాకుండా ఇతర సబ్జెక్టులు చదివిన వారికి అవకాశం ఇవ్వాలని, కెమిస్ట్రీ తప్పనిసరి కాదని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) పేర్కొన్న అంశంపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ పాపిరెడ్డి వివరణ ఇచ్చారు. ఏఐసీటీఈ ఆ నిబంధనను తీసుకువచ్చినా తాము రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే ఎంసెట్ నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలు చేపడుతున్నామన్నారు. ఏఐసీటీఈ చేసిన మార్పులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను మార్చితే అమలు చేస్తామన్నారు.

**ఇదీ ఎంసెట్-2020 షెడ్యూలు..**

**19–ఫిబ్రవరి:** ఎంసెట్ నోటిఫికేషన్
**21–ఫిబ్రవరి నుంచి 30–మార్చి వరకు:** ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
**31– మార్చి నుంచి 3–ఏప్రిల్ వరకు:** ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసిన దరఖాస్తుల్లో పొరపాట్ల సవరణకు అవకాశం
**6–ఏప్రిల్ వరకు:** రూ.500 ఆలస్య రుసుముతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం
**13–ఏప్రిల్ వరకు:** రూ.1000 ఆలస్య రుసుముతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
**20–ఏప్రిల్ వరకు:** రూ. 5 వేల ఆలస్య రుసుముతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చాన్స్
**17–ఏప్రిల్:** హాల్‌టికెట్ల జనరేషన్
**27–ఏప్రిల్ వరకు..:** రూ. 10 వేల ఆలస్య రుసుముతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సబ్మిషన్
**20–ఏప్రిల్ నుంచి 1–మే వరకు:** వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
**4–మే, 5–మే, 7–మే:** ఇంజనీరింగ్ ఎంసెట్
9–మే, 11–మే: అగ్రికల్చర్ ఎంసెట్

# నేడు కేబినెట్ భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

కొంత కాలంగా సీఎం కేసీఆర్ చెబుతూ ఉన్నారు. అవసరమైతే వీటిని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని కూడా గతంలో కేసీఆర్ ప్రకటించారు. దీంతో ఆదివారం జరిగే భేటీలో ఈ అంశంపై చర్చించి ప్రభుత్వపరంగా నిర్ణయం వెల్లడించే అవకాశముంది. కాగా, ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సీఎం.. నిధుల కేటాయింపులో కేంద్రం చూపుతున్న వివక్షను అసెంబ్లీ వేదికగా ఎండగట్టే యోచనలో ఉన్నారు. ఆదివారం జరిగే కేబినెట్‌లో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులు, ఇతరాలకు సంబంధించిన నోట్‌ను ప్రవేశ పెట్టి చర్చిస్తారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం రాష్ట్ర పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడనున్నారు. ఆమె వ్యాఖ్యల్లో నిజానిజాలపై కేబినెట్ సమావేశంలో చర్చిస్తారని సమాచారం.

**కొత్త పాలసీలపైనా ప్రస్తావన..**

ఉపాధి కోసం విదేశాలకు వలస వెళ్లి ఇబ్బందులు పడుతున్న తెలంగాణ వాసుల కోసం ప్రత్యేకంగా 'ఎన్‌ఆర్‌ఐ పాలసీ'రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న ఎన్‌ఆర్‌ఐ పాలసీలను కూడా అధ్యయనం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. కేరళ నమూనాను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ సోమేశ్ కుమార్ బృందం పర్యటించింది. అసెంబ్లీ సమావేశాలకు ముందే సీఎం గల్ఫ్ దేశాల పర్యటనకు వెళ్లే అవకాశముంది. దీంతో ఎన్‌ఆర్‌ఐ పాలసీ విధివిధానాలపై కేబినెట్ భేటీలో ప్రస్తావనకు రానుంది.

**పాలనా సంస్కరణలపైనా చర్చ..**

పాలనా సంస్కరణలపై దృష్టి సారించిన సీఎం కేసీఆర్.. ఇటీవల జాయింట్ కలెక్టర్ పోస్టులను రద్దు చేస్తూ జిల్లాకు ఇద్దరు అదనపు కలెక్టర్లను నియమించిన విషయం తెలిసిందే. పాలన పరంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేబినెట్ భేటీలో ప్రవేశ పెట్టి ఆమోదించే అవకాశముంది. కాగా, సోమవారం సీఎం కేసీఆర్ 66వ జన్మదినం నేపథ్యంలో కేబినెట్ సమావేశం జరుగుతుండటంతో అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది.

కొత్త రెవెన్యూ చట్టం, పీఆర్సీ, ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంపు, ఆర్థిక మాంద్యం నేపథ్యంలో పాటించాల్సిన పొదుపు చర్యలపైనా కేబినెట్‌లో చర్చించే అవకాశముంది.




ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని నెక్లెస్‌రోడ్ సర్కిల్ వద్ద తలసాని శ్రీనివాస్ యాదవ్ ఏర్పాటు చేసిన భారీ కటౌట్

# మంత్రి తలసానికి జరిమానా

- సీఎం కటౌట్ ఏర్పాటు చేసినందుకు అనధికార హోర్డింగ్‌గా గుర్తించి చలానా.. పెనాల్టీ చెల్లింపు
- పౌరుల ఫిర్యాదుతో చర్యలు చేపట్టిన ఈవీడీఎం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్) విభాగం రూ.5వేల జరిమానా విధించింది. ఈనెల 17న ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని నెక్లెస్‌రోడ్ సర్కిల్ వద్ద అనధికారికంగా భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసినందుకు జారీ చేసింది. 'హ్యాపీ బర్త్‌డే సర్.. ఉయ్ లవ్ కేసీఆర్..' అంటూ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేరిట ఈ కటౌట్ ఉండటంతో ఆయనకు చలానా జారీ చేశారు. ఇందులో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ల చిత్రాలు ఉన్నాయి. ఈ అనధికార హోర్డింగ్‌వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అంటూ 'సురక్ష యోజన వెల్ఫేర్ సొసైటీ' ట్విట్టర్ ద్వారా జీహెచ్‌ఎంసీ కమిషనర్, టీఆర్‌ఎస్ పార్టీ, సీఎంవో కార్యాలయం, మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌యాదవ్‌ల పేరిట పోస్ట్‌చేసింది. ఈవీడీఎం డైరెక్టర్‌తో పాటు మరికొందరు జీహెచ్‌ఎంసీ అధికారులు, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్‌కుమార్‌లకు కూడా కాపీ పోస్ట్ చేసింది. చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీని కోరడంతోపాటు తీసుకున్న చర్యల నివేదికను కూడా పంపాలంది. దీంతో ఈవీడీఎం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేరు, ఇంటి చిరునామాలతోనే చలాన్‌ను జారీ చేసింది. ఇందుకు రూ.5 వేలను మంత్రి చెక్కు ద్వారా చెల్లించినట్లు ఈవీడీఎం డైరెక్టర్ విశ్వజిత్ కాంపాటి తెలిపారు.



తలసానికి జీహెచ్‌ఎంసీ పంపిన చలాన్

**సోషల్ మీడియాలో చర్చ...**

ఈ అంశంపై సోషల్ మీడియాలో పలువురు స్పందించారు. చలానా వేయడం బాగానే ఉంది కానీ పెద్దవ్యక్తులకు ఇంత తక్కువ వేస్తే.. ఇలాంటి ఉల్లంఘనలు జరుగుతూనే ఉంటాయని, వారిష్టమొచ్చినట్లు హోర్డింగులు పెడుతూనే ఉంటారని కొందరు స్పందించారు. వారి ఆదాయాన్ని బట్టి చలానా వేయాలని సూచించారు. స్థితిమంతులైన వారు బాగానే ఉంటారు కానీ హోర్డింగు మీదపడ్డ వారి పరిస్థితేంటని ప్రశ్నించారు. పేదలను టెన్షన్‌కు గురిచేయొద్దన్నారు. అవసరమైతే రూల్స్ మార్చాలన్నారు. ఏ4 సైజున్న ప్రకటనకు, భారీ హోర్డింగుకూ ఒకే విధంగా పెనాల్టీలేంటని ప్రశ్నించారు. డ్రంకెన్ డ్రైవ్ తరహాలో నిబంధనలు ఉండాలని సూచించారు. అమాయక ప్రజలపై పడకముందే దాన్ని అక్కడినుంచి తొలగించాలని కొందరు కోరారు. ఏర్పాటు చేసిన వారే తొలగించేలా ఏర్పాట్లు చేయాలని ఇంకొందరు సూచించారు.

**నిబంధనల మేరకే...**

చట్టం, నిబంధనల మేరకే తాము చలానాలు విధిస్తున్నామని ఈవీడీఎం డైరెక్టర్ విశ్వజిత్ స్పష్టం చేశారు. అనధికార బోర్డు, కటౌట్, ఫ్లెక్సీ ఏదైనా, ఎంత సైజుదైనా రూ.5 వేల జరిమానానే ఉందన్నారు. ఈవీడీఎం విభాగం ఇష్టానుసారంగా చలానాలు విధిస్తోందని ఇటీవల జరిగిన జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశంలో పలువురు ధ్వజమెత్తడం తెలిసిందే. కాగా, ఫ్లెక్సీ విషయంలో వివాదం తలెత్తడంతో తలసాని ఏర్పాటు చేసిన కేసీఆర్ కటౌట్‌ను అధికారులు తొలగించారు.

## విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన వాయిదా

▶ మొదటి పేజీ తరువాయి

2020–21లో రూ.12వేల కోట్లు ఆదాయ లోటు ఉంటుందని డిస్కమ్‌లు అంచనా వేస్తున్నాయి. మరోవైపు వివిధ విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు రూ.13వేల కోట్ల బకాయిలను డిస్కమ్‌లు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విద్యుత్ చార్జీలను సవరించాలని ఈఆర్‌సీ స్టేట్ అడ్వైజరీ కమిటీలో కార్మిక సంఘాలు కోరాయి. ప్రభుత్వ శాఖల బకాయిలు విడుదల కాకపోవడం, చార్జీల పెంపునకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడాన్ని సంఘాలు తప్పుబట్టాయి. కాగా, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు మార్చి 1 వరకు సెలవులో ఉండటంతో ఆయన విధుల్లో చేరిన తర్వాత డిస్కమ్‌లు ఏఆర్‌ఆర్‌లు దాఖలు చేస్తాయని సమాచారం.




# జ్యోతిబసు (సీపీఐ-ఎం)

**రాష్ట్రం:** పశ్చిమ బెంగాల్
**పదవీ కాలం:** 23 ఏళ్ల 137 రోజులు



దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక జ్యోతిలా వెలుగులు పంచిన జ్యోతిబసు పశ్చిమ బెంగాల్‌ను రెండు దశాబ్దాల పాటు ఏలి తన కంటూ ప్రత్యేక గుర్తింపుని సాధించారు. వామపక్ష భావజాలంపై గట్టి విశ్వాసం కలిగిన జ్యోతిబసు 1940లో యువకుడిగా ఉన్నప్పుడే కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అయితే సీఎం పదవి చేపట్టడానికి ఆయన 37 ఏళ్లు ఎదురు చూడాల్సి వచ్చింది. 1977లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అత్యవసర పరిస్థితి విధించిన అనంతరం పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ అధికారంలోకి వచ్చింది. జ్యోతిబసు రచించిన వ్యూహాలతోనే ఆ కూటమి అధికారాన్ని దక్కించుకుంది. సీఎం అయ్యాక భూసంస్కరణలు, వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు, పంచాయతీల్లో మూడు అంచెల వ్యవస్థ, వితంతువులకు, నిరుద్యోగులకు భృతి, యువజన వ్యవహారాల కోసం ప్రత్యేక శాఖ వంటివన్నీ ఆయనను అత్యధిక కాలం సీఎంగా కొనసాగేలా చేశాయి. 2000 సంవత్సరంలో బుద్ధదేవ్ భట్టాచార్యకు రాష్ట్ర పగ్గాలు అప్పగించి సీఎం పదవి నుంచి వైదొలిగారు. 1996లో పార్టీ నియమనిబంధనలకి తలొగ్గి గుమ్మం దాకా వచ్చిన ప్రధాని పదవిని వదులుకున్నారు. అప్పట్లో అటల్ బిహారీ వాజ్‌పేయి 13 రోజుల పాలన అనంతరం యునైటెడ్ ఫ్రంట్ నాయకుడిగా జ్యోతిబసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కానీ సీపీఎం అగ్ర నాయకత్వం ప్రభుత్వంలో భాగస్వామ్యం అవడానికి నిరాకరించడంతో ప్రధాని అయ్యే అవకాశాన్ని కోల్పోయారు.

# మాణిక్ సర్కార్ (సీపీఐ-ఎం)

**రాష్ట్రం:** త్రిపుర
**పదవీ కాలం:** 19 ఏళ్ల 363 రోజులు



తనకంటూ ఒక సొంత ఇల్లు, కారు లేని ఏకైక ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్. త్రిపురలో వరసగా నాలుగుసార్లు ఎర్రజెండా ఎగురవేసిన కమ్యూనిస్ట్ దిగ్గజం మాణిక్ సర్కార్. దేశంలోనే నిరుపేద సీఎంగా రికార్డులకెక్కారు. త్రిపురలో ఒక టైలర్ కుటుంబంలో జన్మించిన మాణిక్ సర్కార్ చిన్నప్పుడే కమ్యూనిజం వైపు ఆకర్షితుడై సీపీఐ (ఎం)లో చేరారు. 1998లో తొలిసారిగా త్రిపుర సీఎంగా పదవి చేపట్టిన ఆయన 19 ఏళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. మాణిక్ సర్కార్ సీఎం పదవిలో ఉన్నప్పుడు తన జీతంలో నెలకి రూ.5 వేలు ఉంచుకొని మిగిలినది పార్టీకి విరాళంగా ఇచ్చేవారు. ఆయన సీఎం అయిన సమయంలో త్రిపురలో నిరంతరం హింస, ఘర్షణ చెలరేగుతూ ఉండేది. బెంగాలీలకు, ఆదివాసీలకు మధ్య ఘర్షణలు ఉండేవి. బెంగాల్ నుంచి వచ్చే తీవ్రవాదులు రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేవారు. అలాంటి హింసాత్మక వాతావరణం నుంచి శాంతి స్థాపన దిశగా మాణిక్ సర్కార్ తీసుకున్న చర్యలు, ఆయనలో నిజాయితీ, నిరాండబరత అన్నేళ్లు పదవిలో కొనసాగేలా చేశాయి. అయితే మాణిక్ సర్కార్ ఎంత నిరాడంబరంగా ఉన్నారో, అందరూ అంతే సామాన్యంగా ఉండాలని భావించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు అర కొర జీతాలతో బతుకు బండి లాగాల్సి వచ్చేది. అందుకే రెండేళ్ల క్రితం త్రిపుర కోటపై ఎర్రజెండాకి బదులుగా కాషాయం జెండా రెపరెపలాడింది.

# 'గాంధీ' ఘటనలపై సర్కారు సీరియస్

- బాధ్యులైన ఒక కీలకాధికారిపై చర్యలకు సన్నాహాలు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రత్యేక సమీక్ష
- మందుల ధరలు మన రాష్ట్రంలో అధికంగా ఉండటంపై మండిపాటు



**సాక్షి, హైదరాబాద్:** గాంధీ ఆస్పత్రిలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఆస్పత్రిలో ఇటీవల జరిగిన వివాదాస్పద ఘటనలు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దృష్టికి కూడా వెళ్లడంతో వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఆరోపణలపై వాస్తవాలను నిర్ధారించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల శనివారం విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

**విమర్శలకు దారి తీసిన ఘటనలు..**

ఇద్దరు చైనీయులకు కరోనా(కోవిడ్-19) వైరస్ సోకినట్లు గాంధీ ఆస్పత్రి నుంచి జరిగిన ప్రచారానికి ఓ వైద్యుడు బాధ్యుడంటూ చర్యలు తీసుకోవడంతో ఆయన ఆత్మహత్యకుయత్నించారు. గాంధీ ఆస్పత్రిలో మందుల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు, పారిశుద్ధ్య, భద్రత నిర్వహణ ఏర్పాట్లపై కొందరు రోగులు అసంతృప్తి వ్యక్తం చేయడం, ఇద్దరు కోవిడ్-19 అనుమానితుల నుంచి నమూనాలు సరిగ్గా సేకరించకపోవటం వంటి ఘటనలు ఉన్నత స్థాయిలో తీవ్ర విమర్శలకు దారి తీశాయి. రాష్ట్రస్థాయి కీలకాధికారి నిర్లక్ష్యం వల్లే ఈ ఘటనలు జరిగినట్లు వైద్య ఆరోగ్యశాఖ భావిస్తోంది. పరిస్థితులను చక్కదిద్దడంలోనూ, పర్యవేక్షణలోనూ సదరు అధికారి విఫలం కావడంతో ఆయనపై వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోనుందని తెలుస్తోంది. ఈ ఘటనలపై శనివారం గాంధీ ఆస్పత్రిలో మంత్రి ఈటల సమీక్ష నిర్వహించి ఈ ఘటనలపై పూర్తి స్థాయి నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వ్యక్తుల కంటే వ్యవస్థే కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. హౌస్‌సర్జన్లకు సంబంధించిన రికార్డులు, భద్రత, పారిశుద్ధ్యం పనితీరుకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. డీఎంఈ రమేశ్‌రెడ్డి, సూపరింటిండెంట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మందుల ధరలు ఇక్కడే ఎందుకు ఎక్కువ?**

మన రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రులన్నింటికీ అవసరమైన మందులను కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. అయితే గుజరాత్, తమిళనాడు తదితర రాష్ట్రాలతో పోలిస్తే, మన రాష్ట్రంలో కొన్ని రకాల మందుల ధరలు అధికంగా ఉన్నాయని, ఇదేంటని ఈటల ఆ సమావేశంలో సంబంధిత అధికారులను నిలదీశారు. ఒకరకపు మాత్రను ఆ రెండు రాష్ట్రప్రభుత్వాలు కాంట్రాక్టర్ల నుంచి రూ.20కు కొనుగోలు చేస్తే, అదే మందును మన రాష్ట్రం రూ.32కు కొనడం ఏంటని మంత్రి నిలదీశారు. అనేక మందుల ధరలు ఇలాగే అధికంగా ఉన్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. ఇకనుంచి ప్రభుత్వాస్పత్రులకు అవసరమైన వాటిని కొనుగోలు చేసేటప్పుడుగానీ, ఇతరత్రా టెండర్ కాంట్రాక్టులను ఫైనల్ చేసేప్పుడు కానీ తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. బోధనాస్పత్రుల్లో మెరుగైన సేవల కోసం ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలన్నారు.

**బడ్జెట్ రూ. 6 వేల కోట్లు**

రానున్న రాష్ట్ర బడ్జెట్లో వైద్య ఆరోగ్యశాఖ బడ్జెట్ రూ.6 వేల కోట్లు ఉండే అవకాశం కనిపిస్తుంది. అధికారులు రూ.8,500 కోట్లకు ప్రతిపాదనలు పంపించగా, రూ.6వేల కోట్లకు కుదించినట్లు సమాచారం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి రోగి అనుభవం ఎలా ఉందో తెలుసుకునేలా రూపొందించిన 'మై క్రిటిక్'ఫీడ్‌బ్యాక్ యాప్‌ను మంత్రి ఈటల ప్రారంభించారు. ఇలాంటివి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందించేందుకు దోహదపడతాయన్నారు. డాక్టర్లు ఎన్నిసార్లు చూడ్డానికి వచ్చారు, వారు ఏ విధంగా చికిత్స అందించారు, ఆస్పత్రిలో పరిశుభ్రత ఎలా ఉంది అనే వివరాలు ఈ యాప్‌లో నమోదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో కాప్-13 సదస్సు

**సాక్షి, హైదరాబాద్:** గుజరాత్‌లోని గాంధీనగర్‌లో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్)-13 అంతర్జాతీయ సదస్సు జరుగుతోంది. ఐక్యరాజ్యసమితి (ఐరాస) పర్యావరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఈ సదస్సులో 130 దేశాల ప్రతినిధులు పాల్గొంటుండగా భారత్ ఆతిథ్యమిస్తోంది. శనివారం నుంచే ఈ సదస్సు మొదలైనా, అధికారికంగా మాత్రం 17వ తేదీ నుంచి 22 వరకు పలు అంశాలపై వివిధ దేశాల అధికార ప్రతినిధులు, పర్యావరణవేత్తలు చర్చల్లో పాల్గొని తీర్మానాలను రూపొందిస్తారు. ఈ ఏడాదిలోనే చైనాలో జరిగే మరో సదస్సులో ఈ తీర్మానాలపై మరింత లోతుగా చర్చించి ఆమోదించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో దేశాలు, రాష్ట్రాల సరిహద్దులు దాటి వచ్చే వలస పక్షులు, జంతువుల పరిరక్షణ అనేది ఈ సదస్సు ప్రధాన అంశం. రాష్ట్రం నుంచి ఈ సదస్సులో అటవీశాఖ పీసీసీఎఫ్ ఆర్.శోభ, నెహ్రూ జూపార్కు, ఇతర రంగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు. పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ తీసుకుంటున్న చర్యలతోపాటు వలస పక్షులు, జంతువుల సంరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలు, తదితర అంశాలను వివరిస్తారు.




## ముఖ్యమంత్రి జన్మదిన
# వేడుకలకు సన్నాహాలు

**మొక్కలు నాటాలని పిలుపునిచ్చిన కేటీఆర్**

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు 66వ జన్మదినం సందర్భంగా ఈ నెల 17న భారీగా సంబరాలు జరిపేందుకు పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు సీఎం కేసీఆర్ చూపిన ప్రత్యేక శ్రద్ధను దృష్టిలో పెట్టుకుని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా హరితహారం చేపట్టేందుకు పార్టీ ప్రజా ప్రతినిధులు గ్రామ స్థాయి మొదలుకుని నియోజకవర్గ స్థాయి వరకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 9న పిలుపునిచ్చారు. కేటీఆర్ పిలుపు మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల పరిధిలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాల్సిందిగా పార్టీ కార్యకర్తలను పురమాయించారు. మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ తదితరులు వారం రోజులుగా సోమవారం చేపట్టాల్సిన హరితహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

**ప్రభుత్వ విభాగాలు సైతం..**

సీఎం జన్మదినం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రభుత్వ విభాగాలు కూడా భాగస్వాములవుతున్నాయి. మంత్రి కేటీఆర్ పరిధిలోని మున్సిపల్ పాలన, పరిశ్రమల శాఖలతో పాటు పంచాయతీరాజ్, అటవీ, ఆర్ అండ్ బీ, గృహ నిర్మాణ, గిరిజన, స్త్రీ సంక్షేమ శాఖలు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేశాయి. జిల్లా కలెక్టర్లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశాయి. టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 104 పారిశ్రామికవాడల్లో 1.32 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## సీఎం జన్మదినం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం

**సాక్షి, హైదరాబాద్:** సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌వీసీ ప్రకాశ్, ఎ.పరమేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. హరిత తెలంగాణ సాధన కోసం రాష్ట్రంలోని అన్ని డిగ్రీ, పీజీ, జూనియర్ కాలేజీల ప్రాంగణాలే కాకుండా ఇతర ప్రదేశాల్లోనూ మొక్కలను నాటనున్నట్లు వెల్లడించారు.

## హైకోర్టు తరలింపునకు
# చర్యలు తీసుకోవాలి

**కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఏపీ సీఎం వైఎస్ జగన్ వినతి**



ఢిల్లీలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

**సాక్షి, న్యూఢిల్లీ:** వికేంద్రీకరణలో భాగంగా కర్నూలుకు హైకోర్టును తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఆయనతో భేటీ అయ్యారు. దాదాపు 55 నిమిషాలపాటు సాగిన ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. న్యాయ శాఖ మంత్రికి సీఎం నివేదించిన అంశాలు ఇవీ..

**అభివృద్ధి వికేంద్రీకరణకు వీలుగా..**

'రాజధాని కార్యకలాపాలను మూడు ప్రాంతాలకు వికేంద్రీకరించాం. ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌గా విశాఖపట్నం, జ్యుడిషియల్ కేపిటల్‌గా కర్నూలు, లెజిస్లేటివ్ కేపిటల్‌గా అమరావతి ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ వికేంద్రీకరణ, అన్ని ప్రాంతాలకు సమగ్రాభివృద్ధి చట్టం-2020కి అసెంబ్లీ ఆమోదముద్ర వేసింది. ఇందులో భాగంగా హైకోర్టును కర్నూలుకు తరలించడానికి కేంద్ర న్యాయ శాఖ తగిన చర్యలను తీసుకోవాలి. రాయలసీమలో శాశ్వత ప్రాతిపదికన హైకోర్టును ఏర్పాటు చేస్తామంటూ బీజేపీ 2019 మేనిఫెస్టోలో పేర్కొంది. ఈ దృష్ట్యా ఆ మేరకు వెంటనే తరలింపునకు చర్యలు తీసుకోవాలి' అని సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు.

**'మండలి' రద్దును ఆమోదించాలి**

శాసన మండలి రద్దు అంశాన్ని కూడా కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో సీఎం వైఎస్ జగన్ చర్చించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం చేసిన బిల్లులను 'మండలి' అడ్డుకునే ప్రయత్నం చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని వివరించారు. ఈ నేపథ్యంలో.. మూడింట రెండు వంతుల మెజారిటీతో శాసనసభ.. మండలిని రద్దు చేస్తూ సిఫారసు చేసిందని, కేంద్ర న్యాయ శాఖ తదుపరి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు, చిన్నారులపై నేరాలను నియంత్రించేందుకు రూపొందించిన దిశ చట్టం వెంటనే అమలులోకి వచ్చేలా కేంద్రం నుంచి తీసుకోవాల్సిన చర్యలు వేగవంతం చేయాలని కోరారు.



## నవీన్ పట్నాయక్ (బిజూ జనతాదళ్)

**రాష్ట్రం:** ఒడిశా

**పదవీ కాలం:** 2000 సంవత్సరం నుంచి ఇంకా కొనసాగుతున్నారు.



మాతృభాష ఒరియాలో కూడా మాట్లాడలేరు. అయినా అయిదు దఫాలుగా వరస విజయాలతో దూకుడు చూపిస్తున్నారు. ఒడిశాలో జన హృదయ నేత బిజు పట్నాయక్ మరణానంతరం ఆయన వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన నవీన్ పట్నాయక్ ఆ తర్వాత కాలంలో జనతాదళ్ నుంచి విడిపోయి బిజూ జనతాదళ్ స్థాపించారు. ప్రజా నాయకుడిగా ఎదిగారు. ఒకప్పుడు ఒడిశా అంటే అత్యంత వెనుకబడిన రాష్ట్రం. అలాంటి రాష్ట్రానికి పగ్గాలు చేపట్టిన నవీన్ అభివృద్ధి అంటే ఏంటో చూపించారు. ఖనిజ సంపద అత్యధికంగా ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాలు, మానవ వనరులు లేని ఆ రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. నవీన్ సీఎం అయ్యాక ముందుగా మౌలిక సదుపాయాల రంగంలో సంస్కరణలు తీసుకువచ్చి, నైపుణ్యం కలిగిన కార్మిక శక్తిని తయారు చేసి చూపించారు. దీంతో పెట్టుబడులు, ప్రభుత్వ రంగ సంస్థలు ఒడిశాని వెతుక్కుంటూ వచ్చాయి. ప్రజాసేవ, సుపరిపాలనే అస్త్రాలుగా ముందుకు సాగారు. చౌక ధరకే బియ్యం, స్కూలు బాట పట్టే విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ, ఎన్నో పేదరిక నిర్మూలన కార్యక్రమాలు చేపట్టి 80 లక్షల మందికి పైగా ప్రజల్ని దారిద్ర్య రేఖకి ఎగువకి తీసుకువచ్చారు. అనునిత్యం తుపాన్లలో చిక్కుకునే ఒడిశాలో ప్రకృతి వైపరీత్యాల సమయాలను ఆయన ఎదుర్కొనే తీరు అంతర్జాతీయంగా ప్రశంసలు తెచ్చిపెట్టింది.

## షీలా దీక్షిత్ (కాంగ్రెస్)

**రాష్ట్రం:** ఢిల్లీ

**పదవీ కాలం:** 15 ఏళ్ల 25 రోజులు



ఇప్పుడు అందరం కేజ్రీవాల్ గురించి మాట్లాడుతున్నాం కానీ ఢిల్లీ పీఠాన్ని వరసగా మూడుసార్లు దక్కించుకొని అరుదైన ఘనత సాధించిన తొలి సీఎం షీలాదీక్షిత్. కాంగ్రెస్ డార్లింగ్‌గా పేరు సంపాదించిన ఆమె 1998 నుంచి 2013 వరకు ఢిల్లీని పరిపాలించి దేశ రాజధాని రూపు రేఖలు మార్చారు. ఢిల్లీకి రాజధాని హంగులు అద్దింది షీలా దీక్షితే. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజల్ని భాగస్వామ్యుల్ని చేసే వ్యవస్థను ప్రవేశపెట్టి మంచి పరిపాలనా దక్షురాలిగా గుర్తింపుని తెచ్చుకున్నారు. మౌలిక సదుపాయాలు, రవాణా వ్యవస్థ, విద్య, ఆరోగ్య రంగాలను ఒక గాడిలో పెట్టారు. పెద్ద పెద్ద భవంతులు, ఫ్లై ఓవర్లు, ఢిల్లీ మెట్రో ఆమె హయాంలోనే వచ్చాయి. ఢిల్లీ అభివృద్ధి చెందడానికి, నిరుపేదల సంఖ్య తగ్గడానికి షీలా చేపట్టిన అభివృద్ధే కారణం. సీఎంగా ఉన్నప్పుడు ఆమెపై అవినీతి ఆరోపణలూ వచ్చాయి కానీ ఏవీ కోర్టు ముందు నిలవలేదు. రాజకీయాల్లో మహిళలు మనుగడ సాగించడమే కష్టమైపోతున్న రోజుల్లో షీలా దీక్షిత్ మూడు సార్లు వరసగా ఎన్నికల్లో విజయభేరి మోగించి రికార్డు సృష్టించారు. 2013లో కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీని ప్రవేశపెట్టి రాజకీయ రంగ ప్రవేశం చేశాక ఆయన చరిష్మా ముందు షీలా నిలబడలేకపోయారు. గాంధీ కుటుంబానికి వీర విధేయురాలైన ఆమె గత ఏడాది లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో 80 ఏళ్ల వయసులోనూ ఉత్సాహంగా పాల్గొని అన్ని నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ ఓట్ల శాతం పెరగడానికి కృషి చేశారు.

## ముస్లింలకు ఇచ్చిన హామీ ఏమైంది?: ఉత్తమ్



**సాక్షి, హైదరాబాద్:** ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న సీఎం కేసీఆర్ హామీ ఏమైందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ 64వ పుట్టిన రోజు సందర్భంగా గాంధీభవన్ ప్రకాశం హాల్‌లో '15 ఏళ్ల 4 శాతం ముస్లిం రిజర్వేషన్లు' అంశంపై నిర్వహించిన పోటీల బహుమతి పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింల కోసం 4 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం 12 శాతం ముస్లిం కోటా ఇస్తామన్న వాగ్దానాన్ని ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు.

## రిజర్వేషన్లపై కాంగ్రెస్ ధర్నా రేపటికి వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఈ నెల 16న టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమం వాయిదా పడింది. ఇందిరాపార్కులోని ధర్నా చౌక్ వద్ద ఈ నెల 17న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే నిరసన కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు.

## ఏపీ సీఎం జగన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



**పంజగుట్ట:** దేశంలోని అందరు ముఖ్యమంత్రులు ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సూచించారు. బీసీ ముఖ్యమంత్రులు ఉన్న రాష్ట్రాల్లో కూడా బీసీల కోసం అమలుచేయని సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో చేస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లో గత బడ్జెట్‌లో బీసీల కోసం రూ.18 వేల కోట్లు కేటాయించారని, తెలంగాణలో కేవలం రూ.3 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. కనీసం ప్రస్తుత బడ్జెట్‌లో అయినా తెలంగాణలో బీసీల కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను శనివారం ఖైరతాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు.

## పరిశీలనలో ఎంపీవోలకు పదోన్నతులు

**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుతం మండల పంచాయతీ అధికారులు(ఎంపీవో)గా పనిచేస్తున్న 46 మందికి పదోన్నతులు కల్పించే అంశాన్ని పంచాయతీరాజ్‌శాఖ పరిశీలిస్తోంది. సీనియారిటీ ప్రాతిపదికన వీరికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో)గా ప్రమోషన్లు ఇవ్వనుంది. ఎంపీవోలపై నమోదైన అభియోగాలు, కేసులు, విచారణ పెండింగ్, వార్షిక రహస్య నివేదిక (ఏసీఆర్) ఆధారంగా వీరికి పదోన్నతులు కల్పించనుంది. ఈ మేరకు ప్రమోషన్ల జాబితాలో ఉన్నవారికి సంబంధించి ఈ నెల 17లోపుగా నివేదికలు సమర్పించాలని జిల్లా పరిషత్ సీఈవో, డీపీవోలకు పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్ జారీ చేసిన సర్క్యులర్‌లో ఆదేశించారు.

## సీఎం బర్త్‌డేకి మొక్కలు నాటండి: తలసాని



**సాక్షి, హైదరాబాద్:** సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా రాష్ట్రంలోని పశువైద్యశాలలు, మత్స్యశాఖ కార్యాలయాలు, డెయిరీ కార్యాలయాలు, వెటర్నరీ యూనివర్సిటీల ఆవరణల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు.

## ఢిల్లీలో తెలంగాణ గవర్నర్

### జైట్లీ కుమారుడి వివాహానికి హాజరైన తమిళిసై

**సాక్షి, న్యూఢిల్లీ:** రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శనివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత అరుణ్ జైట్లీ కుమారుడి వివాహానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమం అనంతరం తిరిగి హైదరాబాద్ వెళ్లనున్నట్లు గవర్నర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## నీటి పక్షుల వేటకు అనుమతి లేదు: అటవీశాఖ

**సాక్షి, హైదరాబాద్:** అటవీ ప్రాంతాల్లోని వివిధ జల వనరుల్లోని నీటి పక్షుల (అక్వాటిక్ బర్డ్స్) వేటకు అనుమతి లేదని, వాటిని వేటాడిన వారికి వన్యప్రాణి, అటవీ పరిరక్షణ చట్టాల ప్రకారం ఏడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని అటవీశాఖ స్పష్టం చేసింది. ఈ నేరాల అదుపునకు, అక్రమ కార్యక్రమాల నియంత్రణకు అన్ని ఫారెస్ట్ రేంజ్ ప్రాంతాల్లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్/ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నేతృత్వంలో ప్రత్యేక వేట నిరోధక బృందాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రేంజ్ పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌లో 6 బాతులు, 8 పక్షుల (శాండ్‌పైపర్స్)ను పట్టుకుని, శుక్రవారం నల్లగొండలో విక్రయిస్తున్న సింగం శీనయ్య, సింగం సైదమ్మ, సైదులులను నల్లగొండ డీఎఫ్‌వో అదుపులోకి తీసుకొని రూ. 50 వేల జరిమానా విధించినట్టు ఓ ప్రకటనలో అటవీశాఖ తెలిపింది. ఈ చర్యకు పాల్పడిన వారు చట్టాలపై అవగాహన లేని పేద మత్స్యకారులైనందున అందరికీ కలిపి ఒకే జరిమానా విధించడంతో పాటు కేసు నమోదు చేసినట్టు పేర్కొంది. వీరు వేటాడిన పక్షులు 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం షెడ్యూల్–4 కింద పరిరక్షణ జాబితాలోకి వస్తాయని తెలిపింది.




**'వాక్‌మేట్' నయనతార**

వాక్‌మేట్ పాదరక్షల కంపెనీ నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ సినీ నటి నయనతార నియమితులైన సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బాస్టియన్ జోసెఫ్.



# వాతావరణం.. పూతకు ప్రతికూలం

**లబోదిబోమంటున్న మామిడి రైతులు**

**ఉష్ణోగ్రతల తగ్గుదలతో రాలిపోతున్న పూత**

**మరో వైపు ఫంగస్ దెబ్బ..చీడపీడల దాడి**

**మూడున్నర లక్షల ఎకరాల్లోని తోటలపై ప్రభావం**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మామిడి రైతుకు కష్టాలు వచ్చి పడ్డాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పూత రాలిపోతోంది.దీంతో ఈసారి దిగుబడులు భారీగా పడిపోయే పరిస్థితి నెలకొని ఉందని ఉద్యానశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.గతేడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో అకాల వర్షాలు కురవడం, తర్వాత చలి నెలకొనడం తదితర కారణాల వల్ల ఈసారి పూత రావడమే ఆలస్యమైందని, ప్రస్తుత వాతావరణం కూడా పూత, పిందెలు నిలబడే స్థితి లేకుండా పోయిందని ఉద్యానశాఖ అధికారులు అంటున్నారు.దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

### 60 శాతం దిగుబడులు పడిపోయే ప్రమాదం...

రాష్ట్రంలో 3.5 లక్షల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. అత్యధికంగా ఖమ్మం, మంచిర్యాల, జగిత్యాల, నాగర్ కర్నూలు, సంగారెడ్డి, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో అత్యధికంగా తోటలుండగా, మిగిలిన జిల్లాల్లో నామమాత్రంగా ఉన్నాయి. సాధారణంగా ఎకరాకు సరాసరి 4 టన్నుల వరకు మామిడి దిగుబడులు వస్తాయి.బాగా కాస్తే ఏడెనిమిది టన్నుల వరకూ దిగుబడి వస్తుందని అంటున్నారు. ఆ ప్రకారం రాష్ట్రంలో సుమారు 20 లక్షల టన్నుల వరకు మామిడి దిగుబడి వస్తుందని అంచనా. ఇక్కడి నుంచి వివిధ దేశాలకు కూడా మన మామిడి పంట ఎగుమతి అవుతుంది.ఈసారి కాపు పరిస్థితి అధ్వాన్నంగా మారింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో విపరీతమైన వర్షాలు కురవడంతో దాని ప్రభావం మామిడి పూతపై పడింది. సెప్టెంబర్ నెలలో సాధారణం కంటే 92 శాతం, అక్టోబర్ నెలలో సాధారణం కంటే 70% అధికంగా వర్షం కురిసింది. ఫిబ్రవరిలో ఇప్పటివరకు అంటే ఈ 12 రోజుల్లో ఏకంగా 279% అధికంగా వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ 12 రోజుల్లో 2.4 మిల్లీమీటర్ల (మి.మీ.) వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 9.1 మిమీ నమోదైంది. అంటే మామిడి పూతకు అత్యంత కీలకమైన సమయాల్లో వర్షాలు కురిశాయి. మధ్యలో చలి వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితే మామిడి పూత, కాతపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని అంటున్నారు.

### ఫంగస్, చీడపీడలు...

అక్టోబర్ నెల నుంచే మామిడి పూతకు అనుకూల వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయి. కానీ ఈసారి అక్టోబర్ వరకూ వర్షాలు విపరీతంగా కురిశాయి. ఈ దెబ్బ ఇప్పటివరకు కొనసాగుతోంది. జనవరిలో సంక్రాంతి నాటికి పూత పూర్తిస్థాయిలో రావాలి. ఉద్యానశాఖ వర్గాల అంచనా ప్రకారం నెల రోజులపాటు మామిడి పూత, కాతకు అంతరాయం ఏర్పడిందంటున్నారు.వాతావరణ మార్పులతో మామిడిపై ఫంగస్ పంజా విసిరింది. చీడపీడలు విజృంభించాయి. దీంతో రైతులు తీవ్రమైన నష్టాలు చవిచూసే పరిస్థితి నెలకొంది. వాస్తవంగా పూతలో 98 % మగ పూతే ఉంటుంది. అది రాలిపోతుంది. ఇక మిగిలిన 2 శాతం ద్విలింగ (ఆడ, మగ) పూత ఉంటుంది. దాని నుంచే కాపు వస్తుంది. అందులో సాధారణంగా 0.5 శాతం మాత్రమే మామిడి కాయగా వస్తుంది. దానినే దిగుబడిగా లెక్కిస్తారు. ఇప్పుడు ఆ దిగుబడి కూడా 60 శాతం వరకు పడిపోయే ప్రమాదముందని ఉద్యాన శాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత వాతావరణం పంటపై తీవ్రమైన వ్యతిరేక ప్రభావం చూపిందని ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ అభిప్రాయపడ్డారు. సాధారణంగా మార్చి లో మార్కెట్లోకి మామిడి కాయ రావాలి. జూన్ నెల వరకు వస్తూనే ఉంటుంది. ఈసారి ఏప్రిల్‌లో కాయలు మార్కెట్లోకి వచ్చే అవకాశముందని అంచనా.

### పూత రాలేదు... వచ్చింది నిలవడంలేదు



పదేళ్ల కిందట నాలుగు ఎకరాల్లో మామిడి తోట పెట్టాను. అప్పటినుంచి మంచి దిగుబడులు వచ్చేవి. ఈ ఏడాది చెట్టుకు పూతనే రాలేదు. బంగిన పెల్లి మామిడి చెట్లకు పూత వచ్చినా నిలవడం లేదు. దస్రీ రకానికి ఇప్పుడిప్పుడే వస్తోంది. మామిళ్ల పూతకు వస్తే ఎండకాలంలో చెట్లకు కాయలెట్లా నిలుస్తయి. ఎండలకు పిందెలు మొత్తం రాలిపోయి కాతనే ఉండదు. ఈ ఏడాది మామిడి తోటలకు నష్టం వచ్చినట్లే. ఎండాకాలంలో నీళ్లు అందక కాయలు రాలిపోతాయి.

*– తిరుపతిరావు, గాంధీనగర్, హుస్నాబాద్ మండలం, సిద్దిపేట జిల్లా*

### ఆరంభం నుంచే సమస్య



వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల పూత రాలిపోతుంది. ఈ ఏడాది ఆరంభం నుంచే ఈ సమస్య నెలకొంది. పూత రాలటంతో పంట దిగుబడులు తగ్గే అవకాశం కూడా ఉంది. దీంతో నష్టం సంభవిస్తుందని ఆందోళనగా ఉంది.

*– ఎనమల నారాయణరెడ్డి, బోడు, టేకులపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా*

# వంట, మంటపై నిషేధం..

- రక్షిత అటవీ ప్రాంతాల్లో అటవీ శాఖ ఆంక్షలు..
- అటవీ మార్గాల్లో కాలిబాట ప్రయాణాలపైనా నిషేధం
- శ్రీశైలం వెళ్లే భక్తులు నిర్దేశిత రోడ్డు మార్గంలోనే వెళ్లాలి
- వేసవిలో అగ్నిప్రమాదాల నివారణకు ఆదేశాలు జారీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని అడవుల్లో నిప్పు రాజేయడం, వంటలు చేయడంపై అటవీ శాఖ నిషేధం ప్రకటించింది. రక్షిత అటవీ ప్రాంతాల్లో బయటి వ్యక్తులు, ఇతరుల ప్రవేశంపైనా ఆంక్షలు విధించింది. ఎండా కాలంలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో వీటి నివారణకు చర్యలు చేపట్టింది. ఇటీవల నల్లమల అటవీప్రాంతంలో 3 అగ్నిప్రమాదాల ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రత్యేక ఆదేశాలు జారీచేసింది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు నల్లమల అడవి మీదుగా శ్రీశైలానికి వెళ్లనున్నందున ఆంక్షలు విధించింది. నల్లమల మీదుగా శ్రీశైలం వెళ్లే భక్తులు అటవీ శాఖ సూచనలు తప్పకుండా పాటించాలని, అడవిలో నిర్దేశించిన ప్రాంతాలు, రోడ్ల ద్వారానే ప్రయాణించాలని, అటవీ మార్గాల్లో కాలి బాట ప్రయాణంపై నిషేధం విధించినట్లు ప్రకటించింది.

### అటవీ శాఖ ఆధ్వర్యంలోనే ఏర్పాట్లు..

అటవీ శాఖ ఆధ్వర్యంలో నల్లమలలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విరామ ప్రాంతాల్లో మాత్రమే సేద తీరేందుకు అనుమతి ఉందని స్పష్టం చేసింది. అమ్రాబాద్, కవ్వాల్ అభయారణ్యాలతో పాటు, రక్షిత అటవీ ప్రాంతాల్లో ప్రవేశంపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ప్రత్యేకంగా పెట్రోలింగ్ నిర్వహిస్తోంది. పశువుల కాపరులు, అడవిలోకి వచ్చేవారు సిగరెట్, బీడీ తాగకుండా చర్యలు చేపడుతోంది.

### అవగాహనా కార్యక్రమాలు..

అటవీ మార్గాలు, అడవుల వెంట ఉండే గ్రామాల్లో ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. మొత్తం 9,771 కంపార్ట్‌మెంట్లకు గాను 43 అటవీ రేంజ్‌ల్లో 1,106 ప్రాంతాలు అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉన్న వాటిగా గుర్తించారు. వీటిల్లో కనీసం ఐదుగురు సిబ్బంది, వాహనం, నిప్పును ఆర్పే బ్లోయర్ పరికరాలతో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. శాటిలైట్ ద్వారా అడవుల్లో అగ్ని ప్రమాదాలను పర్యవేక్షించే విధానం ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) ద్వారా అమల్లో ఉన్నందున, ఎక్కడ ప్రమాదం జరిగినా ఆ ప్రాంతంలో సంబంధిత అధికారులతో పాటు, గ్రామ కార్యదర్శికి కూడా ఫోన్ సందేశం వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నారు. అటవీ మార్గాల్లో ప్రయాణికులకు నిప్పు నివారణపై అవగాహన కల్పించనున్నారు.

# హైదరాబాద్‌లో బయో ఆసియా సదస్సు

- ఈ నెల 17 నుంచి మూడు రోజులు పాటు సదస్సు
- లైఫ్‌సైన్సెస్, ఫార్మా రంగాలకు ఊతం: మంత్రి కేటీఆర్



**సాక్షి, హైదరాబాద్:** దశాబ్దకాలంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఉన్న పెట్టుబడులు, ఇతర అవకాశాల కోసం ప్రపంచ స్థాయిలో పేరొందిన లైఫ్ సైన్సెస్, ఫార్మా పారిశ్రామిక వర్గాలతో పాటు పరిశోధకులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలను ఒకే వేదిక మీదకు తీసుకురావడంలో 'బయో ఆసియా'కీలక పాత్ర పోషిస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి హైదరాబాద్ వేదికగా మూడ్రోజుల పాటు జరిగే 17వ బయో ఆసియా సదస్సుకు రాష్ట్రం ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ కంపెనీలు హైదరాబాద్‌కు రావడంలో బయో ఆసియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. హైదరాబాద్‌లోని ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక వసతులు, పెట్టుబడికి ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు బయో ఆసియా దోహదపడుతుందని వివరించారు. ఈ సదస్సు తర్వాత హైదరాబాద్ లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో మరిన్ని పెట్టుబడులు వస్తాయన్నారు. ఈ సదస్సుకు కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌తో పాటు ప్రపంచ స్థాయి కంపెనీల సీనియర్ ప్రతినిధులు, పరిశోధకులు హాజరవుతారని తెలిపారు.

### టుడే ఫర్ టుమారో..

ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగే బయో ఆసియా సదస్సును హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహిస్తున్నారు. 'టుడే ఫర్ టుమారో' అనే నినాదంతో జరిగే ఈ సదస్సులో ప్రపంచంలోని లైఫ్ సైన్సెస్ కంపెనీలు రేపటి తరాల కోసం తమ ప్రస్తుత సామర్థ్యాన్ని పెంచుకోవడంతో పాటు, పెట్టుబడులకు అనువైన విధానాలు రూపొందించడంపై చర్చిస్తారు. 37 దేశాలకు చెందిన సుమారు 2 వేల మంది ప్రతినిధులు, 800 కంపెనీల ప్రతినిధులు, 75 స్టార్టప్ కంపెనీలు ఈ సమావేశాల్లో భాగస్వాములవుతారు. సదస్సు నిర్వహణలో స్విట్జర్లాండ్‌తో పాటు అస్సాం, కేరళ, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాలు భాగస్వామ్యం వహిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య రంగంలో వస్తున్న అంటువ్యాధులను సమర్థంగా ఎదుర్కోవడంపై సదస్సులో చర్చించనున్నారు. లైఫ్ సైన్సెస్ టెక్నాలజీ, హెల్త్‌కేర్ రంగాల్లో మహిళలు సాధించిన ప్రగతిపైనా చర్చించనున్నారు.

# జిల్లాలకు ఐటీ విస్తరణ

- ఇప్పటికే వరంగల్, కరీంనగర్‌లలో ఏర్పాటు
- మరికొన్ని జిల్లాల్లో ఏర్పాటుకు సర్కార్ చర్యలు
- ప్రభుత్వంతో పలు కంపెనీల చర్చలు
- గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధే లక్ష్యంగా అడుగులు



**సాక్షి, హైదరాబాద్:** మరిన్ని జిల్లాలకు ఐటీని విస్తరించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ మేరకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే వరంగల్, కరీంనగర్ లాంటి జిల్లాల్లో పలు కంపెనీలను ఏర్పాటు చేయగా, మరికొన్ని జిల్లాల్లో ఏర్పాటుకు వివిధ కంపెనీలతో ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఐటీ ఉపపాలసీ కింద కంపెనీలకు ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలు కూడా కల్పిస్తోంది.

### అన్నిచోట్లా అభివృద్ధి..

హైదరాబాద్ దాని శివారు ప్రాంతాల్లోనే ఐటీ కంపెనీలు అధికంగా ఉండటంతో ఇక్కడి యువతకే ఎక్కువగా ఉపాధి దొరుకుతోంది. దీంతో ఐటీ రంగాన్ని ఒకే చోట కేంద్రీకరించకుండా జిల్లాలకు విస్తరించడం వల్ల అన్ని చోట్లా అభివృద్ధి జరిగి, ఆదాయం కూడా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం కొత్తగా వచ్చే ఐటీ సంస్థలను బెంగళూరులో కాదని మైసూరుకు తరలిస్తోంది. తమిళనాడు ప్రభుత్వం కూడా ఎల్‌కాట్ పేరుతో కారిడార్‌ను అభివృద్ధి చేసి ఐటీని ప్రోత్సహిస్తోంది. ఈ తరహాలోనే తెలంగాణ సర్కార్ కూడా జిల్లాల్లో ఐటీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది.

### పరిశ్రమలకు అనుమతులు..

కరీంనగర్‌లో ఏర్పాటైన ఐటీ టవర్ ఈ నెల 18న ప్రారంభానికి సిద్ధమైంది. అలాగే నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో ఐటీ టవర్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. వీటి నిర్మాణాలు పూర్తి కాగానే పరిశ్రమలకు అనుమతులు ఇస్తామని ఇటీవల ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలతో గ్రామీణ ప్రాంతాల్లో సంస్థల ఏర్పాటుకు కంపెనీలు ముందుకు వస్తున్నాయి. సియాంట్ లిమిటెడ్, ఎక్లాస్ట్ హెల్త్ సొల్యూషన్స్ సంస్థలు వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఐటీ సంస్థలు ఏర్పాటు చేస్తే వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు నాస్కామ్ కూడా సంసిద్ధత వ్యక్తం చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఏర్పాటు చేసి రాష్ట్రంలోని అనేక ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీలతో అనుసంధానమైంది.

### వరంగల్‌లో క్వాడ్రంట్..

రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ ఐటీ పరిశ్రమలకు కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే అక్కడ సైయెంట్, టెక్ మహీంద్ర సంస్థల ప్రాంగణాలు ప్రారంభం కాగా మైండ్ ట్రీ సంస్థ అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించింది. తాజాగా క్వాడ్రంట్ వనరుల సంస్థ మడికొండ ఐటీ పార్కులో 1.5 ఎకరాల స్థలంలో ఉత్పత్తి, ఆకృతి అభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయబోతోందని మంత్రి కేటీఆర్ ఇటీవల ట్విట్టర్‌లో వెల్లడించారు.

### ప్రభుత్వ ప్రోత్సాహకాలు..

2018 ఏప్రిల్‌లో ఐటీ పాలసీ ప్రకటన సందర్భంగా గ్రామీణ ప్రాంతాలకు ఐటీ కంపెనీలు తరలివెళ్లేలా ప్రత్యేక ఉపపాలసీ కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా మొదటి మూడేళ్ల పాటు మున్సిపాలిటీ పన్నులు రీయింబర్స్ చేస్తారు. నిరంతర విద్యుత్ సరఫరా, ఏడాదికి 50 మంది ఐటీ నిపుణులను నియమించుకునేందుకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున నియామక సాయం అందిస్తారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇచ్చేందుకు విద్యుత్ ధరలు, ఉద్యోగుల ఎంపిక, ఎగ్జిబిషన్ రెంటల్స్ రీయింబర్స్, వడ్డీ సబ్సిడీ తదితర ప్రోత్సాహకాలు ఉన్నాయి.

## మసీదులో యోగాకు ఉపరాష్ట్రపతి ప్రశంస

**సాక్షి, హైదరాబాద్:** ఓల్డ్‌సిటీలోని ఓ మసీదులో యోగా తరగతులు నిర్వహించటంపై ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆ మసీదు నిర్వాహకులను ప్రశంసిస్తూ ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'మసీదులో యోగా తరగతులు నిర్వహించడం ప్రశంసనీయం. భారతీయ సంప్రదాయంలో భాగమైన యోగాకు ఏ మతంతో సంబంధం లేదు. ఇది శరీరాన్ని, మనసును ఏకం చేసి సాంత్వన చేకూర్చే గొప్ప సాధనం. సశాస్త్రీయమైన ప్రాచీన యోగాపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషిచేస్తున్న శ్రీ ముజ్తబా హసన్ అస్కరీకి హృదయపూర్వక అభినందనలు' అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## తెలంగాణ రైతులకు కృతజ్ఞతలు: కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) శనివారం జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ మద్దతు దారులను పెద్ద సంఖ్యలో గెలిపించిన రాష్ట్ర రైతులకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్‌లో ఆయన పోస్ట్ చేశారు. 90 శాతానికి పైగా పీఏసీఎస్‌లు, 100 శాతం డీసీసీబీ, డీసీఎంఎస్ పీఠాలు టీఆర్‌ఎస్ మద్దతుదారులకు దక్కనుండటంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.


హౌడీ-మోదీ సభలో చేతులు కలిపి నడుస్తున్న భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (ఫైల్)

# కెమ్ ఛో ట్రంప్!

- మోతెరా స్టేడియంలో మోదీ, ట్రంప్ పాల్గొనే కార్యక్రమం
- ప్రధాని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భద్రతకు ఎన్‌ఎస్‌జీ స్నైపర్లు
- పది వేలమంది పోలీసులతో భారీ బందోబస్తు

**అహ్మదాబాద్/వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటకు గుజరాత్ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ట్రంప్ రాక సందర్భంగా కనీవినీ ఎరుగని స్థాయిలో భద్రతా చర్యలను చేపట్టింది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం మోతెరాలో ప్రధాని మోదీ, ట్రంప్ చేపట్టే తొలి కార్యక్రమానికి ప్రభుత్వం 'కెమ్ ఛో ట్రంప్'గా నామకరణం చేసింది. గుజరాతీలో ఈ మాటకు.. 'ఎలా ఉన్నారు ట్రంప్?' అని అర్థం. గత ఏడాది అమెరికాలోని హ్యూస్టన్‌లో ప్రధాని మోదీ, ట్రంప్ పాల్గొన్న 'హౌడీ మోదీ' తరహాలోనే ఇది జరగనుంది. ఈ నెల 24వ తేదీన అహ్మదాబాద్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దంపతులు, ప్రధాని మోదీ, ఇతర ప్రముఖులు అడుగుపెట్టిన దగ్గర్నుంచీ వారిని అనుక్షణం వెన్నాడి ఉండేందుకు జాతీయ భద్రతా దళం(ఎన్‌ఎస్‌జీ) స్నైపర్ బలగాలను మోహరించనుంది. ఎటువంటి అనూహ్య పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పది వేల మందికిపైగా పోలీసులను బందోబస్తుకు వినియోగిస్తోంది. ప్రముఖుల భద్రతలో స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్, నిఘా విభాగాలతోపాటు అమెరికా సీక్రెట్ సర్వీస్ విభాగం కూడా పాలుపంచుకోనున్నాయి.

**22 కిలోమీటర్ల రోడ్ షో**

ఎయిర్‌పోర్టు ప్రాంతం, రోడ్ షో, సబర్మతి ఆశ్రమం, మోతెరా స్టేడియంలో భద్రతను అహ్మదాబాద్ పోలీసులు పర్యవేక్షిస్తారని పోలీస్ డిప్యూటీ కమిషనర్ విజయ్ పటేల్ వెల్లడించారు. 'బందోబస్తులో 25 మంది ఐపీఎస్ అధికారులు, 65 మంది అసిస్టెంట్ కమిషనర్లు, 200 మంది పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, 800 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 10 వేల మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నాం. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్(ఎస్‌పీజీ) ఇప్పటికే ఇక్కడికి చేరుకుంది. ఎన్‌ఎస్‌జీ స్నైపర్ యూనిట్లను కీలక ప్రాంతాల్లో మోహరించాం. బాంబు స్క్వాడ్‌లు నగరంలో ఇప్పటికే తమ పని ప్రారంభించాయి. అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి సబర్మతి ఆశ్రమం, అటునుంచి మోతెరా స్టేడియం వరకు మొత్తం 22 కిలోమీటర్లు సాగే రోడ్‌షోలో ఎన్‌ఎస్‌జీ స్నైపర్ యూనిట్లను మోహరించనున్నాం. అమెరికా సీక్రెట్ సర్వీస్ దళాలతోపాటు నిఘా విభాగం, సీక్రెట్ సర్వీస్ పోలీసులు నిఘాలో పాలుపంచుకుంటున్నారు. అహ్మదాబాద్‌లోని వివిధ హోటళ్లలో బస చేసిన కొత్త అతిథులను, ముఖ్యంగా విదేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నాం. రోడ్ షోతోపాటు స్టేడియం వద్ద అనుమానాస్పద వస్తువులు గానీ, వ్యక్తులు కనిపించినా తమకు తెలియజేసి, సహకరించాలి' అని పోలీస్ డిప్యూటీ కమిషనర్ విజయ్ ప్రజలను కోరారు.

## ఫేస్‌బుక్ ఇచ్చిన గౌరవం: ట్రంప్

సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ తనకు తొలిస్థానం, మోదీకి రెండో స్థానం ప్రకటించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్విట్టర్‌లో ప్రకటించారు. గత నెలలో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల సందర్భంగా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా ట్రంప్..ఫేస్‌బుక్ తనకు మొదటి స్థానం, భారత ప్రధాని మోదీకి రెండో స్థానం ఇవ్వడాన్ని ప్రస్తావించారు.మోదీ ఫేస్‌బుక్ ఖాతాలో 4.4 కోట్ల మంది ఫాలోవర్లు ఉండగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు 2.75 కోట్ల మంది ఫాలోవర్లున్నారు. లైక్‌ల దృష్ట్యా చూసినా ఇద్దరి మధ్య అంతరం భారీగా ఉంది. మోదీకి 4.45 కోట్ల లైక్‌లు వస్తుండగా, అందులో సగానికి కొద్దిగా ఎక్కువ అంటే 2.6 కోట్లు ట్రంప్‌కు వస్తుంటాయి.

## రూ.800 కోట్లతో..



అహ్మదాబాద్‌లోని మోతెరాలో రూ.800 కోట్లతో 1.25 లక్షల మంది వీక్షించేందుకు వీలుగా నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంను ట్రంప్‌తో కలిసి మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి 'కెమ్ ఛో ట్రంప్'గా నామకరణం చేశారు. అహ్మదాబాద్ విమానాశ్రయంలో ట్రంప్ దంపతులకు బలగాలు గౌరవ వందనం సమర్పిస్తాయి. ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రతినిధి బృందం ముందుగా సబర్మతిలోని గాంధీ ఆశ్రమానికి వెళ్లనుంది. ట్రంప్ దంపతులకు ప్రధాని మోదీ సబర్మతి ఆశ్రమ విశిష్టతను వివరించనున్నారు. అక్కడి నుంచి వారు ఇందిరా బ్రిడ్జి మీదుగా మోతెరా స్టేడియంకు చేరుకుంటారు. నూతనంగా నిర్మించిన స్టేడియంలోని సుమారు 1.20 లక్షల మంది ప్రజలు, ప్రముఖులు వారికి స్వాగతం పలుకుతారని పోలీస్ డిప్యూటీ కమిషనర్ విజయ్ పటేల్ చెప్పారు. 'ప్రభుత్వం పంపిన ప్రత్యేక ఆహ్వానంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రజలు అక్కడికి వస్తున్నారు. కార్యక్రమం అనంతరం వీరంతా తిరిగి నిర్దేశిత మార్గాల్లో వెళ్లిపోతారు. స్టేడియం చుట్టూ ఒకటిన్నర కిలోమీటర్ల ప్రాంతాన్ని భద్రతా బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి' అని ఆయన తెలిపారు.. అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి సబర్మతి వరకు 22 కిలోమీటర్ల మేర సాగే రోడ్‌షోలో కూడా ఎన్‌ఎస్‌జీ స్నైపర్ యూనిట్లను మోహరించనున్నారు. వేలాది మంది ప్రజలు రోడ్డుకు రెండువైపులా నిలబడి అతిథులకు స్వాగతం పలకనున్నారు. ఈ మార్గంలో సాంస్కృతిక ఘనతను చాటే పలు చిత్రాలను ఏర్పాటు చేశారు.

నేడు అమిత్ షా ఇంటికి..

# షహీన్‌బాగ్ ర్యాలీ

**న్యూఢిల్లీ/కోల్‌కతా/ముంబై:** పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వెనక్కు తీసుకోవాలంటూ షహీన్ బాగ్ నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇంటి వరకూ ర్యాలీ చేపట్టనున్నట్లు షహీన్‌బాగ్ నిరసనకారులు తెలిపారు. సీఏఏపై అనుమానాలు ఉన్న వారు తన వద్దకు వస్తే వివరిస్తానని అమిత్‌షా చెప్పినందుకే ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ ర్యాలీ మొదలుకానుంది. ర్యాలీపై తమకు సమాచారం లేదని హోంశాఖ తెలిపింది. సీఏఏ, జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ)పై దేశవ్యాప్తంగా నిరసనలు ఎదురవుతున్న సంగతి తెలిసిందే. ప్రత్యేకించి ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో నిరసనలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. శనివారం షహీన్‌బాగ్ నిరసనకారులు కొందరు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) గురించి మాట్లాడేందుకు సముఖత వ్యక్తం చేశారు.

**డబ్బులు, బిర్యానీ కోసమే నిరసనలు..**

షహీన్‌బాగ్‌లో నిరసనలు తెలుపుతున్న వారు డబ్బు, బిర్యానీల కోసమే రోజూ వేదిక వద్ద కూర్చుంటున్నారని పశ్చిమబెంగాల్ బీజేపీ చీఫ్ దిలీప్‌ఘోష్ ఆరోపించారు. 'నిరక్షరాస్యులు, సామాన్యులు, పేదలు, అజ్ఞానులు అక్కడ నిరసనల్లో పాల్గొంటున్నారు. నేతలిచ్చే డబ్బు, బిర్యానీల కోసమే నిరసనలు చేస్తున్నారు. పైగా వీరికి పంపే డబ్బంతా విదేశాల నుంచే వస్తోంది. కాంగ్రెస్ నేత చిదంబరం, సీపీఐ నేత బృందా కారత్‌లాంటి వారి ప్రసంగాలు వినే శ్రోతలు వారు' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

**ముంబైలో భారీ ర్యాలీ**

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరపట్టిక (ఎన్నార్సీ), జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)లకు వ్యతిరేకంగా శనివారం ముంబైలో భారీ ర్యాలీ జరిగింది. దీనికి వేలాది మంది హాజరు కాగా అందులో అధిక సంఖ్యలో మహిళలు ఉన్నారు. ఉర్దూ కవి ఫయాజ్ అహ్మద్ ఫయాజ్ రచించిన 'హమ్ దేఖేంగే' (మేం చూస్తాం) అంటూ.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనకు ముంబైతో పాటు నవీ ముంబై, థానేల నుంచి తరలివచ్చారు.


ముంబైలో సీఏఏకు వ్యతిరేకంగా శనివారం జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

## క్లుప్తంగా...

### వ్యాన్‌లో విద్యార్థుల ఆహుతి

**చండీగఢ్:** పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లాలో శనివారం ఓ స్కూల్ వ్యానులో మంటలు చెలరేగి నలుగురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. లాంగోవాల్-సిడ్‌సాచర్ రోడ్డులో ఈ ఘటన జరిగిందని, ఆ సమయంలో వ్యానులో 12 మంది పిల్లలున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై పంజాబ్ సీఎం అమరీందర్ మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. ఈ ఘటనపై స్కూల్ ప్రిన్సిపాల్, యాజమాన్యంపై కేసు నమోదు చేశామని సంగ్రూర్ డీసీపీ ఘన్‌శ్యామ్ తెలిపారు. మృతిచెందిన చిన్నారుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ప్రభుత్వం తెలిపింది.

### తప్పిన విమాన ప్రమాదం



**న్యూఢిల్లీ:** పుణేలోని విమానాశ్రయ రన్‌వేపైకి అకస్మాత్తుగా ఓ జీపు వచ్చిన ఘటనలో ఎయిర్ ఇండియాకు చెందిన ఓ విమానం త్రుటిలో పెను ప్రమాదాన్ని తప్పించుకుంది. ఈ ఘటనలో విమానం కిందిభాగం స్వల్పంగా దెబ్బతిందని పౌర విమానయాన అధికారులు (డీజీసీఏ) తెలిపారు. శనివారం ఉదయం ఎయిర్ ఇండియాకు చెందిన ఏ321 విమానం పుణే విమానాశ్రయంలోని రన్‌వేపై 120 నాట్స్ వేగంతో టేకాఫ్ అవుతుండగా జీపులో ఓ వ్యక్తి రన్‌వేపైకి రావడాన్ని విమాన సిబ్బంది గమనించారు. ఆ జీపును ఢీకొట్టకుండా ఉండేందుకు పైలట్ విమానాన్ని మరింత పైకి లేపాడు. అయితే ఈ ఘటన జరిగినప్పటికీ ఆ విమానం ఢిల్లీ విమానాశ్రయంలో భద్రంగా దిగింది.

### యెమెన్‌లో కూలిన సౌదీ ఫైటర్ జెట్

**రియాద్:** అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న యెమెన్‌లో సౌదీ అరేబియాకు చెందిన యుద్ధవిమానం కూలిపోయింది. ప్రభుత్వ దళాలకు మద్దతుగా అల్ జౌఫ్ ప్రావిన్సులోకి వెళ్లిన టోర్నడో రకం విమానం శనివారం నేల కూలిందని సౌదీ మీడియా ప్రకటించింది. ఆ విమానంలోని సిబ్బంది గురించి కానీ, కూలడానికి కారణాలను గానీ వెల్లడించలేదు. అయితే, తమ క్షిపణులే ఆ విమానాన్ని కూల్చివేశాయని హౌతి ఉగ్రవాదులు ప్రకటించారు. తమ ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లో సంకీర్ణ బలగాలు జరిపిన దాడుల్లో డజన్ల సంఖ్యలో ప్రజలు మరణించారని హౌతి ఉగ్రవాదుల ప్రతినిధి అబ్దెల్‌సలామ్ పేర్కొన్నారు.



సెర్బియాలోని వంజకా బంజాలో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 12వ 'కిస్ మి' కార్యక్రమంలో ఇరేనా, దోర్జె బోజిక్‌లు విజేతలుగా నిలిచారు. వీరు ఏకధాటిగా 112 నిమిషాల పాటు ముద్దు పెట్టుకున్నారు.

# కేజ్రీ.. ముచ్చటగా మూడోసారి

- నేడు ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ ప్రమాణం
- గత కేబినెట్‌లోని ఆరుగురు కూడా..
- వేదికపై 50 మంది ప్రత్యేక అతిథులు
- రాంలీలా మైదాన్‌లో భారీ భద్రతా ఏర్పాట్లు


విందు సందర్భంగా కాబోయే మంత్రులతో అరవింద్ కేజ్రీవాల్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రిగా మూడోసారి ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్(51) ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి ఢిల్లీలోని చారిత్రక రాంలీలా మైదానం వేదిక కానుంది. మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టనున్న కేజ్రీవాల్ ఈసారి.. రాజకీయ ప్రముఖులెవరికీ ఆహ్వానాలు పంపలేదు. వేదికపై కేజ్రీవాల్‌తోపాటు ఢిల్లీ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న వివిధ రంగాలకు చెందిన 50 మంది ప్రత్యేక అతిథులు ఉంటారని ఆప్ నేత మనీశ్ సిసోడియా వెల్లడించారు. అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి సుమిత్ నగల్, ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఐఐటీ సీటు సాధించిన విజయ్ కుమార్, మొహల్లా క్లినిక్ డాక్టర్ ఆల్కా, బైక్ అంబులెన్స్ సర్వీస్ అధికారి యుధిష్టిర్ రాఠీ, నైట్ షెల్టర్ కేర్ టేకర్ సబీనా నాజ్, మెట్రో పైలట్ నిధి గుప్తా తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి 1.25లక్షల మంది ప్రజలు తరలివస్తారని భావిస్తున్నామని మనీశ్ సిసోడియా చెప్పారు. ప్రధాని మోదీతోపాటు ఢిల్లీకి చెందిన బీజేపీ, ఆప్ ఎమ్మెల్యేలకు ఆహ్వానం పంపారు. 'ఢిల్లీ వాసులారా, మీ కుమారుడు మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వచ్చి మీ కుమారుడిని ఆశీర్వదించండి' అంటూ కేజ్రీవాల్ ట్విట్టర్‌లో ప్రజలను ఆహ్వానించారు. రాంలీలా మైదానం, పరిసరాల్లో ఢిల్లీ పోలీసు, పారామిలిటరీ దళాలు, సీఆర్‌పీఎఫ్ కలిపి సుమారు 3 వేల మందిని మోహరించనున్నారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల నిఘాతోపాటు మైదానం చుట్టుపక్కల బ్యాగేజి స్కానర్లను, డోర్ ఫ్రేమ్ డిటెక్టర్లను అమర్చారు. మైదానంలోపలా బయటా 'ధన్యవాద్ ఢిల్లీ' అంటూ కేజ్రీవాల్ ఫొటో ఉండే భారీ కటౌట్లు, బ్యానర్లను ఏర్పాటు చేశారు.

**ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి: బీజేపీ**

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలంటూ జారీ చేసిన ఆదేశాన్ని అరవింద్ కేజ్రీవాల్ వెనక్కి తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే విజేందర్ గుప్తా కోరారు. ఈ ఆదేశం నియంతృత్వాన్ని తలపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ ఆరోపణలను ఆమ్ ఆద్మీ పార్టీ ఖండించింది. ఉపాధ్యాయులకు తాము ఆహ్వానాలు పంపామే తప్ప, ఆదేశాలు కాదని ఆప్ నేత మనీశ్ సిసోడియా స్పష్టం చేశారు.

## కాబోయే మంత్రులకు కేజ్రీవాల్ విందు

ఢిల్లీ అభివృద్ధి కార్యాచరణతోపాటు వచ్చే మూడు నెలల్లో తీసుకోవాల్సిన కీలక నిర్ణయాలపై కేజ్రీవాల్ కాబోయే మంత్రులతో చర్చించారు. గత మంత్రివర్గంలోని ఆరుగురికి శనివారం తన నివాసంలో కేజ్రీవాల్ విందుఇచ్చారు. ఢిల్లీలో రెండు కోట్ల మొక్కలు నాటడం, యమునా నదిని శుద్ధి చేయడం, కాలుష్యం తగ్గించడం వంటి ప్రజలకిచ్చిన 10 హామీల అమలుకు రంగంలోకి దిగాలని సహచరులను కేజ్రీవాల్ కోరారని ఆప్ నేత మనీశ్ సిసోడియా తెలిపారు. గత మంత్రివర్గంలో ఉన్న సిసోడియా, సత్యేందర్ జైన్, గోపాల్ రాయ్ సహ ఆరుగురు మంత్రులు కేజ్రీవాల్‌తోపాటు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# సామాజిక సమస్యలపై దృష్టి సారించండి

**శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చిన ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ:** భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. పోషకాహార లోపం వంటి సమస్యలతో దేశం సతమతమవుతోందని.. పంటల్లో పోషకాలను పెంచే దిశగా వ్యవసాయంలో మార్పులు చేయాలని సూచించారు. సీఎస్ఐఆర్ సొసైటీ నిర్వహించిన సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ.. వర్చువల్ ల్యాబ్‌ల ప్రాముఖ్యతను వివరించారు. వాటిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. యువత శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు మళ్లేలా చేయాలని సూచించారు. సైన్స్ రంగంలో మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న భారతీయులు పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టులలో సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10, 12వ తరగతుల పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాని మోదీ విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా సంతోషంగా పరీక్షలు రాయాలని ట్వీట్‌చేశారు.

# బస్సు ప్రమాదంలో 11 మంది మృతి


ప్రమాదంలో ధ్వంసమైన బస్సు

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదంలో 11 మంది మరణించారు. మైసూరు నుంచి మంగళూరుకు వెళ్తున్న బస్సు ఉడుపి- చిక్కమగళూరు ఘాట్ రోడ్డు కార్కళ తాలూకా మాళె సమీపంలో శనివారం సాయంత్రం ప్రమాదానికి గురైంది. బస్సు ఘాట్ రోడ్డులో వెళ్తుండగా అదుపు తప్పి కుడివైపు బండరాళ్లను అతివేగంతో బలంగా ఢీకొట్టుకుంటూ దూసుకెళ్లింది. బస్సు ముందుభాగం తీవ్రంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 20 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఉడుపి జిల్లాలోని మణిపాల్, కార్కళలోని ఆస్పత్రులకు తరలించారు. మైసూరు జిల్లాకు చెందిన ఈ టూరిజం బస్సులో మొత్తం 35 మంది పర్యాటకులు ఉన్నారు. మైసూరుకు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ ఉద్యోగులను విహార యాత్రకు తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.


యూఏఈలోని అబుదాబిలో ఉన్న షేక్ జాయెద్ గ్రాండ్ మసీదును సందర్శించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంక

# జ్యోతిరాదిత్య వర్సెస్ కమల్‌నాథ్


సీఎం కమల్‌నాథ్


జ్యోతిరాదిత్య సింధియా

**న్యూఢిల్లీ/గ్వాలియర్:** మధ్యప్రదేశ్‌లో రైతు రుణ మాఫీ, ఉపాధ్యాయుల రెగ్యులరైజేషన్ వంటి ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చకుంటే ఆందోళనలు చేపడతామంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జ్యోతిరాదిత్య సింధియా చేసిన హెచ్చరికపై రాష్ట్ర సీఎం కమల్‌నాథ్ స్పందించారు. 'ఆయన (సింధియా) తనకు నచ్చినట్లు చేయొచ్చు. ఆయన్ను ముందుగా ఆందోళనలకు దిగనివ్వండి. చూద్దాం' అని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టో అంటే ఐదేళ్లకు వర్తించేదే తప్ప ఐదు నెలలకు కాదంటూ వ్యాఖ్యానించారు. పంటనష్టం సర్వే, రైతు రుణమాఫీ విషయంలో అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరచూ సింధియా తప్పుపడుతున్నారు.

**సోనియానే చూసుకుంటారు!**

మధ్యప్రదేశ్ కాంగ్రెస్‌కు కొత్త అధ్యక్షుడిని పార్టీ చీఫ్ సోనియా నియమిస్తారని ప్రస్తుతం అధ్యక్ష బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కమల్‌నాథ్ శనివారం గ్వాలియర్‌లో చెప్పారు. పార్టీ అధ్యక్ష పదవి కోసం పలువురు రేసులో ఉన్నారంటూ వస్తున్న వార్తలపై ఆయన పైవిధంగా స్పందించారు.

# కోవిడ్‌తో విలవిల

- 1,523కు చేరుకున్న మరణాల సంఖ్య
- 66 వేల మందికి వ్యాధి
- చైనా ఆరోగ్య కమిషన్ వెల్లడి

**బీజింగ్:** చైనాలో కోవిడ్-19 మృతుల సంఖ్య రోజురోజుకూ ఎగబాకుతోంది. ఇప్పటివరకూ ఈ వైరస్ బారిన పడి 1,523 మంది మరణించగా మొత్తం 66వేల మంది దీని బారినపడినట్లు నిర్ధారణ అయిందని చైనా ఆరోగ్య కమిషన్ శనివారం వెల్లడించింది. చైనా మొత్తమ్మీద కోవిడ్ బారిన పడినట్లు నిర్ధారణ అయిన వారి సంఖ్య 66,492కు చేరుకోగా, వీరిలో 11, 053 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వ్యాధి సోకినట్లు అనుమానిస్తున్న వారి సంఖ్య 8096కు పెరిగింది. కోవిడ్ వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య క్రమేపీ తగ్గుతోందని చైనా ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించిందని, వ్యాధికి కేంద్రబిందువుగా భావిస్తున్న హుబే ప్రాంతం మినహా మిగిలిన చోట్ల తగ్గుదల నమోదవుతోందని తెలిపింది. ఇదిలా ఉండగా.. కోవిడ్-19ను నియంత్రించేందుకు ఆరోగ్యశాఖ అధికారులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, బిగ్ డేటా వంటి టెక్నాలజీలను వాడాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.


జపాన్‌లో డైమండ్ ప్రిన్సెస్ నౌక వద్ద వైద్యసిబ్బంది

**ఆ తల్లీ బిడ్డ డిశ్చార్జ్**

కోవిడ్ బారినపడ్డ 67 రోజుల వయసున్న పసిబిడ్డ చికిత్స తర్వాత ఆరోగ్యంగా ఆసుపత్రి నుంచి విడుదలైంది. జియాంగ్ అనే ఇంటిపేరున్న ఈ బిడ్డను హుబేలోని సెంట్రల్ ఆసుపత్రిలో చేర్చారు. గుయిఝూ ప్రాంతం నుంచి సెలవులు గడిపేందుకు గత నెల 16న హుబే వచ్చిన జియాంగ్ తల్లి దండ్రులకు వ్యాధి సోకినట్లు జనవరి 25న నిర్ధారణ అయింది. ఇదే సమయంలో బిడ్డలోనూ వ్యాధి లక్షణాలు కనిపించాయి. దీంతో ఫిబ్రవరి రెండవ తేదీ జియాంగ్‌ను ఆసుపత్రిలో చేర్పించడం తెల్సిందే.

**వచ్చే వారం 406 మంది విడుదల?**

ప్రత్యేక విమానాల ద్వారా చైనాలోని వూహాన్ నుంచి తీసుకొచ్చి ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ) కేంద్రాల్లో పర్యవేక్షణలో ఉంచిన 406 మందిని వచ్చే వారం విడుదల చేసే వీలుంది. కోవిడ్ సోకలేదని నిర్ధారణ చేసుకున్నాకే విడుదలచేస్తారని అధికారులు శనివారం తెలిపారు. 650లో 406 మందిని న్యూఢిల్లీలోని ఐటీబీపీ కేంద్రాల్లో పర్యవేక్షణలో ఉంచగా, మిగిలిన వారిని మానేసర్‌లోని సైనిక శిబిరంలో పర్యవేక్షణలో ఉంచారు.

## కోవిడ్‌కు విరుగుడుగా చైనా వైద్యం?

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు చైనా సంప్రదాయ వైద్యాన్ని సమర్థంగా ఉపయోగిస్తోంది. వ్యాధి సోకిందని నిర్ధారణ అయిన వారిలో కనీసం సగంమందికి సంప్రదాయ వైద్యంతో సాంత్వన చేకూరిందని చైనా ఆరోగ్యశాఖ అధికారి ఒకరు తెలిపారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న హుబేలో తాము అల్లోపతితోపాటు చైనీస్ వైద్యం అందించడం మొదలుపెట్టామని చైనా నేషనల్ హెల్త్ కమిషన్ ఉపాధ్యక్షుడు వాంగ్ హెషింగ్ తెలిపారు. అల్లోపతి వైద్యంలో కరోనా వైరస్ నివారణకు నిర్దిష్టమైన చికిత్సలేకపోవడంతో ఈ వార్తకు ప్రాధాన్యమేర్పడింది.

## ఆ కరెన్సీ నోట్ల చలామణీ బంద్

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు చైనా ప్రయత్నాలను ముమ్మరం చేసింది. వైరస్‌ను నియంత్రించే లక్ష్యంతో తాజాగా చైనా ఆరోగ్యశాఖ అధికారులు వ్యాధికి కేంద్రబిందువుగా భావిస్తున్న ప్రాంతాల్లోని కరెన్సీ నోట్ల చలామణీని తాత్కాలికంగా ఆపేశారు. ఈ నోట్ల ద్వారా వైరస్ ఇతరులకు సోకుతుందేమో అన్న అనుమానంతో ఈ చర్యలు చేపట్టినట్లు అంచనా. పాతనోట్ల స్థానంలో కొత్తనోట్లు అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా వైస్ గవర్నర్ ఫాన్ వైఫీ తెలిపారు.

# కశ్మీర్‌పై జోక్యమొద్దు

**టర్కీ అధ్యక్షుడికి భారత్ హితవు**

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్ పార్లమెంటులో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ కశ్మీర్‌పై చేసిన వ్యాఖ్యలను భారత్ శనివారం ఖండించింది. కశ్మీర్ భారత అంతర్గత వ్యవహారమని, ఇందులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ బదులిచ్చారు. 'వాస్తవాలు తెలుసుకోకుండా భారత అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దని టర్కీ నాయకులకు చెబుతున్నాం. పాకిస్తాన్ నుంచి భారత్‌కు ఈ ప్రాంతం ద్వారానే ఉగ్రవాద ముప్పు దాగి ఉందన్న విషయం తెలుసుకోవాలి' అంటూ సమాధానమిచ్చారు. ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాల వల్ల కశ్మీర్ పౌరులు ఇబ్బందులు పడుతున్నారని ఎర్డోగన్ పాక్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

**షా ఫైజల్‌పై పీఎస్‌ఏ చట్టం..**

జమ్మూకశ్మీర్‌లో ఐఏఎస్‌కు రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన షా ఫైజల్‌ను అధికారులు ప్రజా భద్రత చట్టం (పీఎస్ఏ) కింద శుక్రవారం నిర్బంధంలోకి తీసుకున్నారు. ఈ చట్టంలో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగం కింద ప్రజా భద్రత కింద ఆర్నెల్ల వరకూ నిర్బంధంలో ఉంచవచ్చు. రెండో విభాగమైన 'రాష్ట్రానికి ముప్పు' కింద రెండేళ్ల పాటు ఏ విచారణా లేకుండానే నిర్బంధంలో ఉంచవచ్చు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం
ఉత్తరాయణం శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి బ.అష్టమి రా.8.25 వరకు, తదుపరి నవమి, నక్షత్రం విశాఖ ఉ.10.27 వరకు, తదుపరి అనూరాధ వర్జ్యం ప.2.18 నుంచి 3.20 వరకు దుర్ముహూర్తం సా.4.25 నుంచి 5.11 వరకు, అమృతఘడియలు... రా.11.29 నుంచి 1.02 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం : 5.58
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అరవింద్ కేజ్రీవాల్

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

'ఆదివారమా! ఆదివారం నేను ఊళ్లో ఉండను కదా..' అన్నారు నవ్వుతూ నరేంద్ర మోదీ .

ప్రమాణ స్వీకారానికి ఆయన్ని పిలిచేందుకు ఎవరికీ తెలియకుండా నేనొక్కణ్నే వెళ్లాను. తెలిస్తే నాకేం ఇబ్బంది లేదు. ఆయన ఇబ్బంది పడకూడదని.

మోదీజీని అంత దగ్గరగా చూడ్డం ఈ ఐదేళ్లలో అదే తొలిసారి. మనిషి బాగా స్లిమ్ అయ్యారు! కూర్చుని ఉన్నప్పుడు పొట్ట లేనివారికి కూడా పొట్ట ఉన్నట్లుగా కనిపిస్తుంది. మోదీజీకి అలాక్కూడా లేదు. రామ్‌దేవ్ బాబా పొట్టలా చదునుగా ఉంది.

వెంటనే నా పొట్టను చూసుకున్నాను.

'ఏంటి చూస్తున్నారు?' అన్నారు మోదీజీ.

'చూడ్డంలేదు మోదీజీ. చూసుకుంటున్నాను. మీలా నేను ఆసనాలు వెయ్యలేకపోతున్నాను' అన్నాను.

మోదీజీ నవ్వారు.

'వెయ్యలేకపోవడం కాదు కేజ్రీవాల్. మీ చేత ఆసనాలు వేయించే ప్రజా సమస్యలేమీ లేకపోవడం. అన్నీ ఫ్రీగా ఇచ్చేసి మీరు ఫ్రీగా కూర్చున్నారు. కూర్చొని తింటే కొండలైనా కరుగుతాయని అంటారు. కొండలు కరుగుతాయి కానీ పొట్ట పెరుగుతుంది' అన్నారు.

'పెద్దగా ఏమీ తినను మోదీజీ. ఆలూ పరాట, ఆలూ సబ్జీ. రెండు పీస్‌లు జిలేబీ. ఎప్పుడైనా ఇంట్లో తినడం బోర్ కొడితే కన్నాట్ ప్లేస్‌లో ఒక చైనీస్ జాయింట్ ఉంది. అక్కడికెళతాం నేనూ, సునీత.. ఎవరికీ కనిపించకుండా. ఇప్పుడా చైనీస్ జాయింట్ కూడా కనిపించడం లేదు. పటేల్ నగర్‌లో టేస్ట్ ఆఫ్ ఇండియాకు వెళుతున్నాం. పక్కన సునీత ఉంటే ఏది పడితే అది తిననివ్వదు. అందుకు



తీసుకెళతాను తనని. అయినప్పటికీ పొట్ట వచ్చేస్తోంది' అన్నాను పొట్టను అరిచేత్తో లోపలికి నొక్కుకుంటూ.

"నోరు నొక్కేయగలం కానీ, పొట్టను నొక్కలేం కేజ్రీవాల్. ఎంత నొక్కితే అంత ముందుకు వస్తుంది" అన్నారు.

'మీరు ఊళ్లో ఎప్పుడుంటారు మోదీజీ' అని అడిగాను.

'నా ఆసనాలకే టైమ్ సరిపోవడం లేదు. మీకు ఆసనాలేం నేర్పగలను?' అన్నారు.

'ఆసనాల కోసం కాదు మోదీజీ. నా ప్రమాణ స్వీకారానికి రావడానికి' అన్నాను.

'ఈ ఆదివారం అయితే ఊళ్లో ఉండను' అన్నారు.

నవ్వాను.

'ఊళ్లన్నీ మీవే అయినప్పుడు మీరు ఊళ్లో ఉండకపోవడం, ఊళ్లో లేకపోవడం అనేది ఉంటుందా మోదీజీ' అన్నాను.

'ఎందుకుండదూ కేజ్రీవాల్. ఊళ్లన్నీ నావే. ఢిల్లీ నా ఊరయిందా! దేశం మొత్తం నాదే. ఢిల్లీ నాదయిందా!' అన్నారు.

ఆప్ గెలవడంతో మోదీజీ బాగా హర్ట్ అయినట్లున్నారు.

'ఊర్నుంచి ఎప్పడొస్తారు మోదీజీ' అని అడిగాను.

"చాలా పనులున్నాయి కేజ్రీవాల్. ఢిల్లీలా కాదు వారణాసి. ఢిల్లీలో ఐదేళ్లకోసారి పని చేసిపెడితే చాలు. వారణాసిలో రోజూ ఏదో ఒక పని చేస్తుండాలి. ఒక్క ఆదివారం రోజే నాకెన్ని పనులో చూడండి. మూడు జ్యోతిర్లింగాలను కనెక్ట్ చేస్తూ యూపీ నుంచి ఎంపీకి ట్రైన్ స్టార్ట్ చేస్తున్నాం. నాలుగొందల పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఓపెన్ చేస్తున్నాం. అరవై మూడు అడుగుల ఎత్తున దీన్‌దయాళ్ విగ్రహాన్ని నిలబెడుతున్నాం. మొత్తం ముప్పై ప్రాజెక్టులు" అన్నారు.

'అవెంత పనులు మోదీజీ. చిటికెలో అవగొట్టేస్తారు మీరు' అన్నాను.

ఆ మాటకు ఆయనేం సంతోషించలేదు.

'ఎంత చిటికెలో చేసే పనులైనా ప్రమాణ స్వీకారం కంటే పెద్ద పనులే కేజ్రీవాల్' అన్నారు.. పైకి లేస్తూ.

కడుపులో ఉన్నదేమిటో తెలియనివ్వరు మోదీజీ. ఆయన పొట్ట ఫ్లాట్‌గా ఉండటానికి అది కూడా ఒక కారణం కావచ్చు.

# బిగ్‌బాస్ దొరికాడు!



వర్ధెల్లి మురళి

జనతంత్రం



ఏ చేతికైతే వాచీ ఉండదో, ఏ చేతి వేళ్లయితే ఉంగరాలను ధరించవో, ఏ చేతి పిడికిలైతే లాఘవంగా పిడిబాకును పట్టుకోగలదో, అత్యంత ప్రజాదరణతో అధికారంలోకి వచ్చిన నాయకుడిని ఆ పిడిబాకుతో ఏ చేయైతే శ్రద్ధగా, నెత్తురు చుక్క నేల రాలకుండా వెన్నుపోటు పొడవగలదో, ఏ చేతి నైపుణ్యం వల్లనైతే ఎన్నికా–తొక్కా లేకుండా అధికారం వచ్చి ఒళ్లో రాలగలదో, ఏ చేతి మహత్యమైతే తమ చేతులను నిరంతరం తడుపుతూనే ఉంటుందని మీడియా సంస్థలు నిత్య స్తుతిస్తోత్రాలతో ప్రాతఃస్మరణ చేసుకుంటాయో... అట్టి అరచేతి సాముద్రికమంతా త్వరలో లోక విదితం కానున్నదా?

ఏ పేరు చెబితే నిప్పు కూడా సిగ్గుపడి పోతుందో, ఏ పేరు చెప్పగానే పప్పు చక్కగా ఉడుకుతుందో, ఏ పేరు చెబితే మేఘాలు వర్షించడం మాని కొయ్యబారి పోతాయో, ఎవరి పేరు చెబితే సీబీఐ కూడా హడలి పోయి ఆయనపై దర్యాప్తు చేసే సిబ్బంది తమ వద్దలేదని వినయంగా చేతులు ముడుచుకుంటుందో, ఎవరి పేరుపైనైతే ఒక్క ఫిర్యాదు న్యాయస్థానం గుమ్మం తొక్కినా... శాస్త్ర పారంగతులు రంగప్రవేశం చేసి ఆ వ్యాజ్యాన్ని న్యాయ ప్రాంగణం నుంచి తరిమి వేయగలరో, అట్టి పేరు... ఈ భూప్రపంచం ఇప్పటి వరకూ కనీవినీ ఎరుగని అతిపెద్ద ఆర్థిక నేరం తాలూకు ఛార్జిషీటులో ఏ–వన్‌గా నమోదు కాబోతున్నదా?

సిగ్నల్స్ అందుతున్నాయి. అది టిప్ ఆఫ్ ఐస్‌బర్గ్. డొంక మొత్తాన్ని ఊపేయగల తీగ ఒకటి దొరికింది. మరికొన్ని రోజులపాటు చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్లినా, న్యాయదేవత నిబ్బరంగా తనకాళ్లపై తాను నిలబడినా, ధర్మదేవత కనీసం ఒక్క పాదంతోనైనా నడిచినా పై ప్రశ్నలకు సమాధానం ఔనని చెప్పక తప్పదు. గడిచిన వారం రోజులపాటు ఐటీ శాఖ అధికారులు ఏపీ, తెలంగాణలో సోదాలు జరిపిన అనంతరం సీబీడీటీ విడుదల చేసిన పత్రికా ప్రకటన దేశవ్యాపితంగా ప్రకంపనలు సృష్టిస్తున్నది. ఒక ప్రముఖ వ్యక్తి మాజీ వ్యక్తిగత కార్యదర్శితో పాటు వారి సన్నిహితులైన వారి సంస్థల్లో ఐటీ సోదాలు జరిగినట్టు పత్రికా ప్రకటన స్పష్టం చేయడంతో పైకి కనిపిస్తున్న ఈ నీడలు ఎవరి జాడలన్న సంగతి సందేహాతీతంగా సమస్త ప్రజలకు అర్థమైపోయింది. ఆదాయపు పన్ను శాఖ ఇటీవలి కాలంలో వెలికితీసిన అతిపెద్ద అక్రమ రాకెట్ ఇది. బోగస్ సబ్ కాంట్రాక్టర్లను సృష్టించి, కేవలం కాగితాల మీదనే బోగస్ బిల్లులను తయారు చేసి మూడు చిన్న చిన్న ఇన్‌ఫ్రా కంపెనీల ద్వారానే రూ. రెండువేల కోట్ల రూపాయలను 'గమ్యస్థానానికి' చేర్చిన వైనాన్ని ఐటీ అధికారులు బయట పెట్టారు. సదరు గమ్యస్థానం యజమానైన 'బిగ్ బాస్' ఎవరో అనే సస్పెన్స్‌కు తెరపడింది. ఆ బిగ్ బాస్ అనుయాయులు మీడియా ముందు ఎంత అమాయకత్వం నటించినా, ముక్కు చీదినా, నొసలు చిట్లించినా, కుక్కుటశాస్త్రాన్ని కోట్ చేసినా ఉపయోగపడలేదు. బిగ్ బాస్ బొమ్మ, ఆ పక్కన ఇంకో బుల్లి బాస్ బొమ్మ అద్దిరిపోయేలా కనిపిస్తున్నాయి.

ఐటీ అధికారులు పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించిన వివరాల ప్రకారం మూడు ఇన్‌ఫ్రా కంపెనీలు సబ్‌కాంట్రాక్టర్ల పేరుతో, సప్లయర్ల పేరుతో డజన్ల కొద్ది డొల్ల కంపెనీలను సృష్టించాయి. ఇవన్నీ కాగితం కంపెనీలే. వాస్తవంగా ఏదీ ఉండదు. వీటిలో చాలా కంపెనీల వార్షిక టర్నోవర్‌ను రూ. రెండు కోట్లకు లోపుగానే చూపెట్టారు. అందువల్ల వీటికి అకౌంటు పుస్తకాల నిర్వహణ నుంచి మినహాయింపు లభిస్తుంది. ప్రధాన ఇన్‌ఫ్రా కంపెనీ నుంచి డొల్ల కంపెనీలకు, డొల్ల కంపెనీల్లో ఒక దానికి మరొక దానికీ మధ్య అనేక అల్లిబిల్లి బదలాయింపులను కాగితాలపై చూపెట్టారు. ఇవన్నీ ఉత్తుత్తివే. కానీ, ఉద్దేశించిన డబ్బు గమ్యస్థానానికి చేరడం ఒక్కటే సత్యం. ఈ గందరగోళం దారులన్నింటినీ కనిపెట్టడానికి కొంత సమయం కావాలి కనుక బిగ్‌బాస్‌ను రెడ్ హ్యాండెడ్‌గా నిలబెట్టడానికి ఆ మాత్రం ఆలస్యం తప్పదు. సాధారణంగా కార్పొరేట్ సంస్థలూ, కాంట్రాక్టర్లు మనీ ల్యాండరింగ్ కోసం అనుసరించే పద్ధతి ఇది. రూ. వంద కోట్ల ప్రజాధనంతో పూర్తయ్యే ప్రాజెక్టు వ్యయం పొలిటికల్ బాస్ ప్రమేయంతో రెండొందల కోట్లకు పెరుగుతుంది. ఆ పెరిగిన వంద కోట్లు ఈ మార్గాన అంతిమంగా సదరు పొలిటికల్ బాస్ అడ్రస్‌కు చేరుతుంది. ఆ విధంగానే ఇక్కడ రెండువేల కోట్ల రూపాయలు 'గమ్యస్థానం' చేరుకున్నాయని ఆదాయపు పన్ను శాఖ పత్రికా ప్రకటన సారాంశం. ఈ డబ్బుతో విదేశీ లావాదేవీలు కూడా జరిగాయని ఐటీ శాఖ వివరించింది. ఈ మొత్తం సైకిల్‌లో ఆదాయపు పన్ను ఎగవేత, మనీ ల్యాండరింగ్, జీఎస్టీ ఎగవేత తదితర నేరాలకు సంబంధిత సంస్థలు పాల్పడ్డాయి. బహుశా మిగిలిన శాఖల అధికారులు కూడా త్వరలో రంగంలోకి దిగుతారు.

రెండు వేల కోట్లకు సంబంధించిన లూటీ విషయాలనే ఐటీ శాఖ అధికారికంగా ప్రకటించినప్పటికీ, ఇటువంటివే మరికొన్ని లావాదేవీలపై అధికారులు ఇప్పటికే నిర్ధారణకు వచ్చారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. వీరి చర్చల్లో వినిపిస్తున్న వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను దక్కించుకున్న ఒక పెద్ద కంపెనీ నుంచి డొల్ల కంపెనీల ద్వారా దారిమళ్లిన రూ. 1,200 కోట్ల వ్యవహారం కూడా నిర్ధారణ అయింది. వేర్వేరు రాష్ట్రాల్లో ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపడుతున్న సంస్థ నుంచి 250 కోట్లు మళ్లించారనీ, బిగ్‌బాస్ సన్నిహితుడూ, మాజీ పార్టీ సహచరుడైన వ్యక్తి కంపెనీ నుంచీ, ఇప్పటికీ సన్నిహితంగా వుంటూ ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు దక్కించుకున్న వ్యక్తి కంపెనీ నుంచీ కలిపి రూ.350 కోట్లు మళ్లించారనీ కర్ణాకర్ణి సమాచారం. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మరో కంపెనీ నుంచి జరిగిన సందేహాస్పద లావాదేవీలను కూడా ఐటీ శాఖ గుర్తించినట్టు తెలుస్తున్నది. సోలార్ కంపెనీల నుంచి బిగ్‌బాస్ కుటుంబ సన్నిహితుని కంపెనీలోకి రూ.200 కోట్లు ప్రవహించిన విషయం కూడా నిర్ధారణ అయినట్టు తెలుస్తున్నది. ఈ వివరాలన్నీ కొద్ది కాలంలో అధికారికంగా వెలువడే అవకాశం వుందని రాజకీయ వర్గాల్లో చలామణీ అవుతున్న మాట.

పైన చెప్పుకున్న వివరాలన్నీ మచ్చుకు మాత్రమే. ఇప్పటిదాకా కనిపించింది తోకే. పూర్తి ఆకారం ఇంకా బయటకు రావలసి ఉన్నది. దొరికింది తీగే. డొంకంతా కదలవలసి ఉన్నది. 2014 నుంచి 2019 వరకు మధ్య కాలంలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు వ్యవహారాన్ని పరిశీలిస్తే చాలు జరిగిన దోపిడీ ఎంత భయానకంగా వుందో, ఎంత బీభత్సంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే సాగునీటి ప్రాజెక్టులపై ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. పోలవరం మినహా మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులన్నిటినీ రూ. 17,368 కోట్ల వ్యయంతో పూర్తిచేస్తామని ఆ పత్రంలో చెప్పుకొచ్చారు. ఆచరణలో జరిగిందేమిటి? పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను బెదిరించి వెళ్లగొట్టారు. బెదరకపోతే 60సీ నిబంధన పేరుతో వేటు వేశారు. ఆ తర్వాత 'నిధుల పారుదల' యజ్ఞం ప్రారంభమైంది. ఒక్కో ప్రాజెక్టుకూ, ఒక్కో ప్యాకేజీకి అంచనా వ్యయాన్ని ఇష్టారీతిన పెంచుకుంటూ.. పెంచుకుంటూ, లంకా దహనం కోసం హనుమంతుడు తన తోకను పెంచిన రికార్డును బద్దలుకొడుతూ రూ.96 వేల కోట్లకు చేర్చారు. ఎక్కడి 17 వేల కోట్లు? ఎక్కడి 96 వేల కోట్లు? ఇంచుమించు 550 శాతం. అందులో ఎంత డబ్బు దారిమళ్లి కేరాఫ్ అడ్రస్‌కు చేరుకున్నది? ఎవడబ్బ సొమ్ము అది? ఎక్కడ మూలుగుతున్నది? ఏ దూర తీరాలకు చేరు కున్నది? కనిపెట్టవలసిన అవసరం లేదా? ఒక చెట్టు నాటిందీ లేదు, నీటిగుంట తీసిందీ లేదు. కానీ, నీరు – చెట్టు పేరుతో ఖర్చుచేసిన రూ.17 వేల కోట్ల ప్రజాధనాన్ని మెక్కిన పందికొక్కులెక్కడివో ఆరా తీయవలసిన అవసరం లేదా? మన సొంతింటిని ఎంత బాగా కట్టుకున్నా చదరపు అడుగుకు రూ. రెండువేలు దాటదు. కానీ రాజధాని పనుల్లో తాత్కాలిక అవసరం కోసమే నిర్మించిన సచివాలయం పనులకు చదరపు అడుగుకు రూ. 12 వేలను కాంట్రాక్టర్‌కు సమర్పించారు. ప్రజాధనంపై బాధ్యత గలవారు అలా చేయగలరా? రాజధాని ప్రాంతంలో తెల్ల రేషన్‌కార్డుదారుల పేరుతో కొనుగోలు చేసిన నాలుగువేల ఎకరాలకు వెచ్చించిన వేల కోట్ల రూపాయలు ఎక్కడివి? ఇసుకను తవ్వేసుకొని, ఎర్రమట్టి అమ్మేసుకొని పోగేసిన డబ్బంతా ఏ ఖాతాలోకి ప్రవేశించింది? విశాఖ భూ కుంభకోణంలో మిగిలింది ఎంత? కార్పొరేట్ సంస్థలకు భూసంతర్పణ ఫలితంగా దక్కిన ముడుపుల విలువెంత? దేవాలయ భూముల్లో దోచేసిందెంత? విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో దండుకున్న సొమ్ము కిమ్మత్తేమిటి? అది ఎక్కడుంది? చెప్పుకుంటూ పోతే ఒక అంతులేని దోపిడీ కథ ఇది. ఈ దోపిడీపై నాటి ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక పుస్తకాన్నే ముద్రించవలసి వచ్చింది. ఆ లెక్కలన్నీ తేల్చవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది.

సరిగ్గా పాతిక సంవత్సరాల కిందట రాష్ట్ర రాజకీయాల్లో ఒక వ్యక్తి కీలక పాత్రధారిగా చక్రం తిప్పడం మొదలుపెట్టారు. ఆనాటి నుంచే రాజకీయాల్లో విలువలు దిగజారడం ప్రారంభమైంది. రాజకీయాన్ని వ్యాపారంగా మార్చేశారు. ఎన్నికలు ఖరీదైన వ్యవహారంగా మారడం మొదలైంది. సంఘసేవకులు రాజకీయ సన్యాసం స్వీకరించి కాంట్రాక్టర్లు, బ్రోకర్లు, వ్యాపారులు రాజకీయ నాయకుల అవతారం ఎత్తడం ప్రారంభించారు. రాజకీయ నాయకులు–మీడియా–కార్పొరేట్ సంస్థల అపవిత్ర కూటమి ఏర్పడింది. ప్రజా సమస్యలు పక్కదోవ పట్టాయి. ప్రపంచబ్యాంకు ప్రబోధమే వేదవాక్కుగా మారింది. వ్యవసాయం దండగైంది. వేలాదిమంది రైతుల ఆత్మహత్యల పరంపర మొదలైంది. కులవృత్తులు కుప్పకూలి జనం వలసబాట పట్టారు. పల్లెలు కన్నీరు పెట్టాయి. అవినీతి తాండవమాడింది. పేద–ధనిక అంతరాలు ప్రమాదకరస్థాయిలో పెరిగిపోయాయి. గనులూ, వనులూ, చేలు చెరువులు, కొండలు, గుట్టలు సహా ప్రకృతి వనరులన్నీ దురాక్రమణల పాలయ్యాయి. ఆఖరి ఐదు సంవత్సరాల అధ్యాయం విధ్వంస పాలనకు విశ్వరూపంగా నిలిచింది. అవినీతి రోతపుట్టించే స్థితికి చేరింది. ఇక దోషిని బోనెక్కించక తప్పని పరిస్థితులు కమ్ముకొస్తున్నాయి. యముని మహిషపు లోహఘంటలు మబ్బు చాటున ఖణేల్‌మన్నాయి.

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### నకిలీ



"బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొనే జేఎన్‌యూను సందర్శించిన తరువాత చపాక్ సినిమాపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన వాటిల్లో సుమారు 80 ట్విట్టర్ ఖాతాలు ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్నవే కావడం ఆందోళనకరమని ఆల్ట్ న్యూస్ విశ్లేషించింది. కొంతకాలంగా నేను దీని గురించి చెబుతూనే ఉన్నా. ప్రధాని మోదీ అనుసరిస్తున్న వాటిల్లో చాలా ఖాతాలు నకిలీ వార్తలను వ్యాప్తి చేస్తున్నాయి. దీనివల్ల జరిగే నష్టాన్ని ప్రధానమంత్రి కార్యాలయంలోని సామాజిక మాధ్యమ పర్యవేక్షకులు గుర్తించాలి. లేక ఒకవేళ వారి ఆలోచనా విధానమే ఇదా?"

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

### వినతి



"మానవతావాదులందరికీ ఒక వినతి. ముస్లింలు, సిక్కులు, దళితులు, క్రైస్తవులతో సహా మైనారిటీలు ఎవరికీ నిరసనలో వారి భాష ఎలా ఉండాలో ఉపదేశాలు ఇవ్వకండి. వాళ్లు ఎలాంటి దుస్తులు ధరించాలో చెప్పకండి, మతతత్వంలోని విభిన్న కోణాలు, మత విద్వేషాన్ని వారు అర్థం చేసుకోవాల్సిన తీరు గురించి బోధించకండి"

– రాణా అయూబ్, జర్నలిస్ట్

### అబద్ధం



"కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆహ్వానాన్ని మన్నించి షహీన్ బాగ్ నిరసనకారులు ఆయనను కలువబోతున్నారన్న వార్తలలో నిజం లేదు. వ్యక్తిగత స్థాయిలో ఎవరైనా ఆయనను కలిసే అవకాశముందని, నిరసనకారులతో వారికి సంబంధం ఉండాల్సిన అవసరం లేదని వారు అన్నారు "

– జాఫర్ అబ్బాస్, జర్నలిస్ట్

### మొదటి



"తానే మొదటి స్థానంలో ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకుంటున్నారు. ఆయనను నిరుత్సాహపరుస్తున్నందుకు మన్నించాలి. ఫేస్‌బుక్‌లో 4 కోట్ల 40లక్షల మంది అనుయాయులతో ప్రధాని నరేంద్ర మోదీ మొదటి స్థానంలో ఉన్నారు. 2 కోట్ల 50 లక్షల మంది అనుయాయులతో ట్రంప్ రెండో స్థానంలో ఉన్నారు"

– సధావి ఖోస్లా, రచయిత్రి

### 13 ఏళ్లు



"నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా సుమారు 13 ఏళ్లు పాలించారు. ఇప్పటికీ గుజరాత్ మోడల్ అని డబ్బా కొట్టుకుంటూ ఉంటారు. కానీ, ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటనకు వస్తుంటే మురికివాడలు కనిపించకుండా అహ్మదాబాద్‌లో గోడ నిర్మిస్తున్నారు. గుజరాత్ మోడల్ అంత గొప్పదయితే, దాన్ని దాచడం ఎందుకో?"

– ప్రజ్వల్ కుట్టప్ప, కాంగ్రెస్ నేత

### కాంగ్రెస్



"ఢిల్లీ మెట్రోను నిర్మించినది కాంగ్రెస్ పార్టీయేగానీ; ఆమ్ ఆద్మీ పార్టీ, భారతీయ జనతా పార్టీ ఎంత మాత్రం కాదు. అదే విధంగా సీఎన్‌జీ బస్సులను కొనుగోలు చేసినది కూడా కాంగ్రెస్సే. ఆప్, బీజేపీ పార్టీలు కాదని మర్చిపోరాదు"

– భవిక కపూర్, కార్యకర్త

## టారిఫ్ యుద్ధం

తమ దేశానికి దిగుమతయ్యే సరుకులపై అధిక టారిఫ్‌లు విధించి వేరే దేశాలను హడలెత్తించే ప్రయత్నం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు స్వదేశంలో చుక్కెదురయింది. ఇంత వరకూ చేసింది చాలుగానీ... దీన్ని కొనసాగించి మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని అక్కడి పారిశ్రామిక సంఘాల కూటమి కోరుతోంది. ఈమధ్యే అమెరికా–చైనాల మధ్య ఒప్పందం కుదిరి చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను అమెరికా 15 శాతం నుంచి 7.5శాతానికి తగ్గించింది. దాంతో దాదాపు 1,200 కోట్ల డాలర్ల మేర తగ్గింది. చైనా సైతం అదనపు టారిఫ్‌లలో సగానికి కోత విధించి అమెరికా ఉత్పత్తులపై 7,500 కోట్ల డాలర్ల మేర తగ్గిస్తామని ప్రకటించింది. ఇలా సుఖాంతం కావడం బాగుందని, ఇక్కడితో వాణిజ్య యుద్ధం చాలించడం మంచిదని ఆ కూటమి తెలిపింది. ఇకపై అదనపు టారిఫ్‌లు పూర్తిగా తొలగించేందుకు కృషి చేయాలని కోరింది. ట్రంప్ విధానాల వల్ల ధరలు పెరిగి అమెరికా ఆర్థిక వ్యవస్థ దెబ్బ తిన్నదని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ కూటమిలో 150కి పైగా పారిశ్రామిక సంఘాలున్నాయి. 2018 ఫిబ్రవరి నుంచి గత డిసెంబర్ వరకూ అమెరికన్లు కొత్త టారిఫ్‌ల కారణంగా 5,000 కోట్ల డాలర్లు అదనంగా చెల్లించాల్సి వచ్చింది.

# మొక్కలమౌదాం... పదండి

సందర్భం



జూలూరు గౌరీశంకర్

మనందరం మొక్కలమౌదాం పదండి. మనందరం మల్లెమొగ్గలమౌదాం. మనందరం చామంతి పువ్వులమవుదాం పదండి. మనందరం చిన్న మొక్కలం, మొలకలం, చిన్నచిన్న చెలకలం, రేపటికి పగిలిన విత్తనమై మొలవటం, మనం పెరిగి పెరిగి చిన్నచిన్న మొదళ్లుగా మొదలు కావటం, పెరగటం, కొమ్మలుగా, రెమ్మలుగా, శాఖోపశాఖలుగా విస్తరించటం, ఒక ఫలవృక్షం కావటం, ఒక నీడనిచ్చే చెట్టు కావటం, బాటెంట నడిచే బాటసారులకు అలసట తీర్చే సేదనిచ్చే ఒక ఇల్లుగా మారటం, ఎగిరే పక్షుల గుంపులకు మనందరం విశాలమైన మొక్కల మంచాలమై తలుపులు తెరవటం ఎంత బాగుంటుంది! చిలుకలు చెక్కిన కాయలు రాలిపడుతున్న ఒక మహత్తర దృశ్యాలకు మనందరం సాక్షీభూతాలంకదా! వూళ్లలో చింత చెట్ల చిగురుకొమ్మలపై చింత చిగురులు మనం మారగలిగే రూపం కావటం ఎంత అదృష్టం. మనం చూస్తుండగానే ఒక పంటనిచ్చే పసిడి పంటలుగా రైతులు మారుతూకదా వాళ్ళ కాలాలను బతికిస్తుంది. పెద్దలందరూ పిల్లలుగా మారే స్థితి మళ్ళీ పెద్దలు పిల్లలై, పిల్లలు తిరిగి పెద్దలై... అనుబంధాల ముల్లెలై ... జీవనగమాల్ని, కాలాల్ని, లోకాల్ని చిన్నచిన్న మొక్కలు చేసి ఆడించగల, పాడించగల, నడిపించగల, పసిమొగ్గల నవ్వులు పూయించగలిగింది, మనుషులందరూ తిరిగి మొక్కలైనప్పుడేననుకుంటా! అందుకే మనందరం మొక్కలమౌదాం పదండి. మనలను మనం శపించుకుని ఒక జాతి జీవనాడులకు, రేపటిచరిత్రకు పచ్చటి బతుకుల భరోసానందించేందుకు మొక్కలమౌదాం పదండి.

చిన్నప్పుడు నాకు బాగాగుర్తు. 'అశోకుడు చెట్లు నాటించెను' అన్న వాక్యాన్ని ఎందుకో ఇష్టమై మొదట మర్చిపోతానేమోననుకుని బట్టీపట్టా! తరగతిగదిలో సారు పాఠం చెబుతుంటే అశోకుని రాజ్యంలో చెట్లు నాటించడం, ఒక హరితవనాన్ని, ఒక పచ్చటి పచ్చికబయళ్ల దగ్గరకు తీసుకుపోయినట్లయ్యింది. ఆ చరిత్ర పాఠం చెప్పి మా తరాల్ని, తరతరాల్ని పులకింపజేసిన సార్లంతా ఈ కాలాలకు, సమాజాలకు ఎప్పటికీ నీడనిచ్చే మహావృక్షాలే. నిజంగా తరగతి గదుల్లో చెబుతున్న పాఠాలన్నింటినీ ఆచరణ రూపాలు చేసుకుంటూపోతే ఎంతో బాగుంటుంది ఆ దృశ్యం. ఆ పాఠం శరీరంలోకి రక్తంలాగా ఎక్కిన తర్వాత పరుగు పరుగున, చెంగు చెంగున గంతులు వేసుకుంటూ ఇంటికి పోయి అమ్మకు నాయినకు ఇంట్లో అందరికీ సారు చెప్పిన పాఠం చెబితే ఇల్లంతా పరవశించింది. నిజంగా అది ఉత్తపాఠం కాదు అది ఒక కాలాన్ని నడిపించే మహత్తర మంత్ర దండం అనిపించింది. అశోకుడి పాఠాన్ని సారు చెప్పినట్లు పరీక్షల్లో కూడా అందంగా రాశా, నాకు మార్కులు బాగొచ్చినయ్, పరీక్షల్లో మంచి మార్కులు వచ్చి ఉత్తీర్ణుడినయ్యా! ఇగో... ఇక్కడే జీవితం మలుపు తిరిగేది పరీక్షల్లో పాసయ్యా కానీ జీవితంలో పాస్‌కావటానికి మళ్ళీ నేను కూడా ఒక మొక్క కావాలి కదా! అవును ఆ పాఠం చదివిన పిల్లలంతా ఒక్కొక్కరూ ఒక మొక్క నాటితే అవి ఇప్పుడు ఎన్నెన్ని మహావృక్షాలయ్యేవి. అవి ఒక కాలానికి నీడనిచ్చే మహావృక్షాలయ్యేవి కదా! అవును కాలం పాఠం దగ్గరే ఆగకూడదు అది ఆచరణగా మారాలి అప్పుడది జీవితం అవుతుంది. అప్పుడది సమాజమవుతుంది. కానీ కాలం మాత్రం మళ్ళీ మొక్కలు నాటించి ఈ నేల భూతాపం తీర్చే అశోకుల కోసం ఎదురుచూస్తుంది.

నాకెందుకో.. ఎవరి పుట్టినరోజును వాళ్లు సంతోషంగా అమ్మ వొండిపెట్టే పరమాన్నం తిని ఆనందించటం గొప్ప. దాంతోపాటు పదిమందికి ఉపయోగపడే సాయం చేసే ఒక చిన్నపని అయినా ఆ రోజు చేస్తే మరింత బాగుంటది. గత మూడు సంవత్సరాల క్రితం కేటీఆర్ ఒక ప్రకటన చేశారు. నాకది బాగా నచ్చింది. నాకే కాదు ఆలోచనాపరులందర్నీ ఆయన ప్రకటన ఆకర్షించింది. నా బర్త్‌డే పేర్లతో బజార్లలో ఫ్లెక్సీలు కట్టవద్దని, పత్రికలలో ప్రకటనలు చేయవద్దని చెప్పారు. నాకెందుకో ఆ ప్రకటన హుందాగా అనిపించింది. మంచిగా అనిపించింది. ఆ ప్రకటన వెనుక ఉన్న అర్థం ఏమిటంటే పుట్టినరోజుల్ని ఇతరులకు సాయం చేసే రోజులుగా మార్చండి అన్న సందేశం ఉంది. ఫిబ్రవరి 17న కేసీఆర్ బర్త్‌డే. ఆ రోజును మొక్కలు నాటే రోజుగా మార్చుతూ 60 లక్షలమంది టీఆర్‌ఎస్ కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునివ్వటం ఒక మంచి పరిణామం. కేటీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో కేసీఆర్ అభిమానులంతా మొక్కలు నాటే కార్యక్రమం చేపడితే అది భవిష్యత్తుకు మంచి సందేశాన్నిచ్చినట్లవుతుంది. తెలంగాణ రాష్ట్రంకోసం మృత్యువు ముఖ ద్వారం దాకాపోయి వచ్చిన కేసీఆర్ పుట్టిన రోజు నాడు ప్రతివ్యక్తి ఒక మొక్కనాటితే అది సమాజానికి మంచి అవుతుంది. 1 నుంచి 10 తరగతుల వరకు చదువుకునే బడి పిల్లలు 60 లక్షల మంది వరకు ఉన్నారు. తరగతి గదినుంచే పచ్చటి ప్రపంచం రూపుదాల్చటానికి కృషి మొదలుకావాలి. ఒక్కసారి గురుకులాలు కదిలితే అందులోనున్న నాలుగున్నర లక్షలమంది విద్యార్థులు వాళ్ళ పరిసర ప్రాంతాలను మొక్కల క్షేత్రాలుగా మార్చగలరు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు దండు కదిలితే మొత్తం సమాజానికి ఒక సందేశంగా మారుతుంది ''ఈచ్‌వన్ టీచ్‌వన్, ప్లాంట్‌వన్'' అన్నది తెలంగాణ నినాదంగా మారుమ్రోగాలి. మొక్కలు పెరగాలి, అవి ఫలాలనివ్వాలి. మొక్కలు నాటాలి, అవి మహావృక్షాలు కావాలి. సంపద పెంచాలి, అది అందరకూ పంచాలి.

(ఫిబ్రవరి 17న తెలంగాణ సీఎం కేసీఆర్ జన్మదినం)

వ్యాసకర్త కవి, రచయిత । 94401 69896

## ప్రేమికులకు నో

రోజులాగే ఉదయం వాకింగ్ కోసం ఇందిరా పార్కులోకి వెళ్లబోతే గేట్లు మూసేసి వున్నవి. ఏమి సంగతి అని అడిగితే 'గదేదో రోజం టగా సార్' అని వాచ్‌మన్ అన్నాడు. సహ పాదచారులు మరో నలుగురం చేరేసరికి పోలీసులు వచ్చి 'ఇయాల వాలెంటైన్స్ డే కదా, అందుకే గేట్లు మూయించాం' అన్నారు. రోజూ పార్కులో నడిచే వాళ్లం, మమ్మల్నెందుకు పోనివ్వరు అంటే... గేటు తెరిస్తే లవర్స్ లోపలికి చేరతారు, వారితోపాటు బజరంగ్‌దళ్, బీజేపీ వాళ్లొస్తారు, గొడవలు అవుతవి అని వాపోయారు. ఛాందసవాదుల ఆగడాలను అరికట్టలేక ప్రేమికులను కలుసుకోనివ్వకపోవడం అన్యాయం కాదా? యుక్త వయస్కులు ప్రేమించుకోవడం సహజం. ప్రేమను వ్యక్తం చేసుకోవడానికి వాలెంటైన్స్ డే నాడు కలుసుకుంటే తప్పేముంది? భారతీయ సమాజంలో ప్రేమలు, పెళ్లిళ్లకు సుసంపన్నమైన వారసత్వం వుంది. రాధాకృష్ణుల ప్రేమ ఆదర్శాన్ని పెద్దలు కీర్తిస్తుంటారు. శకుంతల దుష్యంతుల ప్రేమ ఫలితమైన భరతుని వారసులమని చెప్పుకునేవారు. నేటి యువ ప్రేమికులను దోషులుగా చూడడం తప్పు. సంస్కృతి పేరుతో మతోన్మాదులతో పాటు ప్రభుత్వం కూడా ప్రేమికుల పట్ల శత్రువుల్లా వ్యవహరించడం సరైంది కాదు. కాకపోతే ప్రేమ మోజుతో జీవితం వృథా కాకుండా, ముఖ్యంగా అమ్మాయిలు అన్యాయం కాకుండా, సరైన చైతన్యం కల్పించడం చాలా అవసరం.

నాగటి నారాయణ, సామాజిక విద్యావేత్త

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899




అమ్మాయి కాఫీ ఇచ్చింది. అబ్బాయి కాఫీ తాగాడు.
కాఫీ ఇస్తున్నప్పుడు.. అమ్మాయి అబ్బాయిని చూళ్లేదు!
కాఫీ తాగుతున్నప్పుడైనా.. అబ్బాయి అమ్మాయిని చూళ్లేదు! ఇంకేం కలుస్తాయి చూపులు!
చూపులు కలవలేదు కానీ... కాఫీ కలుపుతున్నప్పుడు అమృత ఘడియలేవో ఉన్నట్లున్నాయి.
నలభై ఏళ్లయింది చిరంజీవి, సురేఖల పెళ్లయి. కలవని ఆ కాఫీ చూపులే.. వీళ్ల పెళ్లికి శుభలేఖలు.

# చూపులు కలవని శుభవేళ

సాక్షి ఎక్స్‌క్లూజివ్

**■ మీ 'శుభలేఖ రాసుకున్న ఎదలో..' పాట సూపర్ హిట్. మరి.. రియల్ లైఫ్‌లో శుభలేఖ రాసుకున్న విశేషాల గురించి?**

**చిరంజీవి:** నాకు నేనుగా బలి పశువును అయిన రోజు గురించేగా (నవ్వుతూ). ఓ సాయంత్రం నేను చెన్నై కోడంబాకం బ్రిడ్జ్ మీద నా కారులో వెళుతుంటే, నా బి.కామ్ క్లాస్‌మేట్ సత్యనారాయణ కనిపించాడు. ఇక్కడ ఉన్నావేంటి? అని అడిగితే, మా పెదనాన్నగారింటికి వచ్చాను అన్నాడు. నా కారులో దింపేస్తాను రమ్మన్నాను. వాళ్ల పెదనాన్న ఎవరో కాదు... అల్లు రామలింగయ్యగారు. అప్పటికే నేను నటించిన ఓ మూడు సినిమాలు విడుదలయ్యాయి. 'రామలింగయ్యగారు నీతో పాటు 'మనవూరి పాండవులు'లో యాక్ట్ చేశారుగా.. ఇంట్లోకి రా' అన్నాడు. అయితే రామలింగయ్యగారు లేరు. కాఫీ తాగి వెళుదువు గాని అన్నాడు. అదే నేను లాక్ అయిన మొదటి స్టెప్.

**■ ఎలా లాక్ అయ్యారు?**

**చిరంజీవి:** ఆ కాఫీ పెట్టింది సురేఖ. తను నన్ను చూళ్లేదు, నేను తనని చూళ్లేదు (భార్యని చూస్తూ.. 'ఆ కాఫీలో ఏం వశీకరణ మంత్రం కలిపావు'). ఆ తర్వాత ఆ అబ్బాయి ఎవరు? అని తను అతన్ని అడిగితే 'మా క్లాస్‌మేట్. 'మనవూరి పాండవులు' లో నటించాడు' అని చెప్పాడు. 'వాళ్లు ఏమిట్లట. మనిట్లేనట' (ఇద్దరూ పెద్దగా నవ్వుతూ) అంది. తర్వాత అల్లు అరవింద్ గారు, ఇతర కుటుంబ సభ్యులు నా గురించి డిస్కషన్ మొదలుపెట్టారు. అల్లు రామలింగయ్యగారికేమో వాళ్లమ్మాయిని ఓ ఐ.ఏ.ఎస్ ఆఫీసర్‌కిచ్చి చెయ్యాలనుండేది. కానీ, ఎందుకు ప్రయత్నం చేయకూడదని అరవింద్‌గారు నా గురించి ఎంక్వయిరీ ప్రారంభించారు. 'తను ఆంజనేయస్వామి భక్తుడు, బ్యాడ్ హ్యాబిట్స్ లేవు, బాగా చదువుకున్నాడు, చాలా కష్టపడతాడు. అతని చేతిలో మంచి సినిమాలు కూడా ఉన్నాయి' అని నా గురించి గుడ్ సర్టిఫికెట్ ఇచ్చాడు నా ఫ్రెండ్. నాకు ఇప్పుడు పెళ్లేంటి? అన్నాను నేను. మేకప్‌మేన్ జయకృష్ణ 'మన వూరి పాండవులు' నిర్మాత. రామలింగయ్యగారి ఫ్యామిలీకి చాలా దగ్గరివారు. ఆయన రామలింగయ్యగారిని కన్విన్స్ చేశారు. ఒకే అనడానికి ముందు ఓ పదిమంది నిర్మాతలను నా గురించి అడిగి సలహా తీసుకున్నారట రామలింగయ్యగారు. అందరూ నా గురించి మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. దాంతో నన్ను లాగి బుట్టలో పడేశారు. నాది పెళ్లి వయసు కాదని కరాఖండీగా చెప్పాను. కానీ, జయకృష్ణగారు మా నాన్నగారితో 'అబ్బాయి వేరే ఆకర్షణలకి లోనవుతాడేమో' అని చెప్పారేమో నాన్న భయపడిపోయి 'నేను అబ్బాయిని ఒప్పిస్తా' అన్నారు. పెళ్లి చూపులకు రానన్నాను. బలవంతంగా తీసుకెళ్లారు.

**■ సురేఖగారూ.. మీ నాన్న చెప్పారని మీరు చిరంజీవిగారిని పెళ్లి చేసుకున్నారా?**

**సురేఖ:** 'మన వూరి పాండవులు' చూసి 'ఈ కళ్లబ్బాయి ఎవరో బావున్నాడు' అనుకున్నాను. కళ్లు పెద్దగా, గుండ్రంగా ఉంటాయి కదా. మా అమ్మ యాక్టర్‌ను చేసుకుంది. నేనూ యాక్టర్‌ను చేసుకుంటే బాగుంటుందనుకున్నా. అందుకే సరే అన్నాను.

**■ మీ 'అందరివాడు' సినిమాలో పెళ్లిచూపుల సీన్ చాలా బావుంటుంది. మీ పెళ్లి చూపుల సీన్?**

**చిరంజీవి:** మమ్మల్ని మాట్లాడుకోమని పెద్దవాళ్లందరూ బయటకు వెళ్లారు. తను బీఏ చదువుకుందని తెలిసినా ఏదో ఒకటి మాట్లాడాలి కదా అని ఏం చదువుకున్నారు? అని అడిగాను. ఆ తర్వాత ఏం మాట్లాడాలో తెలియలేదు. అంతకుముందు నాకు అమ్మాయిలతో పెద్దగా పరిచయాలు కూడా లేవు. సురేఖ పొందిక చూసి 'ఈ అమ్మాయినే చేసుకోవాలి' అనుకున్నాను. మా అమ్మకి కూడా తను నచ్చింది. నాన్నగారైతే 'ఏం కళరా ఆ అమ్మాయిది. పెళ్లి చేసుకో' అన్నారు.

**సురేఖ:** మామయ్యగారు చనిపోయేంతవరకు నన్నెప్పుడూ పేరు పెట్టి పిలవలేదు. 'అమ్మా' అనేవారు. నన్ను ఒక్క మాట కూడా పడనిచ్చేవారు కాదు. అంత బాగా చూసేవారు.

**■ అవునూ... మీ పెళ్లి చూపులకు, పెళ్లికి ఎంత గ్యాప్ వచ్చింది?**

**సురేఖ:** మూడు నెలలు.

**■ ఆ మూడు నెలల్లో కలుసుకున్నారా? ఫోన్లు మాట్లాడుకోవడం?**

**చిరంజీవి:** పెళ్లి కాకముందు మాట్లాడటం, తిరగటం తప్పని మనసులో పడిపోయింది. తనదీ అలాంటి ఫీలింగే. అయితే ఒకసారి మాట్లాడాలనిపించింది. అప్పుడు ల్యాండ్ ఫోన్లే కదా. ఫోన్ చేస్తే తనే తీసింది. 'హలో.. నేను చిరంజీవి' అన్నాను. 'నేను సురేఖనండీ. ఫోన్ ఎవరికివ్వమంటారు' అంది. అంతే... నాతో కనీసం రెండు మాటలు కూడా మాట్లాడకుండా ఎవరికివ్వమంటారు అందని నా అహం దెబ్బతింది. 'మీ అన్నయ్య ఉన్నాడా' అన్నాను. 'లేరండీ' అంది. 'వచ్చాక నేను ఫోన్ చేశానని చెప్పు' అని పెట్టేశాను.

**సురేఖ:** అప్పుడప్పుడూ అన్నయ్యతో పెళ్లి తేదీ గురించి మాట్లాడేవాళ్లు. అందుకని అన్నయ్యతో మాట్లాడటం కోసమే ఫోన్ చేశారనుకున్నాను. నా గురించి చేశారనుకోలేదు (నవ్వుతూ).

**■ సరే.. హనీమూన్ విశేషాలు?**

**చిరంజీవి:** హనీమూన్ పక్కన పెట్టండి. పెళ్లికే టైమ్ దొరకలేదు. పెళ్లికి ఫ్రిబ్రవరిలో మంచి ముహూర్తాలున్నాయంటే సరే అనుకున్నాం. అప్పుడు 'తాతయ్య ప్రేమ లీలలు' అనే సినిమా చేస్తున్నాను. ఆ చిత్రానికి యం.ఎస్ రెడ్డిగారు నిర్మాత. అందులో నూతన్‌ప్రసాద్ కాంబినేషన్‌లో నా సీన్లు ఉన్నాయి. 'ఆయన చాలా బిజీ ఆర్టిస్ట్, డేట్స్ దొరకవు.. మీరు మే నెలలో పెళ్లి చేసుకోండి' అని రెడ్డిగారు అన్నారు. 'మీరు ఓకే అంటే ఫ్రిబ్రవరిలో, లేదంటే తర్వాత చేసుకుంటాను' అన్నాను. అరవింద్ ఏమో 'ఓ మూడు రోజులు ఇవ్వండి' అని పట్టుబట్టాడు. నా సినిమా టైమ్‌లో మా హీరో పెళ్లి చేసుకున్నాడులే అనుకొని ఏ నిర్మాత అయినా ఆనందంగా ఒప్పుకుంటారు. కానీ, రెడ్డిగారు ఒప్పుకోలేదు. అప్పుడు అల్లు అరవింద్ 'మీ డేట్లు మళ్లీ మీకు ఇప్పిస్తాను. కాంబినేషన్ గురించి మీకేం భయం లేదు. నేనూ ఇండస్ట్రీలోనే ఉన్నాను కదా. మేం చిరంజీవిని తీసుకెళ్లిపోతున్నాం' అన్నారు. అలా అనుకున్న ముహూర్తానికే పెళ్లయింది.


అల్లు రామలింగయ్యతో చిరంజీవి, సురేఖ

**■ మీరు కట్టుకునే చీరలు బాగుంటాయి. మీవారు కాంప్లిమెంట్స్ ఇస్తుంటారా?**

**సురేఖ:** థ్యాంక్యూ. నాకు అప్‌డేటెడ్‌గా ఉండటం ఇష్టం. దానికి కారణం చిరంజీవిగారే. ఆయనకు ఫ్యాషన్ గురించి, కలర్స్ గురించి చాలా అవగాహన ఉంది. ఇంకో విషయం ఏంటంటే.. ఆయన చీర చూడగానే రేటు చెప్పేస్తారు. అది ఏ చీర అయినా కానివ్వండి.. బట్టల గురించి అంత ఐడియా ఉంది. నేను కట్టే చీరలు బాగుంటాయని అందరూ అంటుంటే బాగానే ఉంటుంది. కానీ అదే విషయాన్ని ఆయన నోటి నుంచి వింటే ఆ ఆనందమే వేరు. అంతేకదా.. మనం శ్రద్ధగా డ్రెస్ చేసుకున్నప్పుడు భర్త నుంచి ఓ చిన్ని కాంప్లిమెంట్ వస్తే ఆ ఫీలింగే స్పెషల్. ఆ విషయంలో ఆయన హండ్రెడ్ పర్సంట్ బెస్ట్. అన్నీ పట్టించుకుంటారు. కాంప్లిమెంట్స్ ఇస్తారు.

**■ సో.. మీ కళ్లబ్బాయి పక్కా ఫ్యామిలీ మ్యాన్ అన్నమాట?**

**సురేఖ:** డౌట్ ఏముంది? హండ్రెడ్ పర్సంట్ పక్కా ఫ్యామిలీ మ్యాన్.

**■ మరి పెళ్లి బట్టల షాపింగ్‌కి టైమ్ దొరికిందా?**

**చిరంజీవి:** పెళ్లి పీటల మీద కూర్చున్నప్పుడు చొక్కా చిరిగిపోయింది. సురేఖ మార్చుకోమంటే 'ఏం.. బట్టలు చిరిగితే తాళి కట్టలేనా' అని, అలాగే కట్టేశాను. అయితే అప్పటికే నాకు ఏడెనిమిది పెళ్లిళ్లు చేసుకున్న అనుభవం ఉంది (ఇద్దరూ పెద్దగా నవ్వుతూ). అంటే సినిమాల్లో..

**■ పెళ్లయ్యే నాటికే మీకు వంట వచ్చా?**

**సురేఖ:** రాదండీ. ఒకరోజు ఉప్మా చేస్తే ఉండలు, ఉండలుగా వచ్చింది. అప్పుడు ఆయనే ఉప్మా చేయడం నేర్పించారు. ఆయన మేనత్త, అమ్మమ్మ మాతోనే ఉండేవారు. వాళ్లు వండేవారు.

**■ భర్త మేనత్త, అమ్మమ్మ, అమ్మానాన్న, తమ్ముళ్లు (నాగబాబు, పవన్ కల్యాణ్) ఇంతమందితో ఉండాలంటే ప్రైవసీ ఉండదేమో అనిపించిందా?**

**సురేఖ:** మా ఇంట్లో ఎప్పుడూ చుట్టాలుండేవారు. అదే సందడి ఈ ఇంట్లోనూ ఉండేది. లేకపోతే ఒంటరితనం అనిపించేది. ఈయన ఉండేవారు కాదు. అందరూ కలిసి ఉండటంతో నాకు సెక్యూరిటీ ఉండేది. వాళ్లే వంటలు చేసి, నాకు, ఆయనకి, అందరికీ పెట్టేవారు. పిల్లలందరూ ఉండటంతో బావుండేది.

**చిరంజీవి:** సురేఖ తమ్ముడు ఉండేవారు. అతను చనిపోయారు. నా తమ్ముళ్లిద్దరిదీ వాళ్ల తమ్ముడి వయసు. వీళ్ల మీద సురేఖకు ఆ ఎఫెక్షన్ ఉండటానికి కారణం అదే. మనం ఎలా ఉంటే అవతలి వాళ్లు మనతో అలా ఉంటారు. సురేఖ అందరితో బాగుంటుంది.

**సురేఖ:** వాళ్లు కూడా చాలా బాగుంటారు. ఏ రిలేషనయినా రెండువైపులా ఉండాలి. ఈయన లేకపోయినా కల్యాణ్ (పవన్ కల్యాణ్) ఎప్పుడూ పిల్లలతో ఉండేవాడు. బాగా సరదాగా ఉండేవాడు. అందుకే కల్యాణ్ పిల్లలతోపాటు పెరిగాడు, పిల్లలు కల్యాణ్‌తో పాటు పెరిగారు అంటాం. కల్యాణ్‌తో పాటు, వీళ్ల చెల్లెలు మాతోపాటు ఉండి చదువుకుంది.



**■ 30 ఏళ్లు నటించి ఓ పదేళ్లు పాలిటిక్స్‌కి దగ్గరగా ఉండటంవల్ల సినిమాలకు దూరమయ్యారు. ఆ గ్యాప్ గురించి?**

**సురేఖ:** అప్పుడు పీస్‌ఫుల్‌గా ఉండేవారు కాదు. మాకూ అలానే ఉండేది. ఆయనకి మేకప్ వేసుకోగానే హుషారు వస్తుంది.

**చిరంజీవి:** పనులన్నీ ముగించుకుని ఇంటికొచ్చాక కూడా మరుసటి రోజు ఏం మాట్లాడాలి? అనేదాని చుట్టూనే ఆలోచనలు ఉండేవి. 'సినిమాలు చేయడం మొదలుపెట్టాక మళ్లీ మిమ్మల్ని మా మనిషిలా చూస్తున్నాం' అంటున్నారు.

**సురేఖ:** ఇప్పుడు ఫుల్ హుషారు. ఉదయం 9కి వెళ్లాలంటే ముందే రెడీ అయి కూర్చుంటారు. షూటింగ్ ఉంటే.. హీ ఈజ్ ఫుల్ యాక్టివ్.

**చిరంజీవి:** 'సైరా' సినిమాకి 4.30కి లేచి వర్కవుట్ చేసుకొని 5.30 గంటలకల్లా రెడీ అయ్యి 6 గంటలకు లొకేషన్‌కి వెళ్లి 7 గంటలకల్లా మేకప్‌తో రెడీగా ఉండేవాణ్ణి. ఇప్పుడు కొరటాల శివతో చేస్తున్న సినిమా షూటింగ్ షార్ప్ 7కల్లా స్టార్ట్ చేస్తున్నాం. జనవరి 2న షూటింగ్ స్టార్ట్ చేశాం. అప్పుడే ఓ సాంగ్, మూడు ఫైట్స్ కంప్లీట్ అయ్యాయి.

**■ త్రీ షిఫ్ట్స్ చేస్తూ షూటింగ్స్‌తో చిరంజీవిగారు బిజీగా ఉండేవారట. పెళ్లయిన కొత్తలో ఆ బిజీని ఎలా తీసుకున్నారు?**

**సురేఖ:** నాన్నగారిని చూస్తూ పెరిగాను కదా. నైట్ షూటింగ్‌లని ఆయన లేటుగా రావటం అన్నీ తెలుసు. మా పెళ్లయిన కొత్తల్లో ఈయన పొద్దున్నే షూటింగ్‌కి వెళ్లి సాయంత్రం 6 గంటలకు వచ్చేవారు. మళ్లీ ఫ్రెష్ అయి నైట్ షూటింగ్‌కి వెళ్లేవారు. 'పున్నమినాగు' షూటింగ్ జరుగుతోంది అప్పుడు. నా లైఫ్ అంతా ఇలానే ఉంటుందని ప్రిపేర్ అయిపోయాను కాబట్టి ఏమీ అనిపించలేదు.

**■ ప్యారిస్‌లో షూటింగ్ జరుగుతున్నప్పుడు మీ పేరు బదులు 'జయ' అని జయప్రదగారి పేరుతో మిమ్మల్ని పిలిచారట?**

**సురేఖ:** ఓ రోజు కాదు, రోజూ జరిగేది. నెలరోజులు జయప్రదతో షూటింగ్ చేస్తే ఆ నెల రోజులూ జయ, జయ అని పిలిచేవారు. మా పెళ్లయిన కొత్తల్లో అప్పటికి నన్ను సురేఖా అని పిలవడానికి అలవాటుపడలేదు. అందుకని ఒక్కోసారి జయ అని పిలిచేవారు. 'ఏమండీ.. నేను రేఖ' అనేదాన్ని. 'ఓ.. సారీ, సారీ రేఖ' అనేవారు.

**చిరంజీవి:** సురేఖలో ఉండే ఆ స్పోర్టివ్‌నెస్ పరాకాష్ట అని చెప్పాలి. మరో గమ్మత్తైన విషయం చెబుతా. మా పెళ్లైన రెండు నెలలకి ప్యారిస్ వెళ్లాం. హోటల్‌లో రూమ్ తీసుకున్నాం. దాని కోసం రిసెప్షన్‌లో ఫామ్స్ అన్నీ కంప్లీట్ చేసి ఇవ్వాలి కదా. అక్కడ అన్నీ ఫిల్ చేస్తూ భార్య అనే చోట ఆగిపోయాను. వెంటనే పేరు గుర్తు రాలేదు (నవ్వులు). 'సురేఖ' అని చెప్పి.. 'అల్లు అని రాసేరు, కొణిదెల అని రాయండి' అంది.

**■ మీరు ఎంతోమంది హీరోయిన్లతో నటించారు. వాళ్లతో సురేఖగారు ఎలా ఉంటారు?**

**చిరంజీవి:** సురేఖ వెరీ ఫ్రెండ్లీ. సుహాసిని, సుమలత, విజయశాంతి, రాధ, రాధిక.. అందరితో ఓ ఫ్యామిలీలా ఉంటుంది. మొన్న నవంబర్‌లో మా 80స్ క్లబ్ (1980లకు చెందిన నటీనటులు) రీయూనియన్ పార్టీ మా ఇంట్లోనే జరిగింది. అన్నీ తనే ఎరేంజ్ చేసింది. వాళ్లందరూ 'ఇంత ఎరేంజ్ చేశారు, మీరూ పార్టీలో ఉండండి' అంటే 'మీరంతా ఫ్రెండ్స్. ఎంజాయ్ చేయండి' అంది.

**సురేఖ:** ఎరేంజ్ చేశాం కదా అని ఫ్రెండ్స్ మధ్యలో దూరిపోకూడదు (నవ్వుతూ).

**■ జనరల్‌గా చిరంజీవిగారి బర్త్‌డే అంటే ఫ్యాన్స్ మరచిపోనివ్వరు. మరి.. మ్యారేజ్ డే, మీ బర్త్‌డేని ఆయన గుర్తు పెట్టుకుంటారా?**

**చిరంజీవి:** గుర్తుండేది కాదు, గుర్తు లేకనే ఈ సంవత్సరం ఫైట్ సీక్వెన్స్ కోసం పోలవరం వెళ్లడానికి రెడీ అయ్యాను. ఈ 18న సురేఖ పుట్టినరోజు. 20న మా పెళ్లిరోజు. అది గుర్తు లేక 16 నుండి పోలవరంలో షూటింగ్ ప్లాన్ చేసుకున్నాం. మా అబ్బాయికి (రామ్‌చరణ్) గుర్తుకొచ్చింది. వాళ్లమ్మ దగ్గరికెళ్లి '18 నీ పుట్టినరోజు, 20 మీ పెళ్లిరోజు, డాడీ షూటింగ్‌కి ఎలా ఒప్పుకున్నారు?' అంటే, 'పోనీలే డాడీకి గుర్తులేదేమో' అందట. 'లేదమ్మా, అది మన షూటింగే కదా, వాళ్లతో మాట్లాడి మారుస్తాను' అని మార్చేశాడు.

**సురేఖ:** మా మ్యారేజ్ డే అయినా, నా బర్త్‌డే అయినా హడావిడి ఏమీ ఉండదు.

**■ గిఫ్ట్‌లు ఇస్తుంటారా?**

**సురేఖ:** రెండేళ్ల క్రితం నా బర్త్‌డేకి వాచ్ ఇచ్చారు. కరెక్ట్‌గా రాత్రి 12 గంటలకు నన్ను నిద్ర లేపి మరీ ఇచ్చారు. ఆ గిఫ్ట్ నాకివ్వటం కోసం ఎంత కష్టపడ్డారో తర్వాత తెలిసి ఆనందపడ్డాను.

**చిరంజీవి:** ఆ బ్రాండ్ వాచ్ ఇక్కడ దొరకలేదు. బెంగళూర్‌లో ఉంది. ఆ కంపెనీవాళ్లను అడిగితే, 'మీరు మా ప్రివిలేజ్డ్ కస్టమర్' అని ఫ్లయిట్‌కి వచ్చి ఇచ్చి వెళ్లారు.

**■ కలిసి షాపింగ్స్‌కి వెళతారా?**

**చిరంజీవి:** షాపింగ్ అంటే ఇద్దరికీ ఇష్టం. ఇక్కడ కష్టం కాబట్టి విదేశాలు వెళ్లినప్పుడు బాగా తిరుగుతాం. లండన్ వెళితే ఓ అపార్ట్‌మెంట్ అద్దెకి తీసుకుని కొన్ని వారాల పాటు అక్కడే ఉంటాం. నాకు, తనకి కుకింగ్ అంటే సరదా. కుక్ చేసుకుని షాపింగ్‌కి వెళ్లిపోతాం.

**■ పండగలు బాగా చేస్తుంటారని విన్నాం. ప్లానింగ్ అంతా సురేఖ గారిదేనా?**

**చిరంజీవి:** నాగబాబు, పవన్‌కల్యాణ్, అల్లు అరవింద్ ఫ్యామిలీ... ఇలా అన్ని క్లోజ్ ఫ్యామిలీలు మొన్న దీపావళి పండగకి కలిశాం. దాదాపు మేమే ఓ వందమంది దాకా ఉంటాం. అందరికీ తనే మెసేజ్ పెడుతుంది. ఆ మెసేజ్‌కే చిన్న పిల్లల దగ్గరనుండి, పెద్దవాళ్లదాకా అందరూ తూచా తప్పకుండా హాజరవుతారు. సంక్రాంతి పండగను మూడు రోజులు చాలా ఘనంగా చేసింది. అప్పుడు పంక్తి భోజనాలు పెట్టి, పెద్ద భోగి మంట ఏర్పాటు చేయించింది. పండగ అనేది వంకే తప్ప, అందరూ కలవాలనుకుంటుంది. అందుకే అందరితోనూ తనకు మంచి బాండింగ్ ఉంటుంది.

**సురేఖ:** ఈయన మొదట్నుంచి వాళ్ల పిల్లలు, వీళ్ల పిల్లలు అని కాదు.. అందరి పిల్లలతో బాగుంటారు. చిన్నప్పుడు అందరి పిల్లలు ఓ పదిహేనుమంది దాకా అయ్యేవారు. అందరినీ షూటింగ్‌లకు తీసుకెళ్లేవారు. మాల్దీవ్స్ వెళ్లినా, స్విస్ వెళ్లినా హాలిడే ఉందంటే చాలు.. అల్లు వెంకటేశ్, బన్నీ, శిరీష్ ఇలా అందరి పిల్లల్ని ఫారిన్ తీసుకెళ్లేవారు.

**చిరంజీవి:** పిల్లలందరికీ వండర్‌ఫుల్ మెమొరీస్ నాతోనే ఉంటాయి. నేనెన్ని చేసినా దాన్ని ఆర్గనైజ్ చేసి, మేనేజ్ చేసేవాళ్లు కావాలి. అది సురేఖ చేస్తుంది.

**■ మీ పెళ్లప్పటికే చిరంజీవిగారు కెరీర్‌వైజ్‌గా మంచి ఫామ్‌లోకొచ్చారు.. ఆ బిజీని ఎలా తీసుకునేవారు?**

**సురేఖ:** ఆయన కనబడటమే అపురూపంగా ఉండేది. ఎప్పుడూ షూటింగ్‌లతో దూరం, దూరంగా ఉండటంతో కళ్లారా ఎప్పుడు చూస్తానా అనిపించేది.

**చిరంజీవి:** నేను ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్నప్పుడే అవకాశాలు మొదలయ్యాయి. ఆల్బమ్ పట్టుకుని అవకాశాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి రాలేదు. అందుకే పెళ్లినాటికే ఫామ్‌లో ఉన్నా. అప్పుడేమో నేను కనబడితే రేఖకి అపురూపం. మనవరాళ్లు వచ్చాక ఎఫెక్షన్ తగ్గింది. పలకరిస్తే 'ఆ వస్తున్నా' అంటుంది. వచ్చి చూడదు. అందుకేనేమో లేటు వయసులో చాలామంది సెకండ్ కోసం చూస్తుంటారు (కొంటెగా నవ్వుతూ). అయినా నేనా ధైర్యం చేయలేను.

**■ చిరంజీవిగారు, చరణ్ కలిసి ఫుల్ లెంగ్త్ సినిమా చేయాలని ఉందా?**

**సురేఖ:** ఇద్దరినీ ఓ సినిమాలో చూడాలని ఉంది. 'ఖైదీ నంబర్–150'లో 'అమ్మడూ లెట్స్ డూ కుమ్ముడు' పాట మధ్యలో చరణ్ వచ్చి డ్యాన్స్ చేస్తాడు. వాళ్లిద్దరూ కలిసి డ్యాన్స్ చేస్తుంటే ఈయన్ని చూడాలా, చరణ్‌ని చూడాలా అనుకున్నాను. ఆ తర్వాత ఇంట్లో ఆ సినిమా చూస్తూ ఒకసారి ఈయన్ని, మళ్లీ ఆ పాట పెట్టుకుని ఒకసారి చరణ్‌ని చూశాను.

**■ నటుడిగా చిరంజీవిగారు రిస్కీ ఫైట్స్ చేస్తుంటారు. మీకెలా అనిపిస్తుంది?**

**సురేఖ:** లొకేషన్‌లో ఏం చేసేవారో తెలిసేది కాదు కానీ, చేసొచ్చిన తర్వాత చెబుతుంటే 'బాబోయ్' అనిపించేది. ఎప్పుడో పొద్దున వెళితే సాయంత్రానికి వచ్చేవారు. అలా కాకుండా ఏ పదకొండింటికో ఆయన ఇంటికి వచ్చేస్తున్నారు అని ఎవరైనా చెబితే మాత్రం, ఏదో దెబ్బతగిలే ఉంటుందనుకునేదాన్ని. అలాగే ఫైట్ సీన్స్ అంటే మధ్యలో లొకేషన్ నుంచి ఫోన్ రాకూడదని కోరుకుంటా. ఫోన్ వస్తే ఆయనకు ఏదైనా దెబ్బ తగలిందని చెబుతారేమోనని భయం. ఇప్పుడు ఫర్వాలేదు కానీ అప్పట్లో ఇంత కంఫర్టబుల్ షూస్ కానీ, సేఫ్టీ ప్రికాషన్స్ కానీ లేవు కదా. ఈయనేమో డూప్ కూడా వద్దంటారు.

**■ పండగలవీ శ్రద్ధగా చేస్తున్నారంటే పూజలు బాగా చేస్తారా?**

**సురేఖ:** మరీ అంత ఎక్కువ కాదు. రోజూ మామూలుగా చేస్తా. స్పెషల్ అకేషన్ అంటే కచ్చితంగా బాగా చేస్తాను. మనం చేస్తుంటేనే పిల్లలు కూడా ఫాలో అవుతారు. మన నెక్ట్స్ జనరేషన్‌కు తెలుస్తుంది. మనం వదిలేస్తే వాళ్లూ వదిలేస్తారు. మా సుస్మిత, శ్రీజ పెళ్లి చేసుకుని వెళ్లిపోయినా ఇక్కడ పూజలు చేసినట్లే అత్తగారింట్లో చేస్తారు.

**■ మనవళ్లు, మనవరాళ్ల గురించి ?**

**సురేఖ:** అదొక లవ్లీ లైఫ్. ఈయనకి అప్పట్లో తీరిక లేక మా పిల్లల ఎదుగుదలను చూడలేదు. ఇప్పుడు చిన్నపిల్లలతో టైమ్ స్పెండ్ చేస్తున్నారు. అందరికీ ఆయనంటే పిచ్చి ఇష్టం. వాళ్లతో ఆయన ఎన్ని ఆటలు ఆడతారో చెప్పలేం.

**■ మీ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుంటాయా?**

**చిరంజీవి:** ఎందుకు జరగవు? తిట్టుకుంటానే ఉంటాం

**సురేఖ:** అలా జరగబట్టే ఇంత సక్సెస్‌ఫుల్‌గా ఉన్నాం. ఎప్పుడూ స్వీట్ స్వీట్‌గా ఉంటే బోర్.

**■ ఇద్దరిలో ఎవరు సీరియస్? ఎవరు కామెడీ?**

**చిరంజీవి:** నేను కామెడీగా ఉండను. అలాగని పెద్ద సీరియస్‌గా కూడా ఉండను. కామెడీ అంటే సురేఖనే ఎక్కువ. ఆమె పంచ్‌లను తట్టుకోవటం చాలా కష్టం. ఒక్కోసారి ఆ పంచ్‌లకు గుక్క తిప్పుకోలేం.

**■ ఫైనల్లీ.. మళ్లీ జన్మంటూ ఉంటే మీరే కపుల్‌గా ఉండాలనుకుంటున్నారా?**

**చిరంజీవి:** నేను ఆ మద్రాస్ కోడంబాకం బ్రిడ్జి మీదకి మాత్రం వెళ్లను (పెద్దగా నవ్వుతూ). ఐయామ్ జస్ట్ కిడ్డింగ్. డెఫినెట్లీ మేమే ఉండాలనుకుంటున్నాం.

**సురేఖ:** అంతే...

– డి.జి. భవాని



సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
ఆదివారం
16-2-2020

# చికుబుకు చికుబుకు రైలే


● రజనీకాంత్

హైదరాబాద్‌లోని ఓ రైల్వేస్టేషన్‌కు రాబోతున్నారు రజనీకాంత్. కానీ ఇది నిజమైన రైల్వేస్టేషన్ కాదండోయ్. సినిమా కోసం వేసిన సెట్ రైల్వేస్టేషన్. రజనీకాంత్ హీరోగా శివ ఓ సినిమాను డైరెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఖుష్బూ, మీనా, నయనతార, కీర్తీ సురేష్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో జరగనున్నట్లు సమాచారం. ట్రైన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాలను చిత్రీకరిస్తారట. ప్రకాష్‌రాజ్, సూరి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు డి. ఇమ్మాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం ఈ ఏడాది దసరా సందర్భంగా విడుదల కానుందనే ప్రచారం జరుగుతోంది.

# వెజ్ టర్న్!


● రకుల్ ప్రీత్

శాకాహారిగా మారిపోయారు హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్. సడన్‌గా తాను తీసుకున్న ఈ 'వెజ్ టర్న్' గురించి రకుల్ మాట్లాడుతూ– ''నా డైట్ ప్రకారం నేను నాజ్ వెజ్ తినడం తప్పనిసరి. ముఖ్యంగా గుడ్లు బాగా తింటాను. కానీ అకస్మాత్తుగా ఓ రోజు వీగన్ (శాకాహారం మాత్రమే తినేవారు. పాల ఉత్పత్తులు కూడా తీసుకోరు)గా మారిపోదామనే ఆలోచన వచ్చింది. అంతే.. మాంసాహారం మానేశా. ముంబైలో షూటింగ్ ఉంటే, నా ఇంటి నుంచి వచ్చే శాకాహార భోజనం, ఫలాలు, పండ్ల రసాలతో రోజంతా బాగానే గడుస్తోంది. ఇండియాలో ఎక్కడైనా ఓకే కానీ విదేశాల్లో షూటింగ్ అంటే ఇబ్బందిగా ఉంది. త్వరగా వెజ్ ఫుడ్ దొరకడం లేదు. కాకపోతే మన సంకల్పం ధృడంగా ఉంటే కచ్చితంగా ఓ మార్గం దొరుకుతుంది. నా టీమ్‌లో ఎవరికి వెజ్ ఐటమ్ కనిపించినా నా కోసం తీసుకువస్తున్నారు'' అని రకుల్ పేర్కొన్నారు.

# పొన్నియిన్.. శోభితా ఇన్


● శోభితా ధూళిపాళ్ల

చోళసామ్రాజ్యంలో రాణిగా స్థానం సంపాదించారు హీరోయిన్ శోభితా ధూళిపాళ్ల. ప్రముఖ తమిళ రచయిత కల్కి కృష్ణమూర్తి రచించిన పొన్నియిన్ సెల్వన్ నవల ఆధారంగా మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పీరియాడికల్ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్'. విక్రమ్, కార్తి, 'జయం' రవి, ఐశ్వర్యారాయ్ ఈ సినిమాలో ప్రధానతారాగణం. వీరితో పాటు తాజాగా శోభితా ధూళిపాళ్ల కూడా ఈ చిత్రంలో చోటు సంపాదించారు. ''మణిరత్నంగారి దర్శకత్వంలో నటిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అన్నారు శోభిత. కూచిపూడి, భరత నాట్యంలో ఎంతో ప్రావీణ్యత, నైపుణ్యం ఉన్న ఓ రాణి పాత్రలో శోభిత నటించబోతున్నారని టాక్. నిజ జీవితంలోనూ శోభితా మంచి క్లాసికల్ డ్యాన్సర్ అనే సంగతి తెలిసిందే.

# వసంత కాలం వస్తోంది


● నయనతార, విఘ్నేష్

నయనతార ప్రధాన పాత్రలో నటించిన తమిళ హారర్ చిత్రం 'కొలయుతిర్ కాలమ్'. చక్రి తోలేటి దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని తెలుగులో 'వసంత కాలం' టైటిల్‌తో ఈ నెల 21న తెలుగులో విడుదల చేస్తున్నారు నిర్మాత దామెర వి.యస్.యస్ శ్రీనివాస్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – ''ఏకవీర, వేటాడు వెంటాడు' వంటి సినిమాలను తెలుగులో విడుదల చేశాం. నయనతార నటన, గ్లామర్ 'వసంత కాలం' సినిమాకు హైలెట్. తెలుగులోనూ పెద్ద విజయం సాధిస్తుంది అనుకుంటున్నాం'' అన్నారు.

### ప్రేమ వార్షికోత్సవం

''నీతో కలసి ఉన్న ప్రతిరోజూ నాకు వేలంటైన్స్ డేనే. అప్పుడే 5 ఏళ్లయిపోయాయా? నమ్మబుద్ధి కావడం లేదు'' అంటున్నారు దర్శకుడు విఘ్నేష్ శివన్. నయనతార, విఘ్నేష్ కొంత కాలంగా ప్రేమలో ఉన్నారు. 5 ఏళ్లుగా మేం రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, 5 ఏళ్ల ప్రేమ వార్షికోత్సవం చేసుకుంటున్నాం అని విఘ్నేష్ పేర్కొన్నారు. ''మా క్యూట్ స్టోరీకి ఐదేళ్లు అయింది. ఈ ఐదేళ్లు నీతో (నయన్) ప్రేమమయం అయిపోయింది'' అని నయన్‌తో దిగిన ఫోటోలను షేర్ చేశారు విఘ్నేష్. ప్రస్తుతం విఘ్నేష్ నిర్మాణంలో 'నెట్రిక్కన్' అనే సినిమా, దర్శకత్వంలో 'కాదు వాక్కుల రెండు కాదల్' సినిమా చేస్తున్నారు నయనతార.

# దర్శకుడు రాజ్‌కుమార్ కన్నుమూత


● రాజ్‌కుమార్

చిరంజీవి తొలి సినిమా 'పునాది రాళ్లు' తెరకెక్కించిన దర్శకుడు రాజ్‌కుమార్ (75) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం హైదరాబాద్‌లోని తార్నాకలో గల తన నివాసంలో మృతి చెందారు. 'పునాదిరాళ్లు' చిత్రం చిరంజీవికే కాదు రాజ్‌కుమార్‌కి కూడా తొలి సినిమాయే. రాజ్‌కుమార్ మొదటి సినిమానే ఐదు నంది అవార్డులు సాధించడం విశేషం. ఆ తర్వాత 'ఈ సామ్రాజ్యం మాకొద్దు, మన వూరి గాంధీ, ఇంకా తెలవారదేమి, తాండవకృష్ణ తరంగం, మా సిరిమల్లి' వంటి సినిమాలను తెరకెక్కించారాయన. రాజ్‌కుమార్ స్వస్థలం విజయవాడ దగ్గర ఉయ్యూరు. గూడపాటి రాజ్‌కుమార్ ఆయన పూర్తి పేరు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అనారోగ్యంతో మృతి చెందారు. ఆ తర్వాతే ఆయన భార్య కూడా చనిపోవడంతో రాజ్‌కుమార్ కుంగిపోయి అనారోగ్యం పాలయ్యారు. ఆయన భౌతిక కాయాన్ని ఉయ్యూరు తీసుకెళ్లారు ఆయన చిన్న కుమారుడు.

రాజ్‌కుమార్ మరణం తీరని లోటు. ఆయన 'పునాది రాళ్లు' తీయాలనుకున్నప్పుడు నన్నో వేషం వేయమని అడిగారు. అప్పటికి ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో నా శిక్షణ పూర్తి కాలేదు. ఆ విషయం చెప్పినా కూడా నువ్వే చేయాలి అన్నారు. నా నట జీవితానికి 'పునాది రాళ్లు' సినిమా పునాది వేసింది. ఈ మధ్యనే ఆయన్ని కలిశాను. అనారోగ్యంతో ఉన్నారని చెబితే అపోలో ఆసుపత్రిలో వైద్యపరీక్షలు కూడా చేయించాం. కోలుకుని నా దగ్గరకు వస్తారనుకుంటే ఇలా జరగడం విచారకరం. రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.

**– నటుడు చిరంజీవి**

# ఇకపై నితిన్ నాట్ ఎ బ్యాచ్‌లర్

**నితిన్ కల్యాణానికి ముహూర్తం కుదిరింది. దుబాయ్ సాక్షిగా షాలినీని పెళ్లాడబోతున్నారు. విశేషం ఏంటంటే... ఇప్పుడు నితిన్ చేస్తున్న 'భీష్మ' సినిమా ట్యాగ్‌లైన్ 'ది బ్యాచ్‌లర్'. అయితే నితిన్ బ్యాచ్‌లర్ లైఫ్‌కి ఫుల్‌స్టాప్ పడబోతోంది. ఇక నితిన్ చెప్పిన విశేషాలు తెలుసుకుందాం...**


● షాలిని, నితిన్

● **'శ్రీనివాస కల్యాణం' సినిమాలో పద్ధతి ప్రకారం పెళ్లి చేసుకోవాలనుకున్నారు. మరి షాలినీతో పెళ్లి కూడా అలానే చేసుకోబోతున్నారా?**

**నితిన్:** నా చిన్నప్పుడు అలాగే అనుకున్నాను. 'శ్రీనివాస కల్యాణం' చేస్తున్నప్పుడు కూడా అలానే అనుకున్నాను. కానీ ఆ సినిమా ఆడలేదు కదా. ఒకవేళ ఆ సినిమా ఆడి ఉంటే అలానే చేసి ఉండేవాణ్నేమో. ఇప్పుడు అలాంటి ఆలోచనలు లేవు.

● **మీ జంట చూడటానికి చాలా బావుంది. షాలినీని ఎప్పుడు కలిశారు? ఎలా కలిశారు?**

'ఇష్క్' (2012) సినిమా జరుగుతున్న సమయంలో కామన్ ఫ్రెండ్ ద్వారా కలిశాం. చూడగానే నా మనసుకు తను బాగా నచ్చింది. ముందు ఫ్రెండ్స్‌లానే ఉన్నాం. కొంత సమయం తరవాత ఒకరినొకరు అర్థం చేసుకున్నాక నెక్స్ట్ స్టెప్ తీసుకున్నాం. గత ఏడాది ఇంట్లోవాళ్లకు చెప్పాం. ఇంట్లో వారికి చెప్పగానే రెండు కుటుంబాలవారు ఎటువంటి అభ్యంతరం లేకుండా అంగీకరించారు. చాలా సంతోషపడ్డాం.

● **'జయం' సినిమాలో సదాని కలవడానికి చాలా కష్టపడతారు. షాలినీని కలుసుకోవడానికి ఏయే ప్లాన్‌లు వేశారు. ఎన్నెన్ని కష్టాలు పడ్డారు?**

'జయం' సినిమాలో కుర్రాడిని కాబట్టి సెట్‌లో తాడులతో కట్టేవారు. ఇంటి పై కప్పు నుంచి సదా రూమ్‌లోకి దూకేవాణ్ణి (నవ్వుతూ). అది సినిమాలో. రియల్ లైఫ్‌కి వస్తే.. తనతో కలసి బయటకు వెళ్లి, నలుగురి కంట్లో పడితే లేనిపోని వార్తలు వస్తాయి. అనవసరమైన అటెన్షన్ ఎందుకు? అనుకున్నాం. అందుకే కారులో బాగా తిరిగేవాళ్లం. మా ఫేవరెట్ డ్రైవ్ ఇన్ ఉంది. అక్కడికెళ్లి కాలక్షేపం చేసేవాళ్లం. అంతే..

● **'నాకు భార్యగా షాలినీయే కరెక్ట్' అని ఏ సందర్భంలో అనిపించింది?**

ఫలానా మూమెంట్ అని చెప్పలేను. ఫ్రెండ్‌షిప్ పెరుగుతున్న క్రమంలో అలా జరిగిపోయింది. తన స్వభావం నాకు చాలా నచ్చింది. అందర్నీ ఒకేలా ట్రీట్ చేస్తుంది. అందరితో ఒకేలా మాట్లాడుతుంది. అది నాకు బాగా నచ్చింది. చాలా సాఫ్ట్‌గా మాట్లాడుతుంది. తనలో మంచి క్వాలిటీ ఏంటంటే.. స్థాయి తేడా చూడదు.

● **ఇంతకీ పెళ్లయ్యాక జాయింట్ ఫ్యామిలీలో ఉండాలనుకుంటున్నారా?**

ఆ విషయం గురించి ఇద్దరం మాట్లాడుకున్నాం. మా ఫ్యామిలీతోనే ఉండాలనుకుంటున్నాం. ఆమెకు కూడా అదే ఇష్టం. మా రెండు కుటుంబాలకు మంచి సింక్ కుదిరింది. అంతా బాగున్నాం.

● **మీరు ప్రేమలో ఉన్న విషయం ఇంట్లో కనీసం ఒక్కరికి కూడా తెలియదా?**

నా సిస్టర్‌కు, కొంతమంది ఫ్రెండ్స్‌కు తెలుసు. మేం పెళ్లి చేసుకుందాం అని నిర్ణయించుకున్న తర్వాత ఇంట్లో పెద్దవాళ్లకు చెప్పాం.

● **ఫోన్‌కాల్స్‌తో బిజీగా ఉండేవారా?**

నేను షూట్‌లో ఉంటే తను అర్థం చేసుకుంటుంది. షూటింగ్ పూర్తయి ఇంటికొచ్చాక ఒక అరగంట మాట్లాడుకునేవాళ్లం. అంటే సందర్భాన్ని బట్టి అది గంట అయినా కావొచ్చు, ఇంకా తక్కువైనా కావొచ్చు.

● **షాలినీవాళ్లది సినిమా బ్యాగ్రౌండా?**

సినిమా నేపథ్యం లేదు. వాళ్ల తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్స్.

● **మొన్న వేలంటైన్స్ డేకి ఏం చేశారు?**

ఆ రోజంతా బిజీ. మా పెళ్లి వేడుకలో భాగమైన పసుపు కొట్టే ఫంక్షన్‌లో బిజీగా ఉన్నాం అందరం. నేను 'భీష్మ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాను. ఫోన్ చేసి 'హ్యాపీ వేలంటైన్స్ డే' అని చెప్పాను.. అంతే.

● **ఫస్ట్ వేలంటైన్స్ డేని ఎలా జరుపుకున్నారు?**

నాకు తెలిసి ఏ వేలంటైన్స్ డేనీ స్పెషల్‌గా జరుపుకున్నది లేదు. షూటింగ్స్‌తో బిజీగా ఉండేవాణ్ణి మధ్యలో ఒకటీ రెండు సార్లు వేలంటైన్స్ డే రోజు ఖాళీగా ఉన్నప్పుడు డ్రైవ్ ఇన్‌లోనే కారులో కూర్చుని కొత్త డిష్ ఆర్డర్ చేసి తింటూ కబుర్లు చెప్పుకున్నాం.. అంతే.

● **రొమాంటిక్ సీన్స్‌లో యాక్ట్ చేయొద్దు అనే ఆర్డర్స్ వచ్చేశాయా?**

లేదు. నా ప్రొఫెషన్‌ని బాగా అర్థం చేసుకుంది. దేవుడి దయ వల్ల ఇప్పటి వరకైతే చెప్పలేదు. ముందు ముందు చెబుతుందేమో చూసుకోవాలి (నవ్వుతూ).

● **పెళ్లి షాపింగ్ ఎప్పుడు మొదలుపెడుతున్నారు?**

ఇంకా ఏమీ అనుకోలేదు. మా పెళ్లి ఏప్రిల్ 16 అయితే నా షూటింగ్స్ ఏప్రిల్ 6 వరకూ ఉన్నాయి. షూటింగ్స్ గ్యాప్ మధ్యలో పెళ్లి షాపింగ్ చేయాలి. మా ఇంట్లో, వాళ్ల ఇంట్లో ఆల్రెడీ స్టార్ట్ చేశారు.

● **ప్రేమలో ఉన్నప్పుడు అన్నీ సక్రమంగానే కనిపిస్తాయి. కానీ తనలో మీకు నచ్చని క్వాలిటీలు, మీలో తనకి నచ్చని క్వాలిటీలు ఉండి మార్చుకున్న సందర్భాలున్నాయా?**

ఇద్దరికీ పరిచయం అయింది 8 ఏళ్ల క్రితం. నాలో కొన్ని.... తనలో కొన్ని మైనస్సులు సహజం. గొడవ పడేవాళ్లం. మాట్లాడుకోకుండా ఉండేవాళ్లం. వాటి అన్నింటిలో నుంచి తను కొంచెం మారింది. నేను కొంచెం మారాను. ఎవ్వరూ పర్ఫెక్ట్‌గా ఉండరు. ఏదో లోపాలుంటాయి. ఇద్దరం మార్చుకుంటూ వచ్చి, ఫైనల్‌గా ఏడడుగులు వేయాలనే స్టెప్ తీసుకున్నాం.

● **పెళ్లి ప్లాన్స్ గురించి?**

దుబాయ్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకుంటున్నాం. కేవలం కొద్ది మంది బంధువులు, మిత్రుల మధ్య మా పెళ్లి జరగనుంది. ఏప్రిల్ 22 లేదా 23 ఇండస్ట్రీ వాళ్లకు రిసెప్షన్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. దుబాయ్‌లో పెళ్లి పనులు ఆల్రెడీ స్టార్ట్ అయిపోయాయి. మా అక్కాబావ, షాలినీ పెళ్లి పనులు చూసుకుంటున్నారు.

# స్వచ్ఛమైన ప్రేమ


● ఇందు

అమిత్, ఇందు జంటగా నటించిన చిత్రం 'చీమ ప్రేమ మధ్యలో భామ'. మాగ్నమ్ ఓపస్ ఫిలింస్ పతాకంపై శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు దర్శకత్వంలో ఎస్.ఎన్ లక్ష్మీనారాయణ నిర్మించారు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదల కానుంది. ''చిన్న సినిమాల్లో మా సినిమా స్పెషల్. అదేంటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే'' అన్నారు దర్శకుడు. ''ప్రస్తుతం యువతీ యువకులు ప్రేమవిషయంలో ఎంత పరిణతితో ఉన్నారో చూపే చిత్రమిది. కాలం మారినా నిజమైన ప్రేమ స్వచ్ఛంగా ఉంటుందని చెబుతున్నాం. మా సినిమా అన్ని వర్గాలవారికి నచ్చే విధంగా ఉంటుంది'' అన్నారు నిర్మాత. ''మంచి పాత్ర చేశా'' అన్నారు అమిత్.

# ఇతడే నా వేలంటైన్


● గుత్తా జ్వాల, విష్ణు విశాల్

వేలంటైన్స్ డే సందర్భంగా ఓ సందేహాన్ని క్లియర్ చేశారు బ్యాడ్మింటన్ ప్లేయర్ గుత్తా జ్వాల. తమిళ నటుడు విష్ణు విశాల్, గుత్తా జ్వాల కొంత కాలంగా ప్రేమలో ఉన్నారనే వార్తలు వస్తూ ఉన్నాయి. ఒకరి బర్త్‌డేలు ఒకరు సెలబ్రేట్ చేసుకోవడం, సోషల్ మీడియాలో సెల్ఫీలు పోస్ట్ చేయడంతో వీళ్లు ప్రేమలో ఉన్నారా? అనే సందేహాలు ఏర్పడ్డాయి. వేలంటైన్స్ డే రోజున విష్ణు విశాల్‌కు ముద్దిస్తున్న ఫొటోను పోస్ట్ చేసి 'ఇతడే నా వేలంటైన్' అని రాశారు జ్వాల. 2011లో భర్త చేతన్ ఆనంద్ నుంచి గుత్తా జ్వాల, 2018లో భార్య రజనీ నటరాజ్ నుంచి విష్ణు విశాల్ విడిపోయారు. మరి.. ప్రస్తుతం ప్రేమలో ఉన్న ఈ ఇద్దరూ పెళ్లి ఎప్పుడు చేసుకుంటారో.









epaper.sakshi.com

స్త్రీ వైశిష్ట్యం-28

# తోడబుట్టినవారే తొలి బంధువులు

కిష్కింధకాండలో తార చేసిన ప్రసంగం చదువుతుంటే, తార మాట్లాడిన మాటలు వింటూంటే... అన్నదమ్ములన్న వాళ్ళు ఎలా బతకాలో, ఎంత ప్రేమగా ఉండాలో తెలుస్తుంది. సుగ్రీవుడొచ్చి పెద్ద అట్టహాసం చేసాడు. వాలి యుద్ధానికి వెళ్ళాడు. ఒంటినిండా దెబ్బలతో నెత్తురు కారుతుండగా సుగ్రీవుడు తిరిగి వెళ్ళిపోయాడు. ''రామా ! నిన్ను నమ్ముకుని వెళ్ళాను. వాలిని సంహరిస్తానన్నావు. నెత్తు రోడుతూ వెనక్కొచ్చా. ఎందుకెయ్యలేదు బాణం?'' అనడిగాడు. మీరిద్దరూ ఒకేలాగా కనిపించారు. పొరపాటు జరుగుతుందని జంకా. గుర్తుకి నీమెడలో తామరమాలతో వెళ్ళు'' అని గజ పుష్పమాలవేసి పంపాడు. సుగ్రీవుడు మళ్ళీ వెళ్ళి ''అన్నయ్యా! బయటికి రా యుద్ధానికి..'' అని సింహనాదం చేసాడు. వాలి బయటకు వెళ్ళబోతున్నాడు. తార చెయ్యి పట్టుకుని వెనక్కి తీసుకొచ్చి కూర్చోబెట్టి..''ఒక్క మాట చెబుతాను... సావధానంగా విను'' అన్నది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

''ఎవరి మీద యుద్ధానికి వెడుతున్నావు. నీ తమ్ముడి మీదనే కదా. ఎవరు నీ తమ్ముడు? ఒక్క తల్లికి, ఒక్క తండ్రికి... ఒక చెట్టుకు పూసిన పూలలాంటి వారు, రెండు కాయల లాంటి వారు మీరిద్దరు. ఎడమ చేయి, కుడిచేయి వేరవ్వచ్చు. కానీ అవి ఒకే దేహానివి. ఇవి రెండూ ఎప్పుడూ కొట్టుకోవు. ఒక చేతికి నొప్పెడితే దాని పని కూడా రెండో చెయ్యి చేస్తుంది. ఒకవేళ నీ తమ్ముడు తప్పుచేసాడే అనుకో. దానికంతగా నెత్తురు కారేటట్లు కొట్టాలా? ఇద్దరూ వీధికెక్కి గదా యుద్ధం చేసుకోవాలా? ఇద్దరూ శక్తిమంతులే కదా. ఒక్కటై నిలబడితే మిమ్మల్ని నిలువరించేవారున్నారా? మీ ఐక్యతను చూసి లోకం ఎంత సంతోషిస్తుంది ?''

''ఎందుకయ్యా తమ్ముడితో యుద్ధం చేస్తావు! వానరుడేగా. పైగా తమ్ముడు. తెలిసీ తెలియని వాడు. చిన్నవాడు. తమ్ముడంటే కొడుకు లాంటివాడు. తప్పుచేసినట్లు అని పిస్తే..మందలించు. అయినా వాడే దూరంగా జరిగిపోయాడనుకో. వాడి ఖర్మ. కానీ నీ దగ్గరకొచ్చాడుగా. కొట్టకు. అనునయించు.''

''పైగా మరొక్కమాట. నీ చేతిలో చావుదెబ్బలు తిన్నాడా.. అంత నెత్తురు కక్కాడా.. మళ్ళీ వెంటనే వచ్చి సింహనాదం చేస్తున్నాడంటే ఏదో కారణం లేకుండా ఎందుకొచ్చాడు... ఏదో బలం చూసుకోకుండా ఎందుకొచ్చాడు.. నా మాట విను ఏదో ఉంది. నీకు తెలియదు. తొందరపడొద్దు. మీ ఇద్దరి జగడంవల్ల ఆఖరికి ఇద్దరిలో ఒకరే మిగిలిపోతే, మిగిలిన వారు ఎంత ఏడ్చినా రెండవ వారు రారుగా... అలా ఒకర్నొకరు కొట్టుకుని చచ్చిపోకూడదు. తప్పు. తమ్ముణ్ణి లాలించు. లోపలికి పిలువు. పిలిచి–'ఇప్పుడే కొట్టాను. బుద్ధి రాలేదా...మళ్ళీ యుద్ధానికి ఎందుకొచ్చావు' అని అడుగు. నేను వదిననేగా. నాకు బిడ్డడు లాంటివాడే కదా. నచ్చచెప్పడానికి నాకూ అధికారముందిగా... లోకంలో అందరికన్నా బంధువన్నవాడు ఎవరో తెలుసా? తోడబుట్టినవాడే బంధువు. ఎందుకయ్యా తమ్ముడి మెడలు విరిచేస్తానంటావు. లోపలికి పిలువు.. చక్కగా మాట్లాడుకోండి.''

''గూఢచారులను పంపి తెలుసుకున్నా. మీ తమ్ముడు రామచంద్రమూర్తితో ఒప్పందం చేసుకున్నాడు. రాముడు అరివీర భయంకరుడు. ఆశ్రయించిన వాడిని కాపాడతానని రాముడు కూడా ప్రతిజ్ఞ చేసాడు. తొందరపడి యుద్ధానికి వెళ్ళకు. మీరిద్దరూ పగలు పెంచుకుని ఒకర్ని ఒకరు చంపుకుంటే అక్కరలేని ప్రమాదం వస్తుంది. నాథా! నా మాట విను. తమ్ముడిని పిలువు'' అంది. తార మాటను తోసిరాజని వెళ్ళిపోయాడు వాలి. వెళ్ళినవాడు మళ్ళీ తిరిగి రాలేదు.

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

# లోకుల వద్దకు లోకపావనుడు




































త్రిలోకపావనుడు, త్రినేత్రుడు, అయిన ఆ పరమేశ్వరుడు, ఈ 21, శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా 11 రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలలో ఇల కైలాసమైన శ్రీశైలమహాక్షేత్రంలో దేవేరి భ్రామరితో కలిసి నవ నవోన్మేషుడై నవవాహనాలపై ఊరేగుతాడు. శివరాత్రి కల్యాణోత్సవానికి ముందే పుష్పోత్సవ పల్లకీ, శివరాత్రి నాడు ప్రభోత్సవ వాహనంలో ఊరేగడంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు కనువిందు చేస్తాడు. ఆయన సేవలో తరించడానికి సకల ప్రాణులు సిద్ధంగా ఉన్నా కొన్నింటిని మాత్రమే ఆయన అనుగ్రహించి వాహనంగా చేసుకున్నాడు. ఆఖరు రోజున తెప్పోత్సవంతో సేవలు ముగుస్తాయి. ఒక్కొక్క వాహనానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. ఆ వాహనాలు వేటికి ప్రతీక... మొదలైన వాటిపై సాక్షి ప్రత్యేక కథనం.

### భృంగి వాహనం

ప్రమథ గణాలలో నంది తరువాత స్థానం కలిగినవాడు భృంగి. ప్రకృతి, పురుషులు, ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులు వేర్వేరు కాదని, ఒక్కరేనని తెలుసుకుని వారిద్దరికి కలిసి ప్రదక్షిణలు ఆచరించాడు. వారిని తన వీపుపై కూర్చోబెట్టుకుని ఊరేగించాడు. ఆనాటి నుంచి భృంగివాహనంగా మారాడు. పార్వతీదేవి కోపానికి గురై రెండు పాదాలలో శక్తి కోల్పోతే స్వామి కరుణించి మూడోపాదాన్నిచ్చి రక్షించాడు. కనుక ఇతను త్రిపాదుడు. నమ్మిన వారిని స్వామి ఎప్పటికీ మరచిపోడని భృంగివాహనం తెలియజేస్తోంది.

### హంసవాహనం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు సాయంత్రం స్వామి, అమ్మవార్లు హంసవాహనంపై ఊరేగుతారు. హంస అఖండమైన జ్ఞానానికి ప్రతీక, పరమేశ్వరుడు సకల కళలకు అధిపతి. అంతులేని జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు కనుకనే జ్ఞానానికి ప్రతీకయిన హంసపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. హంస పాలను, నీళ్లను వేరు చేస్తుంది. పాలల్లో నీళ్ల కలిపి ఇస్తే నీటిని ఉంచి పాలను మాత్రమే స్వీకరిస్తుంది. అలాగే జీవితంలో కష్టనష్టాలు, సుఖదుఃఖాలు వచ్చినా కష్టాలను విడిచిపెట్టి సుఖ జీవనం సాగించాలని, దుర్గుణాలను విడిచి అఖండ జ్ఞానాన్ని సంపాదించమని జ్ఞాన ఉపదేశకుడైన స్వామి జ్ఞానశక్తి అమ్మవారితో కలిసి జ్ఞానప్రతీకయైన హంసవాహనంపై ఊరేగుతారు.

### మయూర వాహనం

మయూరం అంటే నెమలి. ఈ నెమలి సమస్త సృష్టి క్రియా చైతన్యానికి ప్రతీక.

మయూరం సుబ్రమణ్యస్వామి వాహనం. మరి ఈ వాహనం స్వామికి వాహనంగా ఎలా మారింది? శివునిలోనూ సుబ్రమణ్యస్వామిలోనూ ఉన్నది ఒకే అంశ అదే శివాంశ. అలా శివుడికి శిఖి (నెమలి)వాహనమైంది. కాగా నెమలి వెయ్యి కన్నులతో (పింఛాలతో)కనిపిస్తుంది. తనను శరణు వేడిన భక్తులను వెయ్యి కన్నులతో కనిపెట్టుకుని ఉంటాననడానికి సంకేతంగా నెమలిపై వస్తున్న స్వామి తన భక్తులకు హామీ ఇస్తున్నట్లుంది.

### రావణ వాహనసేవ

రావణుడు అఖండ శివభక్తుడు. నిరంతరం శివధ్యానం చేస్తూ ప్రతి నిత్యం కోటి శివలింగాలను అర్చించేవాడు. పరమేశ్వరుడి అనుగ్రహంతో ఎన్నో వరాలు పొంది పరమేశ్వరుడి కోసం చేసిన తపస్సులో పది సార్లు తన తలను నరికి తిరిగి పది తలలను పొంది దశకంతుడిగా పేరు పొందాడు. తన ప్రేగులనే తంత్రులుగా చేసుకుని తన పదవతలనే మీటగా మార్చి వీణానాదంతో శివుడికి ప్రీతి కలిగించాడు. ఆ వీణే రుద్రవీణగా ప్రసిద్ధికెక్కింది.. రావణుని పది తలలు పది రకాలైన జ్ఞానానికి ప్రతీక. అనన్యమైన భక్తితో పరమేశ్వరుడిని శరణు వేడితే అపారమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తాడని రావణవాహనం చెబుతోంది.

### పుష్పపల్లకీ సేవ

స్వామివారు అభిషేక ప్రియుడైతే అమ్మవారు పుష్పప్రియురాలు. హిమవంతుడు తన కుమార్తెతో వివాహానికి స్వామివారిని ఒప్పించి స్వామిని తీసుకురమ్మని మేనా (పల్లకి)ని పంపుతాడు. ఆ మేనాను సృష్టిలో అరుదైన అద్భుతమైన దివ్యపరిమళం కలిగిన పూలతో అలంకరించి పంపుతుంది పార్వతిదేవి. తన వాహనం విడిచి రాని శివుడు పార్వతి మాట చెల్లించడం కోసం ఆ పుష్పపల్లకి ఎక్కి వస్తాడు. పుష్పాలు మోహాన్ని కలిగిస్తాయి. ఆ మోహం క్షణికం. సుతిమెత్తని పూల ఆయుష్షు ఒక్కరోజే కాని అవి చేరాల్సిన చోటుకు చేరి పరమేశ్వరుని సాన్నిధ్యం పొందాయి. నేను పెంచిన పూలైన మీరంతా నన్ను ఆర్చించి చివరకు నా దరికే చేరుకోండనే సంకేతం ఉంది.

### గజవాహనసేవ

గజం ఐశ్వర్యానికి, ఆధిపత్యానికి, అంగబలానికి ప్రతీక. శ్రీశైలమల్లికార్జునస్వామి శ్రీలింగ మహాచక్రవర్తి, ఈ సమస్త భూమండలానికి మూలమై నిలిచే శ్రీశైలం ఆయన మహా సామ్రాజ్యం. ఆ సామ్రాజ్యాధినేతకు, సమస్త భక్తులు ఆయన సైన్యం. జయధ్వానాల నడుమ ఆయన అమ్మతో కలిసి ఐరావతాన్ని ఆధిరోహించి దర్శనమిస్తాడు. భక్తులకు అండగా నిలుస్తాడు. ఈ సమస్త భూమండలాన్ని అష్ట దిగ్గజాలు మోస్తున్నాయి. ఈ దిగ్గజాలు అష్టైశ్వర్యాలకు ప్రతీకలు. అటువంటి అష్టగజాల సమిష్టి రూపమైన గజంపై ఆయన ఊరేగింపుగా వస్తుంటే సమస్త భక్తులకు కొండంత అండగా కనిపిస్తాడు. తమ కష్టాలు గట్టెక్కాయనే ధైర్యం భక్తులలో కలుగుతుంది. కుబేరుడు, లక్ష్మీదేవి మొదలైన వారికి ఐశ్వర్యాన్ని ప్రసాదించిన ఐశ్వరేశ్వరుడు. గజ వాహనంపై దర్శనమిస్తున్న స్వామి భక్తులకు సమస్త సుఖసంపదలను ప్రసాదిస్తాడు.



శ్రీశైల భ్రమరాంబికదేవి అమ్మవారు

### ప్రభోత్సవం

ఉత్సవాలలో ముఖ్యమైన మహాశివరాత్రి నాడు ప్రభోత్సవం అత్యంత ప్రముఖమైన ఘట్టం. ప్రభపై స్వామి, అమ్మవార్లు ఊరేగుతారు. ప్రభ రెండు స్తంభాలు ఒకటై చివరికి ముక్కోణంగా కనిపిస్తుంది. అంటే భగవంతుని మూడు మార్గాల ద్వారా అంటే కాయక (శరీరం) వాచిక (మాటలు), మానసిక మార్గం ద్వారా ఉపాసించమని తెలుపుతుంది. ప్రభలో ఎన్ని రంగులున్నాయో, తమ జీవితంలో అన్ని శుభాలు కలగాలని స్వామిని కోరుకుంటారు.

### నందివాహనసేవ

నంది శివుడికి అత్యంత ఆప్త భక్తుడు. తనకు తండ్రి ద్వారా లభించిన శివభక్తితో శివుడికై తపస్సు చేసి చివరికి ఎప్పటికీ శివుని వీడి ఉండకుండా నిరంతరం స్వామి సాహచర్యం పొందే గొప్ప అవకాశాన్ని పొందాడు. నంది సాక్షాత్తు ధర్మస్వరూపం. అతడి నాలుగు పాదాలు నాలుగు వేదాలు. అతడి రెండు కళ్లు సూర్యచంద్రులు. అతని రూపం రుద్రుడి రూపం. అతని హృదయం ధర్మానికి నిలయం.

### రథోత్సవం

రథం ఒక వాహనం మాత్రమే కాదు. ఒక సంకేతం. రథచక్రం కాల చక్రానికి ప్రతీక. ఆత్మను రథసారథిగా, మనస్సును పగ్గాలుగా, దేహాన్ని కదిలే రథంగా అభివర్ణించాయి ఉపనిషత్తులు. రథం చూడడానికి మరో ఆలయంగా దర్శనమిస్తుంది. ఆలయానికి చక్రాలు బిగించి కదిలే దేవాలయంగా కమనీయంగా దర్శనమిస్తుంది రథం. భ్రమరాంబా సమేతుడైన మల్లికార్జునుడు రథంపై విహరిస్తూ భక్తుల తాపత్రయాన్ని (మూడు బాధలను) నివారిస్తూ ఆలయానికి రాలేని వృద్ధులు, రోగులను ఆదుకుంటానని అభయమిస్తూ రథాలయాన్ని భక్తుల ముందుకు తెస్తుందీ రథోత్సవం.

అశ్వం నూతనత్వానికి ప్రతీక. నిరంతరం శక్తిని కూడగట్టుకుని లక్ష్యాన్ని చేరే వరకూ అలుపెరగదు అశ్వం. అలాగే పరమేశ్వరుని పాదాలను చేరుకునే వరకు మీ పూజలు, తపస్సు ఆపకండి నిరంతరం శివభక్తిలో ప్రయాణించి చివరకు శివసాన్నిధ్యం పొందటమే మీ జీవిత లక్ష్యంగా మార్చుకొండి అని అశ్వవాహనం తన సందేశాన్ని తెలుపుతుంది.

– ఎన్.నాగమల్లేశ్వరరావు,
సాక్షి, శ్రీశైలం

దక్షిణ కాశీ ప్రాశస్త్యం



పెదకళ్లేపల్లిలో ఆలయం ముందు ఏర్పాటు చేసిన మహా శివలింగం

# బ్రహ్మోత్సవ కళ్ళేపల్లి

కృష్ణానది తీరానగల పవిత్ర శైవక్షేత్రాలలో శ్రీ దుర్గా నాగేశ్వరస్వామి వారి ఆలయం ఒకటి. శ్రీ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 26 వరకు ఐదు రోజులపాటు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. దక్షిణం వైపు నుంచి ఉత్తరం వైపుకు కృష్ణానది ప్రవహించడంతో ఇక్కడ పుణ్యస్నానం చేసిన భక్తులకు స్వర్గప్రాప్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం.

చరిత్ర ప్రాశస్త్యం పొందిన శ్రీ స్వామివారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి దేవస్థానంలోని సత్యస్తంభాన్ని దర్శించుకున్న అనంతరం శ్రీదుర్గా, పార్వతి సమేత నాగేశ్వర స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని స్వామివార్ల కరుణా కటాక్షాలు పొందుతారు. నాగేశ్వర క్షేత్రమవడంతో కర్కోటక క్షేత్రమని కూడా పిలుస్తారు. ఈ క్షేత్రమందు కశ్యప–ప్రజాపతి పుత్రులగు కర్కోటక, వాసుకి, తక్షక మొదలగు అష్టఫణి రాజులు తమ తల్లి శాప విముక్తికై శిలావేదిక నిర్మించి, ఈశాన్య భాగాన సరోవరం తవ్వి ఆ జలంతో శివుని అభిషేకించి పూజించడంతో స్వామివారు ప్రత్యక్షమయ్యారట. తమ ముందు ఉద్భవించిన స్వామివారిని చూసి వారు కదళీ కదళీ అని కేకలు వేయడంతో నేను ఉద్భవించు సమయాన మీరు వేసిన ఈ కదళీ కదళీ అను కేకలతో ఈ క్షేత్రం కదళీపురంగా ప్రసిద్ధి చెందుతుందని చెప్పి స్వామి అంతర్ధానమయ్యాడు. అప్పటినుంచి ఈ క్షేత్రం కళ్లేపల్లిగా, కాలక్రమేణా పెదకళ్లేపల్లిగా ప్రసిద్ధిచెందినట్లు స్థల పురాణం చెబుతోంది.

మహాశివరాత్రినాడే స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ముందుగా సమీపంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారిని దర్శించుకుని శ్రీదుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి కరుణాకటాక్షం పొందుతారు. ప్రతి ఏడాది పితృదేవతలకు పిండప్రదానం చేసేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు.

### ప్రత్యక్ష స్వర్గ ప్రాప్తి



పవిత్ర పుణ్యజీవనదుల్లో కృష్ణానది ఒకటి. ఇక్కడ కృష్ణానది దక్షిణం నుంచి ఉత్తరం వైపు ప్రయాణిస్తుంది. ఉత్తరం వైపు ప్రయాణించే నదిలో పుణ్యస్నానం చేస్తే కాశీలోని గంగానదిలో చేసినంత పుణ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అందువల్ల నిరాహారంగా పితృదేవతల ప్రీతికొరకు ఈ నదిలో స్నానం చేసి పిండప్రదానం చేసిన భక్తులకు ప్రత్యక్ష స్వర్గప్రాప్తి లభిస్తుంది.

– శంకరమంచి భాస్కర విజయ్‌కుమార్ శర్మ,
ఆలయ ప్రధానార్చకులు, పెదకళ్లేపల్లి

ఇక్కడ క్షేత్రపాలకుడు శ్రీ వేణుగోపాలస్వామి, కాలభైరవ స్వామిగా గుర్తించబడటంతో ఈ క్షేత్రాన్ని దక్షిణకాశీగా కూడా పిలుస్తారని చెబుతుంటారు. ఆలయం ముందుభాగం ఐదు అంతస్థుల రాజగోపురం, లోపల 16 స్తంభాల శ్రీస్వామివారి కళ్యాణ మండపం, యాగశాల, వాహనశాల, యాత్రికుల సౌకర్యార్థం శ్రీకనకదుర్గా కళ్యాణ మండపం నిర్మించారు.

శివరాత్రి పర్వదినాల్లో శ్రీదుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారిని దర్శించుకోవడం వల్ల కష్టాలు తొలగిపోతాయని, సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని, వ్యాధుల బారినుంచి విముక్తులవుతారని విశ్వాసం. ఆలయం ఎదుట మహాశివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ భారీవిగ్రహాన్ని చూసినవారికి పరమశివుడే దిగివచ్చిన అనుభూతి కలుగుతుంది.

– ఉప్పల సుబ్బారావు,
సాక్షి మోపిదేవి

సువార్త

# అస్పృశ్యతపై ఒక సమరయుని సమరం!

ఒకసారి ఎంతో భావగర్భితమైన ఉపమానాన్ని యేసుప్రభువు చెప్పాడు. ఇజ్రాయెల్ దేశంలో ఉత్తరాన యేసుప్రభువు నివసించిన నజరేతు గ్రామమున్న గలిలయ ప్రాంతానికి, దక్షిణంలోని యెరూషలేము పట్టణానికి మధ్య రాకపోకలకు రెండు మార్గాలున్నాయి. ఒకటేమో సమరయ గ్రామాల గుండా వెళ్లే దగ్గరి మార్గం. కానీ సమరయులు అంటరానివారు గనుక సనాతన యూదులు ఆ మార్గంలో వెళ్లేవారు కాదు. రెండవది దూరమార్గం కానీ సనాతన యూదులుండే యెరికో లాంటి పట్టణాల గుండా వెళ్లే మార్గం. అయితే దొంగల బెడద కూడా బాగా ఉన్న మార్గమది. ఒకసారి ఆ మార్గంలోనే సనాతన యూదుడొకతను ప్రయాణమై వెళ్తూ దొంగల బారినపడ్డాడు. దొంగలు అతన్ని బట్టలతో సహా పూర్తిగా దోచుకొని విపరీతంగా కొట్టి కొనప్రాణాలతో దారిపక్కన పడేశారు. అపుడు అతనిలాగే సవర్ణులు, సనాతనులైన ఒక యాజకుడు, లేవీయుడు అటువైపు వచ్చికూడా అతన్ని పరామర్శించకుండా వెళ్లిపోగా, ఒక సమరయుడు అటుగా వెళ్తూ అతన్ని చూసి, పరామర్శించి, అతని గాయాలు కట్టి, ఆ మార్గంలోనే ఉన్న ఉన్న ఒక పూటకూళ్లవాని ఇంట్లో అతన్నిచేర్చి, అతనికయ్యే ఖర్చంతా భరించాడు. మనవాళ్లే కదా అనుకున్న యాజకుడు, లేవీయుడు స్వార్థపరులై అతన్ని ముట్టుకోవడం కాదు కదా కనీసం చూడకుండా మోహం చాటేసి వెళ్ళిపోగా, ఏ అంటరాని వాళ్లకయితే దూరంగా ఉండాలనుకొని యెరికో దారినెన్నుకొని ఆపదల్లో పడ్డాడో, ఆ అంటరానివాడే ఆప్తుడై అన్ని సపర్యలూ చేసి క్షతగాత్రుని బతికించాడు. మతపరంగా ప్రముఖులు, జ్ఞానులైన ఆ యాజకుడు, లేవీయుడి కన్నా. అంటరానివాడైన ఆ సమరయుడే నిజమైన పొరుగువాడు, అసలైన విశ్వాసి అని యేసుప్రభువు తేల్చి, విశ్వాసానికి నిజమైన ప్రామాణికతనిస్తూ, నిన్ను వలె నీ పొరుగువాన్ని ప్రేమించాలన్న నియమం కన్నా అతున్నతమైనది మరొకటి లేదని బోధించాడు. అలా క్రైస్తవానికి ఈ బోధే మూలరాయి అయ్యింది.

అయితే యేసుక్రీస్తు జీవితంలో నుండి పెల్లుబికిన ఇలాంటి విశిష్టమైన బోధలతో ఆవిర్భవించిన 'క్రైస్తవం',ఒక 'మతం' స్థాయికి దిగజారడంతో సమస్యలన్నీ మొదలయ్యాయి. నిజమైన ప్రేమ, సోదర భావం, సౌభ్రాతృత్వానికే కాదు, స్వార్థం, పగ, ద్వేషం, వివక్షకు కూడా కుల, మత, ప్రాంతీయాది విభేదాల్లేవు, సరిహద్దులు అసలే లేవన్నదే ఇందులోని తాత్పర్యం!! ఈ సూక్ష్మం అర్థమైతే, క్రైస్తవంలోనే కాదు ప్రపంచంలోనే అసలు సమస్యలు లేవు. 'అయ్యో! మన మనవాడే కదా!'' అన్న జాత్యాభిమానంతోనైనా ఆపదలో ఉన్న వాడిని ఆదుకోని 'పచ్చి స్వార్థపరులు' ఆ యాజకుడు, లేవీయుడైతే,'నన్ను అంటరాని వాణ్ని చేసిన దుర్మార్గుడితను' అని ఈసడించుకోకుండా, అతన్ని కాపాడిన 'మహోన్నతమైన ప్రేమ, మానవత్వం' ఆ సమరయుడిది. మనం తరచుగా వాడే 'మనవాడు', 'పగవాడు' అన్న పదాలు ఎంత అర్థరహితమైనవో తెలిపే బోధ ఇది. మనల్ని ఆపదలో ఆదుకున్న వాడే మనవాడు, పొరుగువాడనీ, మొహం చాటేసే 'మనవాళ్ళు' పగవారికన్నా తక్కువైనవారేమీ కాదని తెలుపుతూ, మానవత్వాన్నే పునర్నిర్వచించిన పునాది రాయి ఈ బోధ! పెద్దలు సౌకర్యార్థమై కొన్ని శాఖల్ని మనలో ఏర్పాటుచేసినా, ఒక డినామినేషన్ కాకి మరో డినామినేషన్ మీద వాలనంత వైషమ్యం, ప్రేమకు, ఐక్యతకు మారుపేరైన క్రైస్తవంలో మనకెందుకుందో లోకానికి, దేవునికి కూడా ఒకరోజున మనం సంజాయిషీ చెప్పాలి. ప్రాణం మీది తీపితో ఒక సర్జరీ చేయించుకునేటపుడు 'డాక్టర్ మనవాడా?' అని ఆలోచించని వారికి, పిల్లలకు చదువు చెప్పేవాళ్ళు 'మనవాళ్ళా'? అని అడగని వారికి, కొన్ని సందర్భాల్లోనే 'మనవాళ్ళా?' అనడిగే సంకుచితత్వమా? పుట్టుకతోనే ఎవరూ విశ్వాసులు కాదు. అలాగని ఎన్నేళ్లైనా క్రీస్తు సారూప్యం ఏర్పడకుంటే, అసలు క్రైస్తవులమే కాదు!!

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్
సంపాదకుడు – ఆకాశధాన్యం

సాక్షి
వీకెండ్ ఫోకస్
10
నల్లగొండ । ఆదివారం । ఫిబ్రవరి । 16 । 2020 ।
www.sakshi.com

# ఆత్మవిశ్వాసంతో ఆప్

## ఢిల్లీ విజయంతో పెరిగిన భవిష్యత్ అంచనాలు

జాతీయం

ఢిల్లీ మూడోసారి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఘన విజయం దేశ రాజకీయాల్లో పెను సంచలనమే సృష్టించింది. అభివృద్ధి మంత్రంతో, ప్రభుత్వ వ్యతిరేకతను పక్కకునెట్టి అరవింద్ కేజ్రీవాల్ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో 67 సీట్లు సాధించి రికార్డు సృష్టించిన ఆప్ 2020లోనూ విజయఢంకా మోగిస్తుందన్న విషయంలో రాజకీయ విశ్లేషకుల్లో ఎటువంటి సందేహం లేనప్పటికీ ఢిల్లీ ప్రజలు అంచనాలకు మించి కేజ్రీవాల్ పట్ల ఇంతటి భారీ విశ్వాసాన్ని ప్రదర్శించడం విశేషమే. ఢిల్లీని వరుసగా పదిహేనేళ్ల పాటు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీకి గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ చేదు అనుభవమే మిగిలింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం 7 ఎంపీ సీట్లను గెలుచుకున్న బీజేపీ, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 8 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

### అభివృద్ధి మంత్రం

గతంలో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో కేజ్రీవాల్ కృతకృత్యులయ్యారు. బిజిలీ, పానీ, బస్తీ దవాఖానా, నాణ్యమైన విద్యా, మౌలిక వసతుల కల్పనలో అనూహ్య మార్పులు దేశానికే తలమానికంగా నిలిచాయి. ఇవే ఆప్ విజయాన్ని సులభతరం చేశాయి. కేజ్రీవాల్ సంయమనంతో చేసిన ప్రచారానికి తోడు మహిళల రక్షణకు చేపట్టిన చర్యలు ఆప్‌ని విజయ తీరాలకు చేర్చాయి.

### ఆప్ భవిష్యత్ వ్యూహం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయంతో ఆప్‌నకు భవిష్యత్‌పై అంచనాలు పెరిగినట్టు నిపుణులు భావిస్తున్నారు. ఇదే నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఆమ్‌ఆద్మీ పార్టీ రానున్న అన్ని ఎన్నికల్లో పోటీ పడాలని ఉవ్విళ్లూరుతోంది. అందుకే సభ్యత్వ నమోదుపై ప్రధానంగా దృష్టి పెట్టింది. ఢిల్లీ ఫలితాలు వెలువడిన వెంటనే 11 లక్షల మంది ఆప్ సభ్యత్వం పొందడం గమనార్హం. రానున్న బీహార్ ఎన్నికల్లో వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌నే తమ ముఖ్యనేతగా ప్రకటించే ఆలోచనలో కేజ్రీవాల్ ఉన్నట్టు తెలుస్తోంది.





ఢిల్లీలో ప్రధాని మోదీకి జ్ఞాపికను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్

# జగన్ ఢిల్లీ పర్యటన సూపర్ సక్సెస్

## రాష్ట్ర సమస్యలను ఢిల్లీ పెద్దలకు కూలంకషంగా వివరించిన సీఎం

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక రోజు గ్యాప్‌తో రెండుసార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రవిశంకర్ ప్రసాద్‌తో సుదీర్ఘంగా సంప్రదింపులు జరపడం ఈ వారంలో చోటుచేసుకున్న ముఖ్యమైన పరిణామం. బుధవారం ప్రధానమంత్రి మోదీతో, శుక్ర, శనివారాల్లో అమిత్ షా, రవిశంకర్ ప్రసాద్‌తోనూ ముఖ్యమంత్రి సంప్రదింపులు జరిపిన తీరు, వీటికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యం అటు దేశ రాజధాని ఢిల్లీలో, ఇటు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. సీఎం వైఎస్ జగన్‌తో ప్రధానమంత్రి మోదీ గంటన్నరకు పైగా (100 నిమిషాలు) సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేకించి ముఖ్యమంత్రి జగన్‌కు ఇచ్చిన ప్రాధాన్యంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. వచ్చిన అవకాశాన్ని సీఎం జగన్ చాలా చక్కగా వినియోగించుకోవడం ద్వారా తన ఢిల్లీ పర్యటనలను బాగా విజయవంతం చేసుకున్నారనే భావన అన్ని వర్గాల్లో వ్యక్తమవుతోంది. సీఎం ఢిల్లీ టూర్‌ను అధికార, రాజకీయ వర్గాలు సూపర్ సక్సెస్‌గా పేర్కొంటున్నాయి. ప్రధాని, కేంద్ర మంత్రులు సీఎంతో సుదీర్ఘ సంప్రదింపులు జరిపారంటే రాష్ట్రానికి ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు అర్థమవుతోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో రచ్చబండలు, గ్రామ సచివాలయాల దగ్గర ప్రజలు కూడా ఇదే విషయం చర్చించుకుంటున్నారు.

### క్లుప్తంగా విస్పష్టంగా విశదీకరణ

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన పోర్టులు, స్టీల్‌ప్లాంటు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు లాంటివన్నీ త్వరితగతిన సమకూర్చాలని సీఎం జగన్ ప్రధానికి, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రధానిని కలిసిన సీఎం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూడా స్పష్టంగా గణాంకాలతో సహా వివరించారు. విభజన చట్టంలో ఏమి చెప్పారు? కేంద్రం ఇప్పటి వరకూ చేసిందేమిటి? ఇంకా చేయాల్సినవేమిటి? అనే అంశాలపై విస్పష్టమైన గణాంకాలతో సీఎం జగన్ ప్రధానికి నివేదికలు సమర్పించారు. రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టు పూర్తికి సవరించిన అంచనాలను ఆమోదించి నిధులు కేటాయించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి ఇతోధిక సాయం అందించి రాష్ట్ర ప్రగతికి చేయూత ఇవ్వాలని కోరారు.

### వికేంద్రీకరణ ఎజెండా..

రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పరిపాలనా, అభివృద్ధి వికేంద్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరించదలచిన విధానాన్ని కూడా ప్రధానికి సీఎం వివరించి కేంద్ర సహకారం కోరారు. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాల మేరకు అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల ప్రకారం హైకోర్టు ప్రధాన కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయడానికి సహకరించాలని కోరారు. అభివృద్ధికి ప్రతిబంధకాలు కలిగిస్తున్న శాసనమండలి రద్దు చేయాలని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్ర ఆమోదం కోసం పంపినందున దీనిని పార్లమెంటులో పెట్టి త్వరగా ఆ మోదించాలని కోరారు. విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తామని చెప్పారు.

తెలంగాణ

# హైదరాబాద్‌లో కోవిడ్ గుబులు!

**వైరస్ అడుగుపెట్టకుండా పటిష్ట చర్యలు**

**సాక్షి, హైదరాబాద్:** చైనాలోని వూహాన్ పట్టణ కేంద్రంగా ప్రపంచాన్ని గడగడలాడించిన కోవిడ్(కరోనా) వైరస్ తెలంగాణ రాష్ట్రంలోనూ అలజడి సృష్టించింది. చైనా తదితర దేశాల నుంచి హైదరాబాద్, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణికులు వస్తుండడంతో ఏ క్షణాన ఈ వైరస్ ఇక్కడి ప్రజలను కబళిస్తుందోనన్న ఆందోళన ఈ వారమంతా నెలకొంది. చైనా నుంచి వచ్చిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు ఈ వైరస్ సోకిందని, పరీక్షలు నిర్వహిస్తే పాజిటివ్ వచ్చిందన్న వార్తలు ఈ ఆందోళనలను మరింత అధికం చేశాయి. చివరకు వారికి కూడా నెగిటివ్‌గా నిర్ధారణ అయిందని తేలడంతో ప్రజానీకం ఊపిరి పీల్చుకుంది.

- కోవిడ్ వైరస్ తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా వైద్య ఆరోగ్య శాఖ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంది. ప్రత్యేక పర్యవేక్షణతో ఆ శాఖ ఉన్నతాధికారులు కోవిడ్ వైరస్‌పై యుద్ధమే చేశారంటే అతిశయోక్తి కాదు.
- గత పది రోజుల నుంచి మొత్తం 92 మందిని పరీక్షించారు. ఇందుకోసం గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు.
- శంషాబాద్ విమానాశ్రయంలోనే థర్మల్ స్కానింగ్ ద్వారా ప్రయాణికులను క్షుణ్నంగా పరీక్షిస్తున్నారు. కోవిడ్ వైరస్ నగరంలోకి ప్రవేశించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు.
- వైరస్ సోకిందన్న అనుమానం ఉన్న వారిని వైద్యాధికారులు నిశితంగా పరీక్షించారు. వైరస్ లేదని తేలిన తర్వాతే వారిని ఆసుపత్రుల నుంచి బయటకు పంపారు.
- కోవిడ్ వైరస్ వ్యాప్తిపై తప్పుడు సమాచారం ఇచ్చారంటూ వసంత్ అనే వైద్యాధికారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే, దాంతో తనకు సంబంధం లేదని, తనపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని ఆ వైద్యుడు ఆత్మహత్యాయత్నం చేయడం, ఆయనకు డాక్టర్ల జేఏసీ మద్దతివ్వడం లాంటి ఘటనలు జరిగాయి.
- మొత్తంమీద గత వారం రోజుల్లో రాష్ట్రంలో ఎవరి నోట విన్నా ఇదే వైరస్ మాట వినిపించింది.
- చైనాతోపాటు ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఏం జరుగుతోందన్న దానిపై ప్రజలు ఆరా తీస్తూ కనిపించారు.
- ముఖ్యంగా చైనాలో నెలకొన్న పరిస్థితులపై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వీడియోలు వైరల్ అయ్యాయి.
- కోవిడ్ వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలంటూ... వాడాల్సిన మందులు ఇవేనంటూ ఫేక్ వార్తలు కూడా సోషల్ మీడియాలో వ్యాప్తి చెందాయి. వాటిని నమ్మొద్దంటూ నిపుణులు సూచించారు.



అంతర్జాతీయం



# ఆరోగ్య శత్రువు కోవిడ్-19

## ఇప్పటిదాకా 66 వేల మందికి సోకిన వైరస్ ■ 1,500 మందికి పైగా బలి

చైనాలోని వూహాన్ ఉద్భవించి, ప్రపంచ దేశాలను భయభ్రాంతులకు గురిచేస్తున్న కోవిడ్-19(కరోనా వైరస్) మరణాల సంఖ్య ఇప్పటికే 1,500 దాటింది. మొదట గత ఏడాది డిసెంబర్‌లో కరోనా పేరు వినిపించింది. దీని ప్రభావాన్ని తక్కువగా అంచనా వేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించడానికి సైతం వెనకాడింది. క్రమంగా కరోనా వైరస్ వల్ల ఒక్క చైనాలోనే స్వల్పకాలంలో వందలాది మంది టపటపా రాలిపోవడంతో డబ్ల్యూహెచ్‌వో అప్రమత్తమైంది. ఈ మహమ్మారిని అడ్డుకోవడం సమీప భవిష్యత్తులో సాధ్యం కాదని తేల్చి చెప్పింది. ఇప్పటికిప్పుడు కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు టీకా మందును కనుక్కోవాలన్నా కనీసం ఆ ప్రయత్నం జరగడానికే 18 నెలల సమయం పడుతుందని వైద్య శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

- ప్రపంచ ప్రజారోగ్య శత్రువుగా పరిణమిస్తున్న కోవిడ్-19 వైరస్ ఇప్పటికే 66 వేల మందికి సోకినట్టు నిర్ధారణ అయ్యింది. ఈ వైరస్ 28 దేశాలకు విస్తరించి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కోవిడ్ వైరస్ దేనిద్వారా విస్తరిస్తుందనే విషయంలో ఏకాభిప్రాయం లేదు.
- కొన్ని దశాబ్దాల క్రితమే కరోనా వైరస్ గుర్తించారు. కరోనా వైరస్ ఒక వైరస్ కాదు. వైరస్ కుటుంబం పేరు. గతంలో వచ్చిన ఐదారు రకాల వైరస్‌లు కూడా ఇదే కోవలోకి వస్తాయి. అవన్నీ జంతువులు, పక్షులు ద్వారా వ్యాపించినవి. కోవిడ్-19 వైరస్ మనుషుల నుంచి శరవేగంగా మనుషులకు సంక్రమించే వైరస్.
- ప్రపంచంలో ప్రబలుతున్న ప్రాణాంతక వ్యాధుల వల్ల మానవ సమాజం ఆర్థికంగా నష్టపోతోంది. గతంలో 'సార్స్' వల్ల ఉత్పత్తి క్షీణించి, 40 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా.

### వైరస్ పేరు మార్పు

కరోనా వైరస్ పేరును ప్రపంచ ఆరోగ్య సంస్థ కోవిడ్-19గా (కరోనా, వైరస్ డిసీజ్) మార్చింది, కరోనా అనే పేరు ఇప్పటికే వ్యక్తులకు, ప్రాంతాలకు, సంస్థలకు ఉండటం వల్ల అది ఒక వ్యాధిని సూచించే వైరస్‌గా మాత్రమే ఉండాలని డబ్ల్యూహెచ్‌ఓ కరోనా వైరస్ పేరును కోవిడ్‌గా మారుస్తున్నట్లు ప్రకటించింది. కోవిడ్ వైరస్ బారిన పడినవారి దగ్గరికి ఎప్పుడైనా వెళ్లామా అనేది తెలుసుకోవడానికి క్లోజ్ కాంటాక్ట్ డిటెక్టర్ అనే యాప్‌ను చైనా రూపొందించింది.

### 'సార్స్'తో పోలిక లేదు

కోవిడ్-19కి 'సార్స్' వైరస్ లక్షణాలున్నాయని శాస్త్రవేత్తలు తొలుత అంచనా వేశారు. కానీ, కోవిడ్-19లో సార్స్ వైరస్ లక్షణాలు ఏమాత్రం లేవని, హెచ్1ఎన్1 వైరస్ లక్షణాలు ఉన్నట్లు భావిస్తున్నారు. కోవిడ్-19 వైరస్ స్వైన్‌ఫ్లూకి దగ్గరగా ఉన్నట్టు సింగపూర్ మినిస్టర్ ఫర్ నేషనల్ డెవలప్‌మెంట్ లారెన్స్‌ఓంగ్ తెలిపారు. ఇది సార్స్ కన్నా అత్యంత వేగంగా ఇతరులకు సోకే ప్రమాదం ఉందని జాతీయ అంటువ్యాధుల కేంద్రం (ఎన్‌సీఐడీ) పరిశోధకులు వెల్లడించారు.

### మాస్క్‌ల తయారీలో బడా కంపెనీలు

కోవిడ్ వైరస్‌పై యుద్ధం ప్రకటించిన చైనా బాధితుల కోసం పది రోజుల్లో 1,000 పడకల ఆసుపత్రిని సిద్ధం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ పరికరాలు, ఐఫోన్లు, ఐపాడ్‌లు తయారుచేసే ఫాక్స్‌కాన్ కంపెనీ తన ఉత్పత్తులను నిలిపివేసి, కోవిడ్ వైరస్ వ్యాప్తిని అడ్డుకునే మాస్క్‌ల తయారీని చేపట్టింది. ఈ నెల చివరి నాటికి రోజుకి 20 లక్షల మాస్కులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అమెరికా దిగ్గజ కార్ల తయారీ సంస్థ జనరల్ మోటార్స్(జీఎం) కూడా రోజుకు 17 లక్షల మాస్క్‌లను తయారు చేయనున్నట్టు ప్రకటించింది.



# ఐటీ ఉచ్చులో అవినీతి చక్రవర్తి

## చంద్రబాబు అవినీతి బాగోతంలో 'స్వల్ప' భాగం వెలికితీత

సాక్షి, అమరావతి

తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడి అవినీతి బాగోతంలో స్వల్ప భాగం.. రూ.2,000 కోట్లకుపైగా నల్లధనాన్ని గుర్తించినట్లుగా గురువారం ఐటీ శాఖ కార్యదర్శి సురభి అహ్లూవాలియా విడుదల చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రధాన కాంట్రాక్టర్ల నుంచి బోగస్ సబ్ కాంట్రాక్టర్ల ద్వారా కమీషన్ల రూపంలో కొల్లగొట్టిన ప్రజాధనాన్ని 'హవాలా' వ్యాపారి హసన్ అలీ ద్వారా సింగపూర్‌కు తరలించి... అక్కడి నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రూపంలో సన్నిహితుడికి చెందిన సంస్థకు రప్పించి, చంద్రబాబు జేబులో వేసుకున్న తీరు వెలుగులోకి వచ్చింది. చంద్రబాబు రూ.2,000 కోట్లకుపైగా దోపిడీ చేసినట్లు గతంలో ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా(పీఎస్) పని చేసిన పెండ్యాల శ్రీనివాస్ డైరీల ఆధారంగానే వెల్లడైంది. ఇది ఆంధ్రా అనకొండ చంద్రబాబు అవినీతి చరిత్రలో స్వల్ప భాగమని, మిగతా సన్నిహితులు, కోటరీ కాంట్రాక్టర్లపై ఐటీశాఖ దాడులు చేస్తే, అక్రమాల చరిత్ర మొత్తం బయటపడుతుందని, రూ.లక్షల కోట్ల నల్లధనం వెలుగులోకి వస్తుందని ట్యాక్సేషన్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



- హైదరాబాద్, విజయవాడ, కడప, విశాఖపట్నం, పూణే, ముంబయి తదితర ప్రాంతాల్లో 40 చోట్ల ఐటీ శాఖ ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకూ సోదాలు నిర్వహించింది.
- చంద్రబాబుకు పీఎస్‌గా పనిచేసిన పెండ్యాల శ్రీనివాస్.. బాబు తనయుడు నారా లోకేశ్ బినామీలు కిలారు రాజేష్, నరేన్ చౌదరి, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు ప్రత్తిపాటి శరత్ నివాసాలు, కార్యాలయాలపై ఐటీ సోదాల్లో రూ.2,000కోట్ల కమీషన్‌ల బాగోతం వెలుగు చూసింది.
- మూడు ప్రధాన కాంట్రాక్టు సంస్థలు.. బోగస్ సబ్ కాంట్రాక్టు సంస్థలు ఒకే ఐపీ చిరునామా నుంచి ఐటీ రిటర్నులు దాఖలు చేసి.. భారీ అక్రమాలకు పాల్పడటంపై ఐటీ శాఖ అధికారులే విస్తుపోయారు.
- బోగస్ సబ్ కాంట్రాక్టర్ల ద్వారా వసూలు చేసిన కమీషన్‌లను సింగపూర్‌కు తరలించి.. అక్కడి నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రూపంలో ఆర్వీఆర్ ప్రాజెక్ట్సుకు చేర్చి.. చంద్రబాబు తన జేబులో వేసుకోవడం సంచలనం రేపింది.
- మనీ ల్యాండరింగ్‌కు పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగింది. పెండ్యాల శ్రీనివాస్ ఇంట్లో లభ్యమైన డైరీల ఆధారంగా ఐటీ శాఖ విచారణను ముమ్మరం చేయడం.. ఈడీ, జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగాలు దర్యాప్తునకు సిద్ధమవడంతో మూడు రోజులుగా వ్యక్తిగత లాయర్లు, ఆడిటర్లతో చంద్రబాబు ఎడతెగని మంతనాలు జరుపుతున్నారు.
- తన అవినీతి బాగోతంపై జాతీయ మీడియా ప్రశ్నిస్తున్నా చంద్రబాబు నోరు మెదపకపోవడం గమనార్హం.

epaper.sakshi.com

“ ఒకటి రెండు వన్డేలలో విఫలమైనంత మాత్రాన బుమ్రా సామర్థ్యాన్ని శంకిస్తారా? అసలు నాలుగు మ్యాచ్‌లకే ఒక ఆటగాడి ప్రదర్శనపై చర్చ జరగడం ఏమిటి? బుమ్రా అద్భుత ప్రదర్శనలు, అతను గెలిపించిన మ్యాచ్‌లను అప్పుడే మరచిపోయారా? భారత్ తరఫున అతను సాధించిన ఘనతలు ఎవరికీ గుర్తుకు రాలేదా? బుమ్రా గాయం నుంచి కోలుకొని తిరిగొచ్చాడనే విషయం మరచిపోవద్దు. క్రికెటర్లను విమర్శించడం, సంపాదించుకోవడం కొందరికి వృత్తి కావచ్చు. కానీ ఒక ఆటగాడిగా అతడి పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. ప్రతీ ఆటగాడు ఎప్పుడో ఒక సమయంలో గాయాలపాలవుతాడు. అతడిని విమర్శించకుండా సానుకూలంగా మాట్లాడితే మంచిది.

–షమీ భారత బౌలర్

# సూపర్ షమీ... భళా బుమ్రా...

**ఆకట్టుకున్న భారత పేస్ బౌలర్లు • న్యూజిలాండ్ ఎలెవన్ 235 ఆలౌట్ • రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 59/0**



షమీ బుమ్రా

*ప్రాక్టీస్ పోరులో మన బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారని ఆందోళన చెందిన చోట మన పేస్ బౌలర్లు తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో సత్తా చాటారు. ఎర్ర బంతితో ఎప్పటిలాగే షమీ చెలరేగిపోగా, పరిమిత ఓవర్ల సిరీస్‌లో పదును చూపించలేకపోయిన బుమ్రా కూడా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను పడగొట్టాడు. టెస్టు తుది జట్టులో స్థానం కోసం పోటీ పడుతున్న ఉమేశ్, సైనీలకు కూడా వికెట్లు దక్కాయి. మొత్తంగా ప్రాక్టీస్ మ్యాచ్‌లో మన పేసర్లకు సరైన సాధన లభించింది. తొలి ఇన్నింగ్స్ వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకొన్న మన ఓపెనర్లు రెండో ఇన్నింగ్స్‌లో చక్కటి బ్యాటింగ్ చూపించడం కూడా ఊరటే.*

**హామిల్టన్:** ప్రాక్టీస్ మ్యాచ్‌లో తొలి రోజు బ్యాటింగ్‌లో విఫలమైన భారత జట్టు రెండో రోజు బౌలింగ్‌లో సత్తా చాటింది. ఫలితంగా న్యూజిలాండ్ ఎలెవన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 74.2 ఓవర్లలో 235 పరుగులకే ఆలౌటైంది. భారత్‌కు 28 పరుగుల ఆధిక్యం లభించింది. కివీస్ తరఫున హెన్రీ కూపర్ (68 బంతుల్లో 40; 6 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... రచిన్ రవీంద్ర (67 బంతుల్లో 34; 7 ఫోర్లు), డారైల్ మిషెల్ (65 బంతుల్లో 32; 5 ఫోర్లు), టామ్ బ్రూస్ (34 బంతుల్లో 31; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో మొహమ్మద్ షమీ 17 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టగా...బుమ్రా, ఉమేశ్, సైనీ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 7 ఓవర్లలో 59 పరుగులు చేసింది. పృథ్వీ షా (25 బంతుల్లో 35 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్), మయాంక్ అగర్వాల్ (17 బంతుల్లో 23 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్) క్రీజ్‌లో ఉన్నారు. ఓవరాల్‌గా భారత్ ఆధిక్యం 87 పరుగులకు చేరింది.

### కూపర్ మినహా...

న్యూజిలాండ్ ఎలెవన్ తరఫున ఒక్క అర్ధ సెంచరీ కూడా నమోదు కాలేదు. రెండో రోజు కూడా బౌన్స్, స్వింగ్‌కు అనుకూలించిన పిచ్‌ను భారత బౌలర్లు చక్కగా ఉపయోగించుకున్నారు.

బుమ్రా తన రెండో ఓవర్లోనే యంగ్ (2)ను అవుట్ చేసి శుభారంభం అందించగా, సీఫెర్ట్ (9)ను షమీ వెనక్కి పంపించాడు. ఈ దశలో రవీంద్ర, అలెన్ కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేసినా అది ఎక్కువ సేపు సాగలేదు. మరో ఎండ్‌లో కూపర్ మాత్రం కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. ఐదో వికెట్‌కు కూపర్, బ్రూస్ కలిసి 51 పరుగులు జోడించడమే కివీస్ జట్టులో పెద్ద భాగస్వామ్యం. వీరిద్దరు 20 పరుగుల వ్యవధిలో వెనుదిర‌గ్గా... సీనియర్ ఆటగాడు నీషమ్ (1)ను చక్కటి బంతితో షమీ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత లోయర్ ఆర్డర్ మొత్తం కలిసి 74 పరుగులు జోడించడంతో జట్టు స్కోరు 200 పరుగులు దాటింది.

### ఓపెనర్ల జోరు...

తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన భారత ఓపెనర్లు ఈసారి ఎలాంటి తప్పు చేయలేదు. దూకుడైన షాట్లతో పృథ్వీ షా, మయాంక్ వేగంగా పరుగులు రాబట్టారు. రెండో రోజు చివరకు వచ్చేసరికి పిచ్ కాస్త నెమ్మదించి బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం కూడా వీరికి కలిసొచ్చింది. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో తామిద్దరిని అవుట్ చేసిన కుగ్‌లీన్ బౌలింగ్‌లో విరుచుకుపడిన వీరిద్దరు 3 ఓవర్లలోనే 34 పరుగులు బాదారు. భారత్ ఇన్నింగ్స్ 8.42 రన్‌రేట్‌తో సాగడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లాగే మరో సారి ఓపెనర్లుగా పృథ్వీ, మయాంక్‌లనే పంపడం చూస్తే తొలి టెస్టులో వీరిద్దరినే ఆడించే ఆలోచనతో టీమ్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు కనిపిస్తోంది. అదే జరిగితే టెస్టు అరంగేట్రం కోసం శుబ్‌మన్ గిల్ మరికొంత కాలం వేచి చూడక తప్పదు.

### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 263; న్యూజిలాండ్ ఎలెవన్ తొలి ఇన్నింగ్స్: యంగ్ (సి) పంత్ (బి) బుమ్రా 2; రవీంద్ర (సి) పంత్ (బి) ఉమేశ్ 34; సీఫెర్ట్ (సి) పంత్ (బి) షమీ 9; అలెన్ (బి) బుమ్రా 20; కూపర్ (సి) మయాంక్ (బి) షమీ 40; బ్రూస్ (బి) సైనీ 31; మిషెల్ (సి) పృథ్వీ షా (బి) ఉమేశ్ 32; నీషమ్ (బి) షమీ 1; క్లీవర్ (బి) సైనీ 13; కుగ్‌లీన్ (నాటౌట్) 11; సోధి (సి) పుజారా (బి) అశ్విన్ 14; ఎక్స్‌ట్రాలు 28; మొత్తం (74.2 ఓవర్లలో ఆలౌట్) 235. **వికెట్ల పతనం:** 1–11; 2–36; 3–70; 4–82; 5–133; 6–155; 7–161; 8–204; 9–213; 10–235. బౌలింగ్: బుమ్రా 11–3–18–2; ఉమేశ్ 13–1–49–2; షమీ 10–5–17–3; సైనీ 15–2–58–2; అశ్విన్ 15.2–2–46–1; జడేజా 10–4–25–0.

**భారత్ రెండో ఇన్నింగ్స్:** పృథ్వీ షా (బ్యాటింగ్) 35; మయాంక్ అగర్వాల్ (బ్యాటింగ్) 23; ఎక్స్‌ట్రాలు 1; మొత్తం (7 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 59 **బౌలింగ్:** టిక్‌నెర్ 3–0–19–0; కుగ్‌లీన్ 3–0–34–0; జాన్‌స్టన్ 1–0–6–0.

## మార్చి 29 నుంచి ఐపీఎల్

**తొలి మ్యాచ్‌లో చెన్నైతో ముంబై ‘ఢీ’**

**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2020 షెడ్యూల్ విడుదలైంది. మార్చి 29న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్, గత ఏడాది రన్నరప్ చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడుతుంది. ప్రస్తుతానికి లీగ్ మ్యాచ్‌ల షెడ్యూల్‌నే విడుదల చేయగా, నాకౌట్ మ్యాచ్‌ల వివరాలను తర్వాత ప్రకటిస్తారు. మే 17న ఆఖరి లీగ్ మ్యాచ్ జరుగుతుంది. అయితే ఫైనల్ మాత్రం మే 24న నిర్వహించడం ఖాయమైంది. గతంతో పోలిస్తే ఈ సారి ‘డబుల్ హెడర్’ మ్యాచ్‌ల (ఒకే రోజు 4 గంటలకు, 8 గంటలకు రెండు మ్యాచ్‌లు) సంఖ్యను బాగా తగ్గించారు. ఇప్పుడు తొలి రోజు, చివరి రోజు మినహాయించి మిగిలిన ఆదివారాల్లో మాత్రమే డబుల్ హెడర్‌లు జరుగుతాయి. దాంతో లీగ్ దశ రోజుల సంఖ్య పెరిగింది. ఇప్పటి వరకు 44 రోజుల్లో లీగ్ మ్యాచ్‌లను ముగిస్తుండగా, ఇప్పుడు అది 50 రోజులు కానుంది. మరోవైపు రాజస్తాన్ మినహా మిగిలిన ఏడు ఐపీఎల్ జట్లన్నీ తమ సొంత వేదికలను కొనసాగించనున్నాయి. రాజస్తాన్ మాత్రం జైపూర్‌తో పాటు రెండు మ్యాచ్‌లను గువాహటి వేదికగా నిర్వహించాలని నిర్ణయించుకుంది. అయితే ఇలా రెండో నగరాన్ని హోం గ్రౌండ్‌గా వాడుకోవడం కుదరదంటూ రాజస్తాన్ క్రికెట్ సంఘం కోర్టులో కేసు దాఖలు చేసింది.

**ఏప్రిల్ 1 నుంచి హైదరాబాద్‌లో...:** సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తమ ‘హోం’ మ్యాచ్‌లను ఎప్పటిలాగే ఉప్పల్ స్టేడియంలో ఆడనుంది. హైదరాబాద్‌లో ఈ ఏడు మ్యాచ్‌లు ఏప్రిల్ 1, 12, 16, 26, 30, మే 5, 12 తేదీల్లో జరుగుతాయి. ఇతర వేదికల్లో ఏప్రిల్ 4, 7, 19, 21, మే 3, 9, 15 తేదీల్లో సన్‌రైజర్స్ తమ మ్యాచ్‌లు ఆడుతుంది.

## వారంలో రెండో ప్రపంచ రికార్డు



**గ్లాస్గో (స్కాట్లాండ్):** స్వీడన్‌కు చెందిన పోల్‌వాల్టర్ అర్మాండ్ డుప్లాంటిస్ వారం వ్యవధిలో రెండోసారి ప్రపంచ రికార్డు సృష్టించాడు. శనివారం జరిగిన మిల్లర్ ఇండోర్ గ్రాండ్‌ప్రి మీట్‌లో పోల్‌వాల్ట్ ఈవెంట్‌లో డుప్లాంటిస్ 6.18 మీటర్ల ఎత్తుకు ఎగిరి.... గతవారం 6.17 మీటర్లతో తానే నెలకొల్పిన ప్రపంచ రికార్డును తిరగరాశాడు. కొత్త ప్రపంచ రికార్డు సృష్టించినందుకు డుప్లాంటిస్‌కు 30 వేల డాలర్లు (రూ. 21 లక్షల 46 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

## రన్నరప్ పేస్ జంట



రన్నరప్, విన్నర్స్ ట్రోఫీలతో మాథ్యూ ఎబ్డెన్, లియాండర్ పేస్, రామ్‌కుమార్, పురవ్ రాజా (ఎడమ నుంచి)

**బెంగళూరు:** ఈ ఏడాది తన ప్రొఫెషనల్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పనున్న భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ స్వదేశంలో ఆడిన చివరి టోర్నీలో టైటిల్ అందుకోలేకపోయాడు. బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో పేస్–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో పేస్–ఎబ్డెన్ ద్వయం 0–6, 3–6తో రామ్‌కుమార్ రామనాథన్–పురవ్ రాజా (భారత్) జోడీ చేతిలో ఓడిపోయింది. 55 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో రామ్–పురవ్ జంట తమ ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. విజేత రామ్–పురవ్‌లకు 9,300 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 6 లక్షల 65 వేలు)తోపాటు 125 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

## టోక్యో ఒలింపిక్స్‌కు అథ్లెట్ భావన అర్హత

**మహిళల 20 కి.మీ. నడకలో కొత్త రికార్డు**



**రాంచీ:** అందరి అంచనాలు తారుమారు చేస్తూ రాజస్తాన్‌కు చెందిన మహిళా అథ్లెట్ భావన జాట్ 20 కిలోమీటర్ల నడక విభాగంలో టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. శనివారం జరిగిన జాతీయ రేస్ వాక్ చాంపియన్‌షిప్‌లో 23 ఏళ్ల భావన... 20 కిలోమీటర్ల దూరాన్ని గంటా 29 నిమిషాల 54 సెకన్లలో పూర్తి చేసి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పడంతో పాటు టోక్యో ఒలింపిక్స్ అర్హత ప్రమాణాన్ని (1గం:31ని:00 సెకన్లు) అధిగమించింది. ఇంతకు ముందు ఢిల్లీకి చెందిన బేబీ సౌమ్య (1గం:31ని:29 సెకన్లు) పేరిట జాతీయ రికార్డు ఉండేది.

## హంపి, హారిక గేమ్‌లు ‘డ్రా’

**సెయింట్ లూయిస్ (అమెరికా):** కెయిన్స్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు హంపి, హారికలు ఏడో రౌండ్ గేమ్‌లను ‘డ్రా’గా ముగించారు. ఇరీనా క్రష్ (అమెరికా)తో హంపి 52 ఎత్తుల్లో... కరీస్సా యిప్ (అమెరికా)తో హారిక 43 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకున్నారు. ఏడో రౌండ్ తర్వాత హంపి, జూ వెన్‌జున్ (చైనా) 4.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

## మళ్లీ కాంస్యంతో సరి



లక్ష్య సేన్

- ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్ సెమీస్‌లో భారత్ పరాజయం
- ఆసియా క్రీడల చాంపియన్ జొనాథన్ క్రిస్టీపై లక్ష్య సేన్ విజయం

**మనీలా (ఫిలిప్పీన్స్):** ప్రతిష్టాత్మక ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరే అవకాశాన్ని భారత్ రెండోసారి చేజార్చుకుంది. డిఫెండింగ్ చాంపియన్ ఇండోనేసియాతో శనివారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 2–3తో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. 2016లోనూ భారత పురుషుల జట్టు సెమీఫైనల్లో ఇండోనేసియా చేతిలో ఓటమిపాలై కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఆంథోని జిన్‌టింగ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ సాయిప్రణీత్ తొలి గేమ్‌ను 6–21తో చేజార్చుకున్నాక గాయం కారణంగా వైదొలిగాడు. అనంతరం రెండో సింగిల్స్‌లో లక్ష్య సేన్ అద్భుతంగా ఆడి 21–18, 22–20తో ఆసియా క్రీడల చాంపియన్, ప్రపంచ ఏడో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీని బోల్తా కొట్టించాడు. దాంతో భారత్ 1–1తో స్కోరును సమం చేసింది. మూడో మ్యాచ్‌లో అహసాన్–సెతియవాన్ (ఇండోనేసియా) ద్వయం 21–10, 14–21, 23–21 అర్జున్–ధ్రువ్ కపిల జంటను ఓడించింది. నాలుగో మ్యాచ్‌లో శుభాంకర్ డే 21–17, 21–15తో రుస్తావిటోను ఓడించడంతో స్కోరు 2–2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్ జంట గిడియోన్–సుకముల్జో 21–6, 21–13తో లక్ష్య సేన్–చిరాగ్ శెట్టి జోడీని ఓడించి ఇండోనేసియాకు 3–2తో విజయాన్ని అందించింది.

## 2 పరుగులతో...

**రెండో టి20లో ఇంగ్లండ్ విజయం**



టామ్ కరన్

**డర్బన్:** తొలి టి20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఒక పరుగు తేడాతో ఓడిన ఇంగ్లండ్ ఈసారి 2 పరుగులతో గెలిచి బదులు తీర్చుకుంది. ఈ మ్యాచ్‌లో చివరి ఓవర్లో దక్షిణాఫ్రికా విజయానికి 15 పరుగులు చేయాల్సి ఉండగా... 12 పరుగులు వచ్చాయి. టామ్ కరన్ వేసిన ఈ ఓవర్లో సఫారీ బ్యాట్స్‌మన్ ప్రిటోరియస్ తొలి నాలుగు బంతుల్లో ఫోర్, సిక్స్ సహా 12 పరుగులు రాబట్టాడు. చివరి 2 బంతుల్లో 3 పరుగులు చేయడం లాంఛనమే అనిపించినా... వరుస బంతుల్లో ప్రిటోరియస్, ఫార్చ్యూన్‌లను అవుట్ చేసి టామ్ కరన్ ఇంగ్లండ్‌ను గెలిపించాడు. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. బెన్ స్టోక్స్ (30 బంతుల్లో 47 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), జేసన్ రాయ్ (29 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ మొయిన్ అలీ (11 బంతుల్లో 39; 3 ఫోర్లు, 4 సిక్సర్లు), బెయిర్‌స్టో (17 బంతుల్లో 35; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్లకు 202 పరుగులు చేసింది. డి కాక్ (22 బంతుల్లో 65; 2 ఫోర్లు, 8 సిక్సర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. సిరీస్‌లో ఇరు జట్లు 1–1తో సమంగా నిలవగా...చివరి టి20 నేడు సెంచూరియన్‌లో జరుగుతుంది.

## ఐదేళ్ల తర్వాత...

- రంజీ ట్రోఫీలో నాకౌట్ దశకు ఆంధ్ర
- చివరి లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో పరాజయం
- క్వార్టర్ ఫైనల్లో సౌరాష్ట్రతో ‘ఢీ’



ఆంధ్ర జట్టు కెప్టెన్ శ్రీకర్ భరత్

**సాక్షి, విజయవాడ స్పోర్ట్స్:** మాజీ చాంపియన్ గుజరాత్‌తో జరిగిన చివరిదైన ఎనిమిదో లీగ్ మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ... రంజీ ట్రోఫీ టోర్నమెంట్‌లో ఆంధ్ర క్రికెట్ జట్టు నాకౌట్ దశకు (క్వార్టర్ ఫైనల్స్) అర్హత సాధించింది. నడియాడ్‌లో శనివారం ముగిసిన మ్యాచ్‌లో ఆంధ్ర ఎనిమిది వికెట్ల తేడాతో గుజరాత్ చేతిలో ఓటమి పాలైంది. ఆట చివరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 216/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 113.4 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. గుజరాత్ బౌలర్ అక్షర్ పటేల్ 92 పరుగులిచ్చి 7 వికెట్లు తీశాడు. అనంతరం 30 పరుగుల విజయలక్ష్యాన్ని గుజరాత్ రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో గుజరాత్ 18 జట్లున్న ఎలైట్ గ్రూప్ ‘ఎ అండ్ బి’లో 35 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఎలైట్ ‘ఎ అండ్ బి’ గ్రూప్ నుంచి బెంగాల్ (32 పాయింట్లు), కర్ణాటక (31 పాయింట్లు), సౌరాష్ట్ర (31 పాయింట్లు), ఆంధ్ర (27 పాయింట్లు) జట్లు కూడా క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. ఆంధ్ర జట్టు రంజీ ట్రోఫీలో నాకౌట్ దశకు చేరడం ఇది నాలుగోసారి. గతంలో ఆంధ్ర జట్టు కె.ఎస్. భాస్కర మూర్తి సారథ్యంలో 1985–86 సీజన్‌లో... ఎమ్మెస్కే ప్రసాద్ కెప్టెన్సీలో 2001–02 సీజన్‌లో... మొహమ్మద్ కైఫ్ నాయకత్వంలో 2014–15 సీజన్‌లో క్వార్టర్ ఫైనల్‌కు అర్హత పొందింది. అయితే ఈ మూడు పర్యాయాలూ ఆంధ్ర పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. ఈనెల 20 నుంచి 24 వరకు ఒంగోలు వేదికగా జరిగే క్వార్టర్ ఫైనల్లో సౌరాష్ట్రతో ఆంధ్ర జట్టు ఆడుతుంది.

ఈ సీజన్‌లో ఆంధ్ర జట్టు మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడి నాలుగింటిలో గెలిచింది. రెండింటిని ‘డ్రా’ చేసుకొని మరో రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఈ సీజన్‌లో హనుమ విహారి, రికీ భుయ్, శ్రీకర్ భరత్‌లు ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌లుగా వ్యవహరించారు. మరోవైపు హైదరాబాద్ జట్టు డిఫెండింగ్ చాంపియన్ విదర్భతో చివరి మ్యాచ్‌ను ‘డ్రా’గా ముగించింది. కేవలం ఏడు పాయింట్లతో అట్టడుగున నిలిచి వచ్చే ఏడాది గ్రూప్ ‘సి’కి పడిపోయింది. గ్రూప్ ‘సి’లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జమ్మూ కశ్మీర్, ఒడిశా జట్లు వచ్చే ఏడాది ఎలైట్ ‘ఎ అండ్ బి’ గ్రూప్‌కు ప్రమోట్ అయ్యాయి. ‘సి’లో చివరి స్థానంలో నిలిచిన ఉత్తరాఖండ్ ప్లేట్ డివిజన్‌కు పడిపోయింది. ప్లేట్ డివిజన్‌లో అగ్రస్థానంలో నిలిచిన గోవా జట్టు గ్రూప్ ‘సి’కి ప్రమోట్ అయ్యింది. ‘ఈ సీజన్‌లో జట్టులోని ప్రతి సభ్యుడు తీవ్రంగా కష్టపడ్డాడు. వారికి సహాయక సిబ్బంది కూడా తమ వంతుగా ప్రోత్సాహం అందించింది. నాకౌట్ మ్యాచ్‌లోనూ ఆంధ్ర జట్టు మంచి ప్రదర్శన చేసి ముందంజ వేయాలి. ఆంధ్ర క్రికెట్ సంఘానికి మరింత పేరు తేవాలి. సౌరాష్ట్రతో జరిగే మ్యాచ్ కోసం అందరికీ బెస్టాఫ్ లక్’ అని ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) సెక్రటరీ వి.దుర్గా ప్రసాద్ తెలిపారు.

| క్వార్టర్ ఫైనల్స్ షెడ్యూల్ |
| --- |
| ఫిబ్రవరి 20 నుంచి 24 వరకు |
| ఆంధ్ర X సౌరాష్ట్ర (ఒంగోలు) |
| కర్ణాటక X జమ్మూ కశ్మీర్ (జమ్మూ) |
| బెంగాల్ X ఒడిశా (కటక్) |
| గుజరాత్ X గోవా (వల్సాద్) |

## ఇషాంత్ శర్మ ఫిట్

**న్యూజిలాండ్ వెళ్లనున్న భారత పేస్ బౌలర్**



ఫిజియో కౌశిక్‌తో ఇషాంత్

**ముంబై:** న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టుకు శుభవార్త! గాయం నుంచి కోలుకున్న సీనియర్ ఫాస్ట్ బౌలర్ ఇషాంత్ శర్మ శనివారం ఫిట్‌నెస్ పరీక్షలో సఫలమయ్యాడు. దాంతో అతను న్యూజిలాండ్ వెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని బీసీసీఐ వర్గాలు ధ్రువీకరించాయి. ఆదివారం ఇషాంత్ నేరుగా తొలి టెస్టు వేదిక అయిన వెల్లింగ్టన్‌కు బయల్దేరతాడు. విదర్భతో రంజీ ట్రోఫీ మ్యాచ్ సందర్భంగా జనవరి 21న ఇషాంత్ కాలికి గాయమైంది. ఎంఆర్‌ఐ స్కాన్‌లో ‘గ్రేడ్ త్రీ టియర్’గా తేలింది. అతనికి కనీసం ఆరు వారాల విశ్రాంతి, పునరావాస చికిత్స అవసరమని వైద్యులు తేల్చారు. దాంతో జాతీయ క్రికెట్ అకాడమీ చేరుకున్న ఇషాంత్ అక్కడే ఫిట్‌గా మారాడు. ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ అయిన అనంతరం ఇందుకు సహకరించిన ఫిజియో ఆశిష్ కౌశిక్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పాడు. కివీస్‌తో రెండు టెస్టుల సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో ముందు జాగ్రత్తగా బీసీసీఐ సెలక్టర్లు ఇషాంత్ పేరును కూడా చేర్చారు. అతను ఫిట్‌నెస్ పరీక్షలో సఫలమైతే టీమిండియాతో చేరతాడని ప్రకటించారు. 13 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 96 టెస్టులు ఆడిన ఇషాంత్ ‘సెంచరీ’కి కేవలం నాలుగు టెస్టుల దూరంలో ఉన్నాడు. అతను వంద టెస్టుల మైలురాయిని చేరుకుంటే కపిల్ దేవ్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారత పేస్ బౌలర్‌గా నిలుస్తాడు.

## గురు నాయుడుకు కాంస్య పతకం



**సాక్షి, విజయవాడ స్పోర్ట్స్:** ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ ఎస్.గురు నాయుడు కాంస్య పతకాన్ని సాధించాడు. ఉజ్బెకిస్తాన్‌లో జరుగుతున్న ఈ ఈవెంట్‌లో విజయనగరం జిల్లా లిఫ్టర్ గురు నాయుడు యూత్ బాలుర 49 కేజీల విభాగంలో మూడో స్థానంలో నిలిచాడు. గురు నాయుడు మొత్తం 177 కేజీలు (స్నాచ్‌లో 77+క్లీన్ అండ్ జెర్క్‌లో 100) బరువెత్తాడు.



# 11 మోటార్ల రన్

- లక్ష్మీ పంపుహౌస్‌లో మొత్తం మోటార్లు రన్ చేయడం ఇదే మొదటిసారి
- 100 ఫుల్ రిజర్వాయర్ లెవెల్‌కు నీటిమట్టం

**కాళేశ్వరం:** మేడిగడ్డలో మరో మహాద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు శనివారం సాయంత్రం లక్ష్మీ పంపు హౌస్‌లోని 11 మోటార్లను మూడు దఫాలుగా ఆన్ చేశారు. లక్ష్మీ పంపు హౌస్‌లోని మొత్తం మోటార్లు ఆన్ చేయడం ఇదే మొదటి సారి. 11 మోటార్లు రన్ చేసి 22 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. లక్ష్మీ బ్యారేజీ పూర్తి సామర్థ్యం 16.17 టీఎంసీలు కాగా, శనివారం రాత్రి 10 గంటల వరకు 16.02 టీఎంసీలతో ఫుల్ రిజర్వాయర్ లెవెల్‌కు నీరు చేరిందని ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా, లక్ష్మీబ్యారేజీ పూర్తి సామర్థ్యానికి చేరడంతో ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు, ఎస్ఈ రమణారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు బ్యారేజీ, లక్ష్మీ పంపుహౌస్‌ల వద్ద మకాం వేసి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. మోటార్లు రన్ చేయడంతో కీలకమైన మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీ పూర్తి నీటి సామర్థ్యంతో కళకళలాడుతోంది.

## నూతన ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలి

**ఐఐటీహెచ్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి**

**సాక్షి, సంగారెడ్డి:** విద్యార్థులు నూతన ఆవిష్కరణలపట్ల ఆసక్తి పెంచుకోవాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీహెచ్) హైదరాబాద్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది సమీపంలో గల ఐఐటీహెచ్‌లో నిర్వహిస్తున్న ఎలాన్–ఎన్ విజన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడే నూతన విషయాలను కనుగొనడానికి ఇంజనీరింగ్ విద్యార్థులు నిరంతర సాధన చేయాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగాన్నిచ్చే ఆవిష్కరణలు రూపొందించడం ద్వారా సమాజానికి మేలు కలుగుతుందని వివరించారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు. ఎలాన్–ఎన్ విజన్ 11వ ఎడిషన్ కార్యక్రమం విద్యార్థులు నూతనోత్సాహాన్ని ఇస్తున్నదని తెలిపారు.

## పెళ్లయిన కాసేపటికే వరుడు మృతి

**డీజే సౌండ్‌తో అస్వస్థత**

- ఇంటికి చేరుకోగానే గుండెనొప్పి
- ఆస్పత్రికి తరలింపు.. అప్పటికే తుదిశ్వాస



చందూర్ గణేష్

**బోధన్ టౌన్:** ఓ పెళ్లింట విషాదం నెలకొంది. పెళ్లయిన కాసేపటికే గుండెపోటుతో వరుడు మృతి చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్‌లో చోటు చేసుకుంది. పట్టణంలోని నాయీబ్రాహ్మణ గల్లీకి చెందిన చందూర్ గణేష్ (25)కు మండలంలోని సాలూర గ్రామానికి చెందిన మేనమామ కూతురు స్వప్నతో శుక్రవారం వివాహం జరిగింది. రాత్రి బరాత్ నిర్వహించారు. బాజాభజంత్రీలు, డీజే సౌండ్‌లు, స్నేహితుల డ్యాన్సుల మధ్య ఫంక్షన్ హాలు నుంచి రాత్రి 7 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు అర్ధరాత్రి 12 గంటల వరకు సాగింది. స్నేహితులతో కలసి పెళ్లి కొడుకు డ్యాన్స్ చేశాడు. వధూవరులు సంతోషంగా ఇంటికి చేరారు. ఆడపడుచులు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. అయితే.. డీజే సౌండ్‌తో గణేష్ అస్వస్థతకు గురయ్యాడు. ఇంటికి చేరుకున్న వరుడు దుస్తులు మార్చుకొని కూర్చోగానే గుండె నొస్తుందని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ గుండె పోటుకు చికిత్స చేసే పరికరాలు లేక పోవడంతో అక్కడి నుంచి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడా అదే పరిస్థితి ఉండటంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే గణేష్ మృతి చెందాడని తెలిపారు. గతంలో గణేష్‌కు ఒకసారి గుండెపోటు వచ్చి చికిత్స జరిగిందని స్థానికులు తెలిపారు. కాగా, పెళ్లయిన రోజే భర్త మృతితో నవ వధువు గుండెలు పగిలేలా రోదించడం, మృతదేహం వద్ద నిశ్చేష్టురాలై కూర్చోవడం అక్కడి వారిని కలచి వేసింది. ఇరు కుటుంబాల వారు కన్నీరు మున్నీరయ్యారు.

# కంది రైతుకు ఆన్‌లైన్ కష్టాలు!

**పంట కొనేందుకు మార్క్‌ఫెడ్ అధికారుల కొర్రీలు**

- వ్యవసాయ శాఖ అధికారుల తప్పుతో రైతులకు తిప్పలు
- వారం రోజులుగా సిద్దిపేట మార్కెట్‌లో నిరీక్షణ
- ఆందోళనకు దిగిన రైతులు

**సాక్షి, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామానికి చెందిన రైతు రవీందర్‌రెడ్డి తనకున్న ఎనిమిది ఎకరాల్లో కంది పంట సాగుచేశాడు. ఈ సారి పంట ఆశాజనకంగా ఉండటంతో 25 క్వింటాళ్ల కంది దిగుబడి వచ్చింది. వీటిని అమ్మేందుకు సిద్దిపేట మార్కెట్‌కు వచ్చాడు. ఇక్కడ మార్క్‌ఫెడ్ అధికారులు తేమశాతం ఎక్కువగా ఉందని, 12 శాతం కన్నా తక్కువ తేమ ఉంటే కొంటామనిచెప్పారు. దీంతోగత వారం రోజులుగా కందులు ఆరబోసిన రవీందర్‌రెడ్డి శుక్రవారం మార్క్‌ఫెడ్ అధికారులకు చూపించగా.. మీ పేరు ఆన్‌లైన్‌లో లేదు. అందువల్ల పంట కొనలేమని తేల్చి చెప్పారు. తన దగ్గర ఉన్న భూమి రికార్డులు, వ్యవసాయ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ చూపించినా కందులుకొనడంలేదని రవీందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

**కొనుగోలుకు ఆన్‌లైన్ కొర్రీ..**

రైతు పండించిన ప్రతీ గింజను మద్దతు ధరతో కొంటామని ప్రకటించిన అధికారులు ఇప్పుడు ఆన్‌లైన్ కొర్రీలు పెట్టి కందులు కొనడంలేదు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే రాష్ట్రంలో ఉన్న కంది పంటను కొనేందుకు నాఫెడ్ అధికారులు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా 4,70,000 క్వింటాళ్ల కందుల కొనుగోలు బాధ్యత మార్క్‌ఫెడ్ అధికారులకు అప్పగించారు. ఇందులో సిద్దిపేట జిల్లాలో 10 వేల క్వింటాళ్ల కందులను క్వింటాకు రూ. 5,800 మద్దతు ధరకు కొనాలనే లక్ష్యం పెట్టుకున్నారు. అయితే కందులను కొనే సందర్భంలో రైతుల పేర్లు, వారి సాగు వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్న వారివే కొంటామని మార్క్‌ఫెడ్ అధికారులు తేల్చి చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయని రైతుల పంటలను వెనక్కి పంపుతున్నారు. గతంలో పత్తి కొనుగోలు సందర్భంగా సీసీఐ అధికారులు కూడా ఇవే నిబంధనలు పెట్టారు. కానీ తర్వాత రైతు సాగు వివరాలు స్థానిక వ్యవసాశాఖ అధికారి, లేదా వ్యవసాయ విస్తరణ అధికారి ధ్రువీకరించిన పత్రం తీసుకువస్తే తిరిగి కొన్నారు. కానీ ఇప్పుడు మార్క్‌ఫెడ్ అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా ఆన్‌లైన్‌లో పేరు ఉంటే కానీ కొనమని తేల్చి చెబుతున్నారు. దీంతో ఆగ్రహించిన రైతులు సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, సిద్దిపేట, బెజ్జంకి, చేర్యాల ప్రాంతాల్లో ఆందోళన బాట పట్టారు. రోడ్లపై బైటాయించి నిరసన వ్యక్తంచేస్తున్నారు.

**అధికారుల తప్పు..**
**రైతులకు ముప్పు**

ఏ పంట ఎంతమేర వేశారు. ఎన్ని ఎకరాల్లో సాగుచేశారన్న అంశంపై వ్యవసాయ అధికారులు ఇచ్చిన జాబితాలో తప్పులు ఉండటంతో తమకు ఈ కష్టాలు వచ్చాయని రైతులు ఆరోపిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ ప్రధాన పంటగా, అంతర్ పంటగా 15,532 ఎకరాల్లో 20 వేల మందికి పైగా రైతులు కంది పంటను సాగుచేశారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ క్వింటాలుకు రూ. 5,800 ధర ఇస్తోంది. అదే ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలుకు రూ. 4 వేల నుండి రూ. 5 వేల వరకు మాత్రమే ధర పెడుతుండటంతో రైతులు మార్క్‌ఫెడ్‌కు అమ్మేందుకు పోటీ పడుతున్నారు. ఇదిలా ఉండగా కంది పంట సాగువివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే సమయంలో విడిగా వేసిందే లెక్కలోకి వచ్చిందని, అంతర పంటగా వేసిన కంది పంట వివరాలు రాలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు ధ్రువీకరించిన పత్రాల ఆధా రంగా మార్క్‌ఫెడ్ కందులు కొనుగోలు చేస్తే రైతులకు న్యాయం జరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

### రైతులకు చేదు అనుభవం

ఆరుగాలం కష్టపడి కంది పంటను పండించిన రైతులకు మార్కెట్‌లో చేదు అనుభవం ఎదురవుతోంది. వ్యవసాయ శాఖ అధికారులు చేసిన తప్పుల పుణ్యమా అని మార్క్ ఫెడ్ అధికారులు రైతుల నుంచి కందులు కొనడంలేదు. ముందుగా తేమశాతం సరిగా లేదంటూ ఇబ్బందులు.., తర్వాత ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు లేవని అధికారులు పంటను కొనేందుకు నిరాకరిస్తున్నారు. పలువురు రైతులు తమకు వ్యవసాయ భూమి ఉన్నట్లు పట్టాదారు పాస్‌పుస్తకాలు చూపించినా.. కంది పంటను సాగుచేసినట్లు అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తెచ్చినా అధికారులు ససేమిరా అనడంతో చేసేది లేక రైతులు ఆందోళన బాట పట్టారు. పండించిన ప్రతీ గింజను గిట్టుబాటు ధరకు కొంటామని ప్రకటన చేసిన అధికారులు, నాయకులు ఇప్పుడు స్పందించాలని, తమ పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



సిద్దిపేట మార్కెట్‌లో ఆరబోసిన కందులు

### ఆన్‌లైన్‌లో పేర్లు లేవని కొనడంలేదు



ఎకరం చెలకలో కంది పంటను సాగుచేశాను. ఐదు క్వింటాళ్ల కందులు పండాయి. అమ్ముదామని మార్కెట్‌కు తెచ్చాను. తేమ ఎక్కువగా ఉందంటే వారం రోజులుగా ఎండ పెట్టాను. తీరా ఇప్పుడు కొనమంటే మా పేర్లు ఆన్‌లైన్‌లో లేవని అధికారులు వెనకకు పంపించారు. బయట వ్యాపారులు తక్కువ ధరకు కొంటామని చెబుతున్నారు.

*కర్రె నర్సవ్వ, పుల్లూరు, సిద్దిపేట జిల్లా*




సిద్దిపేట మార్కెట్‌లో తమ భూమి పత్రాలు మార్క్‌ఫెడ్ అధికారులకు చూపిస్తున్న రైతులు

## వైద్య ఖర్చులు భరించలేక..

**కూతురిని గొంతునులిమి చంపిన తండ్రి**

- పోస్టుమార్టం రిపోర్టులో బయటపడిన నిజాలు
- మృతురాలు 8వ తరగతి కేజీబీవీ విద్యార్థి



రేణుక మృతదేహం

సదాశివపేట: వైద్య ఖర్చులు భరించలేక.. ఆ తర్వాత పెళ్లి ఖర్చులు భరించాల్సి వస్తుందని ఓ తండ్రి కన్నకూతురిని హత్య చేశాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి కథనంప్రకారం.. రవి నాయక్ స్వగ్రామం వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండలం జాంబాపూర్ తండా. బతుకుదెరువు కోసం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆత్మకూర్‌కు వచ్చి మేస్త్రీ పనులు చేస్తున్నాడు. నవాబుపేటలోని కేజీబీవీలో 8వ తరగతి చదువుతున్న కూతురు రేణుకకు జ్వరంగా ఉండటంతో అతను ఈనెల 12న బైక్‌పై ఆమెను ఆత్మకూర్ గ్రామానికి తీసుకువచ్చాడు. జ్వరం ఎక్కువైనందున చుట్టుపక్కల వారి సూచన మేరకు అదే రోజు రాత్రి చికిత్స కోసం రేణుకను సదాశివపేటకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాడు. అయితే కూతురుకు ఎప్పుడూ జ్వరం వస్తుందని, గత ఏడాదే చికిత్స కోసం రూ.20 వేలు ఖర్చు చేసినందున ఇప్పుడు ఆసుపత్రికి తీసుకెళ్తే ఎంత డబ్బు ఖర్చవుతుందోనని, ఒక వేళ ఖర్చుపెట్టి బాగు చేయించినా ఆమె పెళ్లి చేయాలంటే మళ్లీ డబ్బు కావాలి అని ఆలోచించాడు. ఈ క్రమంలో కూతురును గొంతునులిమి హత్య చేశాడు. తర్వాత ఏమీ ఎరగనట్లు.. కూతురుకు ఎక్కిళ్లు వచ్చి చనిపోయిందని భార్య చంద్రిబాయిని నమ్మించాడు. అంత్యక్రియలు చేయడానికి కూతురు శవాన్ని స్వంత గ్రామమైన వికారాబాద్ జిల్లా జాంబాపూర్ తండాకు తీసుకువెళ్లారు. అంతిమ సంస్కారం కార్యక్రమంలో మృతురాలు రేణుక గొంతుపై కమిలిన గాయాలు కనపడడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నివేదికలో హత్య చేసి చంపారని రావడం.. దీంతో రేణుక తండ్రిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా.. విషయం వెలుగులోకి వచ్చింది.

### నాలుగోరోజు ఆదాయం రూ.1.37 కోట్లు

**మేడారంలో కొనసాగుతున్న హుండీల లెక్కింపు**

హన్మకొండ కల్చరల్: మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతరకు సంబంధించిన హుండీల లెక్కింపు కొనసాగుతోంది. అందులో భాగంగా నాలుగో రోజు శనివారం 53 హుండీలను లెక్కించగా రూ.1.37 కోట్ల ఆదాయం వచ్చిందని ఈఓ రాజేందర్ తెలిపారు. మొత్తం 454 హుండీలకు ఇప్పటి వరకు 247 హుండీల లెక్కింపు పూర్తయింది. మూడు రోజుల పాటు జరిగిన లెక్కింపులో మొత్తం రూ.7 కోట్లు నమోదైందని వెల్లడించారు. ఈ నగదును ఆంధ్రాబ్యాంకులో జమ చేస్తామని ఈవో తెలిపారు.

## ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

**మంత్రి హరీశ్‌రావు**

**సాక్షి, సిద్దిపేట:** తెలంగాణను సంపూర్ణ ఆరోగ్య రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం ఆయన సిద్దిపేటలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్ల థియేటర్‌ను ప్రారంభించారు. అలాగే ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం, ఐసీయూ కేంద్రాన్ని మంత్రి పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో కంటి చూపు సమస్యతో బాధపడుతున్నవారి కోసం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో లక్షలాది మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని చెప్పారు. ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి జిల్లా కేంద్రంలో ఆపరేషన్లు చేయిస్తున్నామని చెప్పారు. ప్రతీవ్యక్తి ఆరోగ్య రికార్డు తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు ప్రైవేటుకు దీటుగా పనిచేస్తున్నాయని చెప్పడానికి పెరిగిన ఓపీలు, ఆపరేషన్లే నిదర్శనం అన్నారు. కాగా, ఆడంబరాలకు పోయి పెళ్లిళ్ల, పేరంటాల పేరిట ఎక్కువ మొత్తంలో ఆహార పదార్థాలు తయారు చేసి వాటిని తినేవారు లేకపోవడంతో వృథా చేస్తున్నారని, మిగిలిన పదార్థాలను బయట పారవేయడంతో చెడిపోయి వ్యాధులు ప్రబలుతున్నాయని హరీశ్‌రావు ఫంక్షన్ హాల్స్, హోటల్ యజమానుల సమావేశంలో చెప్పారు. ఎంత మందికి అవసరం ఉంటే అంతమందికే వండుకోవాలని సూచించారు. మిగిలితే పేదలకు పంపిణీ చేయాలన్నారు.



మాస్కు ధరించి ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న హరీశ్

## వీసా.. కైసా..!

- పాస్‌పోర్టు లేదు.. చేతిలో పైసలు లేవు
- స్వదేశానికి వచ్చేందుకు ఇబ్బందులు
- పట్టించుకోని ఎంబసీ
- దుబాయ్‌లో ఎగ్లాస్‌పూర్ వాసి ఇబ్బందులు



దుర్గయ్య

**సిరిసిల్ల:** బతుకు దెరువు కోసం దుబాయ్‌కి వెళ్లిన ఓ నిరుపేద కూలీ విజిటింగ్ వీసా మోసానికి గురై పన్నెండేళ్లుగా బందీ అయిన ఘటన ఇది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన దుర్గయ్య 2007లో దుబాయ్ వెళ్లాడు. గల్ఫ్ ఏజెంట్ కంపెనీ వీసా అని రూ.80 వేలు తీసుకుని విజిటింగ్ వీసా అంటగట్టాడు. ఆ వీసాపై దుబాయ్ వెళ్లిన దుర్గయ్యకు ఏజెంట్ చేసిన మోసం తెలిసిపోయింది. అప్పు చేసి వచ్చానని ఏదోలా దుబాయ్‌లోనే పని చేసి అప్పులు తీరాక వెళ్దామని, దొరికిన పనిచేశాడు. ఈ క్రమంలో వీసాలేని దుర్గయ్యకు అక్కడ అడుగడుగునా ఇబ్బందులు తప్పడం లేదు. ఇలా బతుకు దెరువు బాటలో బందీ అయిన దుర్గయ్య ఇంటికి వద్దామంటే చేతిలో పాస్‌పోర్టు, వీసా, చేతిలో డబ్బు లేక దిక్కులు చూస్తున్నాడు. దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని దుర్గయ్య పలుమార్లు సంప్రదించినా ఫలితం దక్కలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన శ్రీనివాస్ సాయంతో ఎంబసీ అధికారులను మరోసారి ఆశ్రయించాడు. దుర్గయ్యకు అవసరమైన న్యాయసలహాలు ఇప్పించడంతో దుర్గయ్య ఇంటికి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. కాగా, మంత్రి కేటీఆర్ చొరవ చూపి తను ఇంటికి వచ్చేందుకు సాయం చేయాలని దుర్గయ్య వేడుకున్నాడు.

# పడగ విప్పిన ప్రతీకారం

**టీఆర్ఎస్ నేత దారుణ హత్య**

- తల్వార్లు, కత్తులతో విచక్షణారహితంగా దాడి.. అక్కడికక్కడే మృతి
- కాంగ్రెస్ నేతలే చంపారని మృతుడి భార్య ఆరోపణ
- నిందితులను కఠినంగా శిక్షిస్తాం: మంత్రి జగదీశ్‌రెడ్డి



వెంకన్నయాదవ్ (ఫైల్)

**సూర్యాపేట రూరల్:** సూర్యాపేట మండలం యర్కారం గ్రామ మాజీ సర్పంచ్, టీఆర్ఎస్ నేత వెంకన్న యాదవ్ (39) దారుణ హత్యకు గురయ్యారు. సహకార ఎన్నికల నేపథ్యంలో ఇటీవల రెండు పక్షాల మధ్య ఘర్షణ జరగడంతో ప్రతీకార చర్యల్లో భాగంగా శనివారం తెల్లవారు జామున ప్రత్యర్థులు తల్వార్లు, కత్తులు, రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేసి హతమార్చారు. పోలీసుల కథనం ప్రకారం.. సహకార సంఘం ఎన్నికల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఓటర్లను కలుసుకునేందుకు వెంకన్నతో పాటు, అతని ప్రత్యర్థి వర్గానికి చెందిన కాంగ్రెస్ నేత వడ్డే ఎల్లయ్య అనుచరులు గ్రామంలో తిరిగారు. ఈ సందర్భంగా చింతలపాటి ఉపేందర్, చింతలపాటి జయరాజును కలిసేందుకు వెంకన్న తన అనుచరులైన చింతలపాటి మధు, కిరణ్, నవీన్, ప్రవీణ్‌లతో కలసి వెళ్లారు. అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత మార్గమధ్యలో ఎదురుపడ్డ ఇరు పార్టీలు నేతలు, అనుచరులు వాగ్వాదానికి దిగారు. ఇరవై నిమిషాల తర్వాత.. తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో వెంకన్నను వడ్డే ఎల్లయ్యతో పాటు అతని అనుచరులు 15 మందికి పైగా వెంబడించారు. కీడును శంకించిన వెంకన్న, మధు, ప్రవీణ్ పరుగెత్తి గ్రామంలోని వీరయ్య ఇంట్లోకెళ్లి ఓ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. వీరి వెంట ఉన్న కిరణ్, నవీన్ చెట్లల్లోకి పరారయ్యారు. ప్రవీణ్ ఇదే ఇంట్లో ఉన్న వంట గదిలో దాచుకున్నాడు. వెంకన్న తలదాచుకున్న ఇంటిని అప్పటికే గమనించిన వడ్డే ఎల్లయ్య, అతని అనుచరులు తల్వార్లు, కర్రలతో వెంకన్న, మధు దాచుకున్న గది తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. వెంకన్నయాదవ్ తలపై తల్వార్లతో విచక్షణా రహితంగా దాడిచేయడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. అదే గదిలో ఉన్న మధు పత్తి బస్తాల చాటున దాచుకోవడంతో నిందితుల కంటపడకుండా ఉన్నాడు. వెంకన్న మృతి చెందాడని నిర్ధారించుకున్న నిందితులు కారులో పరారయ్యారు. ఈ సంఘటనలో మధు ప్రాణాలతో బయట పడ్డాడు. అయితే ఈ ఘటనలో వడ్డే ఎల్లయ్య అనుచరుడు మిద్దె సైదులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. హత్య నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

**ఎల్లయ్య, అతని అనుచరులే చంపారు**

తన భర్తను గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వడ్డే ఎల్లయ్య, అతని అనుచరులు 15 మంది కలసి చంపారని వెంకన్నయాదవ్ భార్య నిర్మల ఏరియా ఆస్పత్రి వద్ద పోలీసులకు చెప్పారు. తన భర్త వెంట నమ్మకంగా ఉన్న మధు నమ్మించి మోసం చేశాడని పేర్కొన్నారు. మరో పక్క ఈ హత్యలో కాంగ్రెస్ నాయకుడు పటేల్ రమేశ్ రెడ్డి హస్తం కూడా ఉందని ఆమెతో పాటు బంధువులు ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

**మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ**

సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో మంత్రి జగదీశ్‌రెడ్డి, వెంకన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
రహదార్లు & భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
'e' NIT No. 24/EinC(R&B)/SR&CRN/DCE(R)/EE(RS)/DEE8/AEE11/2019-20; తేది: 14.02.2020
ఇంజనీర్ ఇన్ చీఫ్ (R&B) స్టేట్ రోడ్స్ & CRN 'e' NIT No. 24/EinC(R&B)/SR&CRN/DCE(R)/ EE(RS)/DEE8/AEE11/2019-20; తేది: 14.02.2020 ప్రకారం R&B వరంగల్ సర్కిల్‌లోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో DMFT నిధుల క్రింద ఒక (1) రోడ్డు పని మరియు R&B నిజామాబాద్ సర్కిల్‌లోని నిజామాబాద్ జిల్లా (3వ పిలుపు)లో కోర్‌నెట్ నాన్ ప్లాన్ క్రింద ఒక (1) పని కలిగిన రెండు (2) రోడ్డు పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్ ప్లేస్ అంటే www.tender.telangana.gov.in/ నుండి 19.02.2020న సా. 4.30 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 26.02.2020న సా. 4.00 గం.వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అంటే www.tender.telangana.gov.in/ లో చూడవచ్చును.
సం/- ఇంజనీర్ ఇన్ చీఫ్ (R&B) స్టేట్ రోడ్స్ & CRN
DIPR RO.No. 2448-DP/CL/ADVT/1/2019-20, Dt : 15.02.2020

తెలంగాణ ప్రభుత్వం
రహదార్లు & భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఇంజనీర్ ఇన్ చీఫ్ (R&B) స్టేట్ రోడ్స్ & CRN: NIT No. 2/PRP/DCE(R)/EE-R/DEE-2/AE-2/2020 (2వ పిలుపు) తేది: 13.02.2020
నాగర్ కర్నూలు జిల్లాలోని (R&B) డిపార్ట్‌మెంట్‌లో నాన్ ప్లాన్ స్కీమ్ క్రింద 2 (రెండు) రోడ్డు పనులు కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్ ప్లేస్ అంటే http://www.eprocurement.telangana.gov.in నుండి 18.02.2020న సా. 4.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 25.02.2020న సా. 4.00 గం.వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అంటే http://www.eprocurement.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- ఇంజనీర్ ఇన్ చీఫ్ (R&B) స్టేట్ రోడ్స్ & CRN
DIPR RO.No. 2451-DP/CL/ADVT/1/2019-20, Dt : 15.02.2020

ANDHRA PRADESH CENTRAL POWER DISTRIBUTION CORPORATION LIMITED
Corporate Office, Beside Government Polytechnic, ITI Road, Vijayawada - 520008
NOTIFICATION Dated: 16.02.2020
Applications are invited from eligible Candidates for filling up of the following posts (On contract basis) of APCPDCL, a Corporation wholly owned by the Government of Andhra Pradesh.
1) Company Secretary
2) Law Officer
3) Chartered Accountant
The details of eligibility criteria, other detailed Instructions and prescribed format may be viewed at APSPDCL website: www.apspdcl.in
Last Date for Submission of Application: 03-03-2020.
Place:Vijayawada, Date:16.02.2020 CHAIRMAN & MANAGING DIRECTOR



## రమణ్ సింగ్ (బీజేపీ)

రాష్ట్రం: ఛత్తీస్‌గఢ్
పదవీ కాలం: 15 ఏళ్ల 4 రోజులు



రాజకీయాల్లో మిస్టర్ క్లీన్ అన్న ఇమేజ్ సాధించడం అంత సులభమేమీ కాదు. అలాంటి ఇమేజ్‌తోనే నక్సల్స్ ప్రభావిత రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో 2003–18వరకు మూడుసార్లు హ్యాట్రిక్ విజయాలు సాధించారు రమణ్ సింగ్. బీజేపీకి పదిహేనేళ్ల పాటు వెన్నుదన్నుగా నిలిచారు.. ప్రజా పంపిణీ వ్యవస్థలో భారీగా సంస్కరణలు తీసుకువచ్చి ఆహార భద్రత కల్పించారు. నిరుపేదలకు, ముఖ్యంగా ఆదివాసీలకు కడుపు నిండా తిండి దొరకడంతో వారంతా రమణ్ సింగ్‌ను ఆప్యాయంగా చావాల్ బాబా అని పిలిచేవారు. ఆహారం, విద్య, ఆరోగ్య రంగాల్లో ఆయన ప్రవేశపెట్టిన పథకాలే ఛత్తీస్‌గఢ్ పరిపాలనను రమణీయంగా మార్చాయి. వ్యూహాత్మకంగా నక్సల్స్ అణిచివేత కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించేలా చర్యలు తీసుకున్నారు. అధికారం చేపట్టేనాటికి 7 వేల కోట్లు ఉన్న రాష్ట్ర బడ్జెట్‌ను 78 వేల కోట్లకు తీసుకువచ్చారు. ఆరోగ్య రంగంలో ముఖ్యమంత్రి స్వస్త బీమా యోజన ద్వారా ఏడాదికి రూ.30 కడితే చాలు ఉచితంగా ఆరోగ్య సేవలు అందించేవారు. శిశు మరణాల్ని అరికట్టారు. అయితే 2018కి ముందు ఎన్నికల్లో రమణ్ సింగ్‌పై పడిన అవినీతి మకిలి, కాంగ్రెస్ నుంచి విడిపోయి వేరు కుంపటి పెట్టిన అజిత్ జోగి పార్టీ బీజేపీ ఓట్లను చీల్చేయడంతో రమణ్ సింగ్ నాలుగోసారి అధికారం చేపట్టలేకపోయారు. కానీ ఇప్పటికీ రమణ్ సింగ్ పేరు ఆదివాసీల హృదయాల్లో మారు మోగుతూనే ఉంది.

## నరేంద్ర మోదీ (బీజేపీ)

రాష్ట్రం: గుజరాత్
పదవీ కాలం: 12 ఏళ్ల 226 రోజులు



2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ, తర్వాత ఏడాది జరిగిన గోద్రా మత ఘర్షణల మచ్చను జయించి మరీ హ్యాట్రిక్ సీఎంగా నిలిచారు. గుజరాత్ మోడల్ అభివృద్ధినే పెట్టుబడిగా పెట్టి 2014లో లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి ప్రధాని పగ్గాలు కూడా చేపట్టారు. ప్రస్తుతం దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో గుజరాత్ ఒకటిగా నిలిచిందంటే దానికి మోదీ ప్రవేశ పెట్టిన అభివృద్ధి పథకాలే కారణం. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు మోదీ మౌలిక రంగాల కల్పనలో అత్యధికంగా నిధులు వినియోగించారు. ఆర్థిక రంగాన్ని పరుగులు పెట్టించడంలో కొత్త ఒరవడి సృష్టించడంతో ఆయన అభిమానులు మోడీనామిక్స్‌కి తిరుగులేదని బ్రహ్మరథం పట్టారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి 5.1% ఉన్నదానిని మోదీ సీఎం అయ్యాక 16.6 శాతానికి చేర్చారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించడంతో నిరుద్యోగ సమస్య తొలగిపోయింది. భారీ ఎత్తున పెట్టుబడుల సదస్సులు నిర్వహించి పారిశ్రామిక రాయితీలు ఇచ్చారు. ఎవరైనా పరిశ్రమలను నెలకొల్పడానికి ముందుకు వస్తే చాలు, ప్రభుత్వ యంత్రాంగమే వారి దగ్గరకు పరుగులు తీసి ఆహ్వానించేది. అభివృద్ధి ఎంత జరిగిందో దానికి నీడలా దుర్భర దారిద్ర్యం కూడా నెలకొని ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయన్న విమర్శలున్నాయి. మాతా శిశు మరణాలు గుజరాత్‌లో అత్యధికమన్న వాదనా ఉంది.

## రూ.11,806 కోట్లతో
# అదనపు టీఎంసీ

**మిడ్‌మానేరుకు 1.10 టీఎంసీ పనులకు ప్రభుత్వం ఉత్తర్వులు**

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతమున్న రెండు టీఎంసీలకు అదనంగా మరో టీఎంసీ నీటిని ఎత్తిపోసే పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు రోజుకు మూడు టీఎంసీల నీటిని తీసుకునేలా పంప్‌హౌస్‌ల నిర్మాణం చేస్తున్న ప్రభుత్వం, శనివారం ఎల్లంపల్లి దిగువన మిడ్‌మానేరు వరకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోసే పనులకు రూ.11,806కోట్లతో పరిపాలనా అనుమతులిచ్చింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఎల్లంపల్లి నుంచి కొత్తగా 1.10 టీఎంసీ నీటిని తరలించేలా ఇప్పటికే ప్రణాళిక సిద్ధంచేశారు. రెండు పంప్‌హౌస్‌లను నిర్మించి, దేవికొండ రిజర్వాయర్ ద్వారా వరద కాల్వ నుంచి నీటిని మిడ్‌మానేరుకు తరలించేలా ప్రతిపాదించారు. మూడు టీఎంసీల మేర నీటిని తరలించడానికి ఇందిరమ్మ వరద కాల్వను మరింత వెడల్పు చేయాలని నిర్ణయించారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మొత్తం పనులను 4 లేదా 6 ప్యాకేజీలుగా విభజించి మూడు నాలుగు రోజుల్లో టెండర్లు పిలవనున్నారు. ఇక గోదావరి నదిపై 37 టీఎంసీల సామర్థ్యం, 320 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసేలా నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ దుమ్ముగూడెం బ్యారేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3,481కోట్లతో పరిపాలనా అనుమతులిచ్చింది. 63 మీటర్ల ఎత్తులో, భూసేకరణ అవసరం లేకుండా నదిలోనే నీళ్లు నిల్వ ఉండేలా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండల పరిధిలోని అమ్మవారిపల్లి వద్ద ఈ బ్యారేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ బ్యారేజీ నిర్మాణ పనులకు త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

## ఈనెల 24 నుంచి
# ఈ-సెట్ దరఖాస్తులు

- ఫార్మసీ, కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులూ బయో టెక్నాలజీకి అర్హులే
- పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసెట్ కమిటీ సమావేశంలో నిర్ణయం

**సాక్షి, హైదరాబాద్:** పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తయిన విద్యార్థులు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు (ల్యాటరల్ ఎంట్రీ) నిర్వహించే ఈ–సెట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తులను ఈనెల 24వ తేదీ నుంచి వచ్చే నెల 28వ తేదీ వరకు స్వీకరించాలని ప్రవేశాల కమిటీ నిర్ణయించింది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈనెల 20వ తేదీన జారీ చేయనుంది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. అనంతరం పాపిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పరీక్ష కూడా ఆన్‌లైన్‌లోనే ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో ఏమైనా పొరపాట్లు దొర్లితే విద్యార్థులు ఏప్రిల్ 9 నుంచి 12 తేదీ వరకు సవరించుకోవచ్చని సూచించారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, మే 2వ తేదీన పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఈ–సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ మాట్లాడుతూ ఈసారి ఈ–సెట్ ఆన్‌లైన్ పరీక్షలను రెండు సెషన్లలో నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈసీఈ, ఈఐఈ, సీఎస్ఈ, ఈఈఈ బ్రాంచీల వారికి, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు సివిల్, కెమికల్, మెకానికల్, మైనింగ్, ఎంఈటీ, పీహెచ్ఎం, బీఎస్ఎం వారికి పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఈసారి బయోటెక్నాలజీ కోసం ఈ–సెట్ రాసేందుకు కెమికల్ టెక్నాలజీ, ఫార్మసీ వారికి అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. ఇక విద్యార్థులు రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 8 వరకు, రూ.1,000 ఆలస్య రుసుముతో 18 వరకు, రూ.5 వేల ఆలస్య రుసుముతో 25 వరకు, రూ.10 వేల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 28వ తేదీ వరకు దరఖాస్తులను సబ్మిట్ చేయవచ్చని తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం తెలంగాణలో 18, ఆంధ్రప్రదేశ్‌లో 4 ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.



# ఇంజనీరింగ్‌పై నో ఇంట్రెస్ట్!

- ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏటేటా తగ్గిపోతున్న సీట్ల భర్తీ
- 2016 సంవత్సరంలో 70.34 శాతమే భర్తీ అయిన సీట్లు
- 2019లో మేనేజ్‌మెంట్ సహా సీట్ల భర్తీ 66.90 శాతమే..
- పూర్తి స్థాయి లెక్కలు తేల్చిన ఉన్నత విద్యా మండలి
- ఇప్పటికే మూసివేత, కోర్సుల రద్దుకు కొన్ని కాలేజీల దరఖాస్తులు
- డిమాండున్న ఏఐ, బిగ్ డాటా వంటి కోర్సుల వైపే విద్యార్థుల మొగ్గు

**సంవత్సరాల వారీగా ఇంజనీరింగ్‌లో ప్రవేశాల పరిస్థితి ఇదీ**

| సంవత్సరం | కాలేజీలు | మొత్తంసీట్లు | కన్వీనర్ | మేనేజ్‌మెంట్ | మొత్తంభర్తీ | ఖాళీ | భర్తీ శాతం |
|---|---|---|---|---|---|---|---|
| 2016 | 220 | 1,04,758 | 54,064 | 19,622 | 73,686 | 31,072 | 70.34 |
| 2017 | 212 | 98,021 | 50,258 | 18,095 | 68,353 | 29,668 | 69.73 |
| 2018 | 202 | 97,109 | 48,669 | 19,469 | 68,138 | 28,971 | 70.17 |
| 2019 | 187 | 93,790 | 46,134 | 16,610 | 62,744 | 31,046 | 66.90 |

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యపై విద్యార్థులు ఆసక్తి చూపటం లేదు. పలు కోర్సులకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో విద్యార్థులు ఆ కోర్సుల్లో చేరడానికి నిరాసక్తత చూపుతున్నారు. ఇక ఇటు యాజమాన్యాలే కాలేజీల మూసివేత, కోర్సుల రద్దుకు దరఖాస్తు చేసుకుంటుండగా, మరోవైపు తగిన వసతులు, ఫ్యాకల్టీ లేక అనుబంధ గుర్తింపు ఇచ్చే యూనివర్సిటీలు వివిధ కోర్సుల్లో సీట్లకు కోత పెడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా 4 వేల నుంచి 7 వేల వరకు క్రమంగా సీట్లకు కోత పడుతోంది. దీంతో అనుబంధ గుర్తింపు లభిస్తున్న సీట్ల సంఖ్య తగ్గుతోంది. అనుమతించినా సీట్లు కూడా పూర్తిగా భర్తీ కావడం లేదు. మొత్తంగా గడిచిన నాలుగేళ్లలో దాదాపు 11 వేల మంది విద్యార్థులు తగ్గిపోయారు. ఉన్నత విద్యా మండలి తేల్చిన తాజా పూర్తి స్థాయి లెక్కలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

### నాలుగేళ్లలో 33 కాలేజీలు మూత..

ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. మేనేజ్‌మెంట్ కోటాలో 2016 నుంచి 2018 వరకు ప్రవేశాల్లో పెద్దగా తగ్గుదల లేనప్పటికీ 2018 నుంచి 2019కి వచ్చేసరికి మాత్రం భారీగానే ప్రవేశాలు తగ్గిపోయాయి. కన్వీనర్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా కలుపుకొని 2016 సంవత్సరంలో రాష్ట్రంలోని 220 ఇంజనీరింగ్ కాలేజీల్లో 1,04,758 సీట్ల భర్తీకి యూనివర్సిటీలు అనుబంధ గుర్తింపునిచ్చాయి. అదే 2019 సంవత్సరం వచ్చేసరికి 187 కాలేజీల్లోని 93,790 సీట్లకే అనుబంధ గుర్తింపును ఇచ్చాయి. అంటే నాలుగేళ్లలో 33 కాలేజీలు మూతపడగా, 10,968 సీట్లు రద్దయ్యాయి. మరోవైపు విద్యార్థులు చేరకపోవడంతో ప్రవేశాలు తగ్గిపోయాయి. 2016లో 73,686 మంది విద్యార్థులు ఇంజనీరింగ్‌లో చేరగా, 2019లో 62,744 మంది మాత్రమే ఇంజనీరింగ్‌లో చేరారు. ఇందులో కన్వీనర్ కోటాలో చేరే విద్యార్థుల సంఖ్యే ఎక్కువగా తగ్గింది. 2016లో 54,064 నుంచి 46,134కు పడిపోయింది. గడిచిన రెండేళ్ల ప్రవేశాలను పరిశీలిస్తే మాత్రం మేనేజ్‌మెంట్ కోటాలోనూ చేరుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

### డిమాండ్ లేని కోర్సులకు దూరం..

ప్రస్తుతం ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్న కోర్సులకే తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రాధాన్యం ఇస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించే కాలేజీల్లోనే చేర్చేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో ప్రమాణాలు పాటించని కాలేజీలు క్రమంగా మూతపడుతున్నాయి. విద్యార్థులు కూడా తమ ఆలోచనను మార్చుకొని టైంపాస్ కోసం ఏదో ఓ కోర్సులో చేరాలనుకోవడం లేదని విద్యావేత్తలు చెబుతున్నారు. ఉద్యోగం లేదా ఉపాధి అవకాశాలు లేకపోతే వాటిల్లో చేరేందుకే అస్సలు ఇష్టపడటం లేదని వారంటున్నారు. ఇలాంటి కారణాలతోనే ఏటా 8 నుంచి 15 వరకు కాలేజీలు మూత పడుతూనే ఉన్నాయి. ఈసారి కూడా 10 కాలేజీలు మూసివేత కోసం జేఎన్‌టీయూకు దరఖాస్తు చేసుకున్నాయి. మరికొన్ని కాలేజీలు డిమాండ్ లేని కోర్సుల రద్దుకు దరఖాస్తు చేసుకున్నాయి. దీంతో ఈసారి మరో 7 వేల వరకు సీట్లు తగ్గిపోవచ్చు. అయితే మార్కెట్‌లో డిమాండున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డాటా, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. అయితే అవి ఇప్పటివరకు అన్ని కాలేజీల్లో లేవు. 2020–21 విద్యా సంవత్సరం నుంచి మాత్రం జేఎన్‌టీయూలోని అన్ని కాలేజీల్లో ఆయా కోర్సులను ప్రవేశపెట్టేందుకు యూనివర్సిటీ ఓకే చెప్పింది. ఈ నేపథ్యంలో 3 వేల వరకు సీట్లలో ఆయా కోర్సులకు అనుమతి ఇచ్చే అవకాశముంది. అయినా 2020 ప్రవేశాల్లో 4 వేల వరకు సీట్లు తగ్గే పరిస్థితులే కనిపిస్తున్నాయి. మరోవైపు ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్‌లోనూ అదే పరిస్థితి నెలకొంది. ప్రవేశాల్లో తగ్గుదలే తప్ప పెరుగుదల కనిపించడం లేదు.

## లోపాలపై నివేదికలివ్వకుంటే
# అప్రూవల్ కష్టమే

- ఇప్పటికే మూడుసార్లు నోటీసులు జారీ చేశాం
- జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోవర్ధన్ వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ పరిసరాల్లోని 111 జీవో పరిధిలో స్థల, అనుమతుల సమస్యలను ఎదుర్కొంటున్న కాలేజీలు లోపాల సవరణ నివేదికలను ఇవ్వకపోతే వాటికి అనుమతులు ఇవ్వడం కష్టమేనని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోవర్ధన్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో ఎంసెట్ కమిటీ సమావేశం సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఆయా కాలేజీలకు తాము ఇప్పటివరకు మూడుసార్లు నోటీసులు జారీ చేశామన్నారు. 111 జీవో పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో మొత్తంగా 154 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయని, అందులో 81 కాలేజీలు నివేదికలను ఇవ్వగా, మిగతా కాలేజీలు ఇవ్వలేదని పేర్కొన్నారు.



దీనిపై తాము రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆయా కాలేజీలతోపాటు మరి కొన్ని కాలేజీల భవన అనుమతులకు సంబంధించిన అంశం ఏఐసీటీఈ పరిధిలో ఉందని, ఏఐసీటీఈ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మరోవైపు అనుబంధ గుర్తింపు ఇచ్చే సమయంలో ల్యాబ్‌లు, సదుపాయాలు, ఫ్యాకల్టీ తదితర అంశాలను పరిశీలిస్తామన్నారు. పీహెచ్‌డీల జెన్యూనిటీ విషయంలో తాము పరిశీలన జరుపుతున్నామని, అనేక లోపాలను గుర్తించామన్నారు. కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించామని, ఏఐసీటీఈ ఈనెల 29వ తేదీ వరకు గుర్తింపు కోసం గడువిచ్చినందున, తాము అనుబంధ గుర్తింపు గడువు మళ్లీ పొడగిస్తామన్నారు. ఇక రాష్ట్రంలో మొత్తంగా 15 కాలేజీలు కోర్సుల రద్దుకు దరఖాస్తు చేసుకున్నాయని, అందులో 7 పూర్తిగా కాలేజీలను మూసి వేసుకునేందుకే దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.



శనివారం జేబీఎస్-ఎంజీబీఎస్ మెట్రో రైలు లోకోపైలట్ క్యాబిన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# ప్రభుత్వ వైఖరి వల్లే ఆగిన మెట్రో

- పాతబస్తీకి మెట్రో రాకుండా మజ్లిస్ అడ్డుపడుతోంది
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్:** పాతబస్తీకి మెట్రో రైలు రాకుండా మజ్లిస్ పార్టీ అడ్డుపడుతోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. మజ్లిస్, టీఆర్ఎస్ పార్టీల వైఖరి వల్లే పాతబస్తీకి మెట్రో ఆగిందని విమర్శించారు. బీజేపీ ప్రతినిధుల బృందం ఆధ్వర్యంలో శనివారం ఆయన జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ వరకూ మెట్రో రైలులో ప్రయాణించారు. అనంతరం ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు యుద్ధ ప్రాతిపదికన అనుమతులు మంజూరు చేశారని గుర్తు చేశారు. మెట్రో ఛార్జీలు అధికంగా ఉన్నాయని అన్నారు. పాతబస్తీలోని ఫలక్‌నుమా వరకూ మెట్రోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత బస్తీకి మెట్రో అందుబాటులోకి వస్తే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. మెట్రో ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనకు ఫోన్ చేసి ఆహ్వానించారని, పార్లమెంట్ సమావేశాల సందర్భంగా విప్ జారీ చేశారని, అలాగే బిజినెస్‌లో సమాధానం చెప్పాల్సి ఉండటంతో రాలేకపోయానని చెప్పానని తెలిపారు. మంత్రి కేటీఆర్ ప్రధాని మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఎంఎంటీఎస్ ఫేజ్–2ను యాదగిరిగుట్ట వరకూ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం రాష్ట్రానికి నిధులు ఇస్తున్నా, రైల్వే శాఖ ముందుకు వచ్చినా తెలంగాణ ప్రభుత్వం సరైన స్థలం కేటాయించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఎంఎంటీఎస్ నిర్మాణం అందుబాటులోకి రాకుండా తెలంగాణ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. నగరంలోని అసెంబ్లీ ముందుగా మెట్రో రైలు వెళితే చారిత్రాత్మక కట్టడాలు దెబ్బతింటాయని వ్యాఖ్యానించిన సీఎం కేసీఆర్ ఆ తర్వాత ఎందుకు అదే మార్గానికి ఆమోదం తెలిపారో చెప్పాలని నిలదీశారు. మెట్రో, ఎంఎంటీఎస్‌ల అధికారులు సమన్వయంతో వ్యవహరించకపోవడం వల్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు పాల్గొన్నారు.

# సాగునీటి శాఖకు కొత్త రూపు!

- శాఖ పునర్వ్యవస్థీకరణ కొలిక్కి
- సీఎం సూచనల మేరకు మార్పులు చేర్పులు
- ఎస్సారెస్పీ ఆయకట్టు లోయర్ మానేరు వరకు.. సాగర్ ఆయకట్టు పాలేరు ఎగువకే కట్టడి
- పంప్‌హౌస్‌ల పర్యవేక్షణకు బేసిన్‌ల వారీగా ఇద్దరు సీఈలు

**సాక్షి, హైదరాబాద్ :** రాష్ట్రంలో సాగునీటి శాఖ పూర్తిగా కొత్త రూపును సంతరించుకోనుంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాలకు అనుగుణంగా శాఖ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. సీఎం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ మార్పులు చేర్పులతో కూడిన ప్రక్రియ ముగింపు దశకు రాగా దీనికి ఒకట్రెండు రోజుల్లో ఆమోదం దక్కనుంది. రాష్ట్రంలో భారీ సాగునీటి ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తి కావస్తుండటం, ఇదే సమయంలో కాల్వలు, పంపులు, పంప్‌హౌస్‌లు, బ్యారేజీలు, రిజర్వాయర్‌ల నిర్వహణ కత్తిమీద సాములా మారనున్న తరుణంలో విప్లవాత్మక చర్యలు అత్యంత కీలకం కానున్నాయి. భారీ, మధ్యతరహా, చిన్నతరహా అనేది లేకుండా అన్నింటినీ ఒకే గూటి కిందకు తేనున్నారు. ఈఎన్‌సీలు, సీఈల వారీగా ఏయే ప్రాజెక్టులు ఉంచాలి, ఎంత ఆయకట్టు వారి పరిధిలో ఉంటుందన్న దానిపై ఇప్పటికే కసరత్తు పూర్తయింది. ఎత్తిపోతల పథకాల్లో ఎలక్ట్రో మెకానికల్, ప్రెషర్ మెయిన్స్, పంప్‌హౌస్‌ల నిర్వహణను చూసేందుకు గోదావరి, కృష్ణా బేసిన్‌ల వారీగా ఇద్దరు సీఈలను కొత్తగా నియమించనున్నారు. ఇక చెరువులు, చెక్‌డ్యామ్‌ల పనులు చూసేందుకు బేసిన్ల వారీ ఇద్దరు సీఈలు యధావిధిగా ఉండే అవకాశం ఉంది.

### ప్రక్షాళన ఇలా...

- కరీంగనర్ డివిజన్ కాళేశ్వరం ఈఎన్‌సీ పరిధిలో మూడు బ్యారేజీలు, పంప్‌హౌస్‌లతో పాటు ఎల్లంపల్లి బ్యారేజీతో పాటు దానికింద మిడ్‌మానేరు వరకు నీటిని ఎత్తిపోసే ప్యాకేజీలన్నీ రానున్నాయి. ఈ బ్యారేజీల పరిధిలో కొత్తగా చేపట్టే ఎత్తిపోతలు దీని పరిధిలోనే ఉండనున్నాయి. ఈఎన్‌సీ కింద మొత్తం లక్ష ఎకరాల ఆయకట్టు ఉండనుంది.
- శ్రీరాంసాగర్ సీఈ పరిధిలో లోయర్‌మానేరు వరకు మాత్రమే ఆయకట్టును పరిమితం చేయనున్నారు. దీంతోపాటుగా కడెం, సదర్‌మట్, ఆదిలాబాద్‌లోని కాళేశ్వరం ఆయకట్టు, ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ఉండనున్నాయి. మొత్తంగా 7.42లక్షల ఆయకట్టు ఉంటుంది.
- కరీంనగర్‌లోని మరో ఈఎన్‌సీ పరిధిలో లోయర్ మానేరు నుంచి దిగువన సూర్యాపేట వరకు ఉన్న ఆయకట్టును కొత్తగా చేర్చారు. దీంతో పాటే ఎల్లంపల్లి దిగువ ఆయకట్టు, మిడ్‌మానేరు నుంచి గౌరవెల్లి రిజర్వాయర్, దానికింద ఆయకట్టును తెచ్చారు. మధ్యతరహా ప్రాజెక్టులు ఈఎన్‌సీ కిందే ఉండనున్నాయి. మొత్తంగా 13లక్షల ఎకరాల ఆయకట్టు ఈఎన్‌సీ పరిధిలో ఉండనుంది.
- నిజామాబాద్ సీఈ పరిధిలోకి కాళేశ్వరంపై ఆధారపడ్డ నిజాంసాగర్ ఆయకట్టు, మధ్యతరహా ప్రాజెక్టులు ఉంటాయి. సీఈ కింద 6.82లక్షల ఆయకట్టు ఉంటుంది.
- వరంగల్ సీఈ పరిధిలో ఇప్పటికే దేవాదుల, మధ్యతరహా ప్రాజెక్టులు ఉండగా కొత్తగా సమ్మక్క బ్యారేజీని చేర్చారు. ఆయకట్టు 6.07 లక్షల ఎకరాలు.
- ఖమ్మం సీఈ పరిధిలో సీతారామ, సీతమ్మసాగర్, పాలేరు దిగువన ఉన్న నాగార్జునసాగర్ ఆయకట్టు, భక్తరామదాస, మధ్యతరహా పథకాలు ఉంటాయి. ఆయకట్టు 7.16 లక్షల ఎకరాలు.
- హైదరాబాద్ డివిజన్ కాళేశ్వరం ఈఎన్‌సీ పరిధిలో మిడ్‌మానేరు నుంచి గంధమల వరకు ఉన్న ప్యాకేజీలతో పాటు, కొత్తగా సింగూరు, ఘణపూర్, మధ్యతరహా ప్రాజెక్టులను చేర్చారు. ఆయకట్టు 11.54లక్షలు.
- ఆదిలాబాద్ సీఈ పరిధిలో ప్రాణహిత, చనాకా–కోరటా, పెనుగంగ, కుప్టి, కొమరంభీంతో పాటు మధ్యతరహా ప్రాజెక్టులు. ఆయకట్టు 4.53లక్షలు.
- మహబూబ్‌నగర్ సీఈ పరిధిలో జూరాల, ఆర్డీఎస్, నెట్టెంపాడు, గట్టు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఉండనుండగా, ఆయకట్టు 11.95లక్షల ఎకరాలు.
- పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలు ఒక్క సీఈ పరిధిలో ఉండనుంది. ఆయకట్టు 12.30లక్షల ఎకరాలు.
- నల్లగొండ సీఈ పరిధిలో నాగార్జునసాగర్ ఆయకట్టు పాలేరు వరకు, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు, డిండి, మధ్యతరహా ప్రాజెక్టులుండనున్నాయి. ఆయకట్టు 10.97లక్షల ఎకరాలు.

## బ్రదర్ అనిల్‌కు తప్పిన ప్రమాదం

**గరికపాడు(జగ్గయ్యపేట):** అంతర్జాతీయ సువార్తీకుడు బ్రదర్ అనిల్‌కుమార్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన బెంజ్‌కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు వస్తుండగా శనివారం తెల్లవారుజామున కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద 9వ నంబర్ జాతీయ రహదారిపై ఆర్టీఏ చెక్‌పోస్ట్ సమీపంలో ప్రమాదానికి లోనైంది. ముందు వెళుతున్న వాహనాన్ని ఎడమవైపు నుంచి ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించగా.. ఆ వాహనం ఒక్కసారిగా ఈ కారు వైపునకే వచ్చింది. అప్రమత్తమైన డ్రైవర్ కారును రోడ్డు కిందకు దింపాడు. దీంతో అదుపు తప్పిన కారు సుమారు 20 అడుగుల మేరకు రోడ్డు దిగువకు వెళ్లి ఆగింది. ఈ ధాటికి కారులోని ఎయిర్‌బెలూన్‌లు తెరుచుకున్నాయి. కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. కాగా, బ్రదర్ అనిల్‌తోపాటు కారులో ఉన్న గన్‌మెన్, డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.